# అన్నమయ్య సంకీర్తనలు - వైష్ణవ భక్తి తత్త్వం

# ఒక పరిశీలన

## A CRITICAL STUDY OF
## VAISHNAVA BHAKTITATVAM IN ANNAMAYYA SAMKEERTANAS


పరిశోధకురాలు:

**ఎస్.టి. పి. శారదా దేవి**
**ఎం. ఏ.**

పర్యవేక్షణ:

**ఆచార్య సి. రమణయ్య**
**పీఠాధిపతి**


**తెలుగు విశ్వవిద్యాలయానికి**

**ఎం.ఫిల్ పట్టంకోసం సమర్పించిన**

**లఘు సిద్ధాంత వ్యాసం**


**సాహిత్యపీఠం**

**రాజమండ్రి ప్రాంగణం**

**నవంబరు - 1995**



# ధృవీకరణ పత్రం

నా పర్యవేక్షణలో పరిశోధన సాగించి, సాహిత్యపీఠం నుంచి తెలుగు విశ్వవిద్యాలయానికి కుమారి ఎస్.టి. పి. శారదాదేవి సమర్పిస్తున్న ''అన్నమయ్య సంకీర్తనలు - వైష్ణవ భక్తితత్త్వం - ఒక పరిశీలన'' అనే ఈ లఘు సిద్ధాంత గ్రంథం ఎం. ఫిల్ పట్టం కోసం అన్నివిధాలా అర్హమైందని, దీన్ని వీరు సొంతంగా రూపొందించిందని ధృవీకరిస్తున్నాను. ఇది కాని, ఇందులోని భాగాలు కాని ఇంతకు ముందు మరొక డిగ్రీ లేదా డిప్లమాలకు మరింకే విశ్వవిద్యాలయాలకి, ఏ సంస్థకూ సమర్పించలేదు.

పర్యవేక్షకులు

(ఆచార్య సి. [illegible])

శాఖాధిపతి

## హామీ పత్రం

''అన్నమయ్య సంకీర్తనలు - వైష్ణవ భక్తితత్త్వం - ఒక పరిశీలన'' అనే ఈ ఎం. ఫిల్ లఘు సిద్ధాంత వ్యాసాన్ని నేనే స్వయంగా వ్రాసాను, ఈ పరిశోధన నా స్వయంకృషి ఫలితమేనని, దీనిని మా పర్యవేక్షకుల ఆధ్వర్యంలో వ్రాసానని ధ్రువీకరించు చున్నాను.

పరిశోధకురాలు

S.T.P. Sarada Devi

( ఎస్. టి. పి. శారదా దేవి )

# విషయ సూచిక



పుట

కృతజ్ఞతలు I

ఉపక్రమణిక III

ఒకటో ప్రకరణం

వైష్ణవం - లక్షణాలు - ఆవిర్భావ వికాసాలు 1 - 43

రెండో ప్రకరణం

అన్నమయ్య సంకీర్తనల్లో వైష్ణవ భక్తి తత్త్వం 44 - 88

మూడో ప్రకరణం

అన్నమయ్య సంకీర్తనల్లో వైష్ణవ పూజా విధానం 89 - 110

నాలుగో ప్రకరణం

అన్నమయ్య స్తుతించిన వైష్ణవ భక్తులు 111 - 143

ఐదో ప్రకరణం

వైష్ణవ వాగ్గేయకారుల్లో అన్నమయ్య స్థానం 144 - 166

ఉపయుక్త గ్రంథ సూచిక. 167 - 169



నా వెన్నంటి నిల్చి, నన్ను చల్లగా చూసే స్వామి

తిరుమల **శ్రీనివాసుడికి**,

"అన్నమయ్య సంకీర్తనలు - వైష్ణవ భక్తి తత్త్వం - ఒక పరిశీలన"
అనే అంశం మీద పరిశోధనకు అవకాశం కల్పించిన తెలుగు విశ్వ
విద్యాలయం ఉపాధ్యక్షులు **ఆచార్య పేర్వారం జగన్నాథం** గారికి,

నా అభిరుచిమేరకు పరిశోధనాంశాన్ని సూచించి,
పర్యవేక్షణ బాధ్యతలు వహించిన సాహిత్య పీఠాధిపతి **ఆచార్య కడప**
**రమణయ్య** గారికి, సలహాలిచ్చి ప్రోత్సహించిన ఆచార్య కె. సర్వోత్తమరావుగా

అనుక్షణం ప్రోత్సహించిన **డా॥ అల్లం పద్మబాల** గారికి,

సాహిత్యపీఠం బోధన, బోధనేతర సిబ్బందికి,

అసిస్టెంట్ లైబ్రేరియన్ **తిరుబాయి** గారికి, గ్రంథాలయ సిబ్బందికి,

అన్ని విషయాల్లోను సలహాలిచ్చి, పరిశోధనకు కావలసిన
పుస్తకాలందించిన **డా॥ అంగలూరి శ్రీరంగాచార్యులు**, **శ్రీ మొటుగు**
**గోపాలకృష్ణమాచార్యులు**, ఎ. రాజగోపాలాచార్యులు, **సాయిబాబ** గార్లకు,

వైఖానస పూజా విధానం గురించి తెలియజెప్పిన రాజమండ్రి
వేణుగోపాల స్వామి దేవాలయార్చకులు శ్రీ **విజయసారథి** గారికి,
వేదాద్రినరసింహస్వామి దేవాలయార్చకులు శ్రీ **రామాచార్యులు** గారికి,
సుమన్నా **భానుమూర్తి** గారికి,

సర్వదా నా అభివృద్ధినే ఆకాంక్షించే నా **తల్లిదండ్రులకి**,
నన్ను ప్రోత్సహించే **అన్నయ్య**, **అక్కలకి**, ప్రియబాంధవులు
**కౌశల్యని**, **సుందరి**, **అరుణలకు**, అన్నయ్య **పారిడి శ్రీనుకి**,

తమ్ముడు **ఈశ్వర్ రెడ్డి**కి,

లోపలి చిత్రాన్ని, టైటిల్స్‌ని అందంగా చిత్రించిన

**ఈశ్వర్ గ్రాఫిక్ ఆర్ట్స్-రాజమండ్రి** వారికి,

ఈ సిద్ధాంత గ్రంథానికి అక్షరాలంకరణ చేసిన **శ్రీనివాస్ సింగ్**కి,

మరెందరో హితులు, సన్నిహితులకి .......

కృతజ్ఞతలు

# ఉపక్రమణిక

ఏ భాషా సాహిత్యాన్నైనా పరిశీలించి చూస్తే దాని అభివృద్ధికి వెనక ఏదో ఒక మతప్రమేయం ఉంటుంది.

తెలుగు గేయసాహిత్య ప్రక్రియాభివృద్ధి కోసం సుమారుగా 150 ఏళ్ళకిపైగా తాళ్ళపాక వంశకవులు విశిష్టమైన సేవ చేశారు. గేయానికి పద్యకవిత్వంతో సమానమైన పీఠం వేయించారు. అయితే వీళ్ళు వైష్ణవమతాన్ని ఆలంబనగా చేసుకుని, విష్ణుస్వరూపుడైన శ్రీవేంకటేశ్వరుని కీర్తించారు. తాళ్ళపాక కవి వంశమూల పురుషుడైన అన్నమయ్య కీర్తనల్లో వైష్ణవభక్తితత్త్వం నిండి ఉంది. దానిపైన పరిశోధన చెయవలసి ఉన్నందున, ఇంతవరకు ఎవరూ చెయనందువల్ల ఈ "అన్నమయ్య సంకీర్తనలు - వైష్ణవ భక్తితత్త్వం - ఒక పరిశీలన" అనే అంశాన్ని స్వీకరించడమైంది.

ఈ పరిశోధనాంశాన్ని ఐదు ప్రకరణాలుగా విభజించి పరిశీలించడం జరిగింది.

"వైష్ణవం - లక్షణాలు - ఆవిర్భావవికాసాలు" అనే ఒకటో ప్రకరణంలో వైష్ణవమత ఆవిర్భావ వికాసాల్ని, తల్లక్షణాల్ని వివరించడ[illegible]

"అన్నమయ్య సంకీర్తనల్లో వైష్ణవ భక్తితత్త్వం" అనే రెండో ప్రకరణంలో అన్నమయ్య సంకీర్తనల్లో చెప్పబడిన వైష్ణవభక్తితత్త్వాన్ని పరిశీలించడం జరిగింది.

"అన్నమయ్య సంకీర్తనల్లో వైష్ణవపూజావిధానం" అనే మూడో ప్రకరణంలో అన్నమయ్య కీర్తనల్లో కనిపించిన వైష్ణవపూజావిధానాన్ని చెప్పడం జరిగింది.

"అన్నమయ్య స్తుతించిన వైష్ణవభక్తులు" అనే నాల్గో ప్రకరణంలో అన్నమయ్య తన కీర్తనలద్వారా స్తుతించిన వైష్ణవభక్తుల్ని గురించి ఆకీర్తనలద్వారానే పరిచయం చెయ్యడమైంది.

"వైష్ణవ వాగ్గేయకారుల్లో అన్నమయ్యస్థానం" అనే ఐదో ప్రకరణంలో వైష్ణవ భక్తిగీతాలాలపించిన వాగ్గేయకారుల్లో అన్నమయ్య స్థానాన్ని నిరూపించడం జరిగింది.

ఒకటో ప్రకరణం

# వైష్ణవం-లక్షణాలు ఆవిర్భావ వికాసాలు

# వైష్ణవం - లక్షణాలు ఆవిర్భావ వికాసాలు

మతం అంటే "జ్ఞానం, ఇచ్ఛ, తలపడినది, విశ్వసింపబడినది అనే అర్థాలున్నాయి."[1] స్థూలంగా మతం అంటే అభిప్రాయం లేదా సిద్ధాంతం అని అనుకోవచ్చు. సంస్కృతంలో వున్న "ధర్మః" అనేపదానికి బదులుగా తెలుగులో 'మతము' అనేమాటని వాడుతున్నారు.

మానవుడు సృష్ట్యాదినుండి భగవంతుని అద్భుత వ్యాపారమైన ఈసృష్టితత్త్వాన్ని తెలుసుకోవడానికి అనేకవిధాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ప్రతివ్యక్తి తనకర్థమైనరీతిలో పరమేశ్వరుని చర్యలకి భాష్యం

---

1. శ్రీసూర్యరాయాంధ్రనిఘంటువు - ఐదోసంపుటం - పుట.370

చెప్తూనే ఉన్నాడు. ఇలా ఒక్కొక్కరు ఒక్కొక్కరీతిలో తమతమ అభిప్రాయాల్ని సిద్ధాంతీకరించి, ప్రజల్లో ప్రచారంచేసి, తమమనోనేత్రానికి గోచరించిన భగవత్స్వరూపానికి, సృష్టికి ఒకస్థిరమైనపేరు ఏర్పరచి వ్యాప్తిలోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నాల ఫలితంగా మతం ఆవిర్భవించింది.

"నేటి ప్రపంచప్రసంస్కారమునకంతటికిని వేదములే మూలాధారాలనవచ్చును."[1] మహర్షులకు వేదాలఅర్థాలువేరువేరుగా స్ఫురించాయి. వేదమతం ఒక్కటే విభిన్నమతాలుగా విస్తరించిందంటారు. వీటిల్లో న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, పూర్వమీమాంసా, ఉత్తరమీమాంసా మతాలు ఆరు ప్రధానాలు. ఈ ఆరూ దర్శనాలని వ్యవహరింపబడుతున్నాయి. ఇందులో ఉత్తరమీమాంసాదర్శనానికి వేదాంతదర్శనమనిపేరు. ఇదికూడా వేదాలలాగే ఆచార్యులదృష్టికి వేరువేరుగాతోచి, వారివారిఅభిప్రాయ భేదాల్నిబట్టి వివిధశాఖలయ్యింది. శైవదర్శనం శివపారమ్యంగురించి చెబుతుంటే, మిగిలిన దర్శనాలు విష్ణుపారమ్యాన్ని తెలియజేస్తున్నాయి. ఇలా అనేకమతాల ఆవిర్భావానికి వేదాలు అవకాశమిచ్చాయి.

తర్వాత ఇతిహాస, పురాణాలు ఏర్పడి వేదమతాన్ని వ్యాఖ్యానించడం ప్రారంభించాయి. వైదికమతాలన్నీ ఈ ఇతిహాస, పురాణాల

---

1. డా॥ వేటూరి ఆనందమూర్తి - వైష్ణవాంధ్రవాఙ్మయం - పుట. 3

ప్రామాణ్యాన్ని అంగీకరించి , తద్వారా తమతమ మతాల్ని అభివృద్ధిచేసుకున్నాయి. ముఖ్యంగా ఈమతాల్ని శైవాలని, వైష్ణవాలని రెండువిధాలుగా చెప్పవచ్చు. పురాణాల్లోకూడా కొన్ని శివపరత్వాన్ని , కొన్ని విష్ణుపరత్వాన్ని ప్రతిపాదిస్తున్నాయి.

**వైష్ణవవికాసం** :- వేదకాలంనుంచికూడా వైష్ణవం ప్రచారంలోఉన్నట్లు తెలుస్తోంది. "శృణోతు మిత్రః అర్యమాభగో " మొదలైన వేదవాక్యాల్లో 'భగ' శబ్దం కనిపిస్తోంది. ఈభగశబ్దానికి 'శ్రేయశ్శక్తి' అనే అర్థంఉంది. ఆశక్తి గలవాడు భగవానుడని భావించబడింది. ఆభగవానుని ఆరాధించేవారు భాగవతులు. వారిమతం భాగవతం. అదే వైష్ణవం. ఇది విష్ణుని భగవానునిగా గ్రహించింది.

విష్ణుశబ్దానికి "విశ్వం వేవేష్టి వ్యాప్నోతీతి విష్ణుః"[1] అని వ్యుత్పత్తి. అంటే చరాచరాత్మకమైన సర్వప్రపంచంలోనూ వ్యాపించి , ప్రాణులకి ఏయేకాలాల్లో ఏవికావాలో వాటిని వారికి ఇస్తూ , వారిని వదలకుండా ఉండేవాడని అర్థం.

"యస్మాద్విష్ణురిదం సర్వం సత్యశక్త్యా మహాత్మనః ।
తస్మాత్ప్రోచ్యతే విష్ణుః విశేర్ధాతోః ప్రకాశనాత్ ॥"

---

1. డా॥ వేటూరి ఆనందమూర్తి , వైష్ణవాంధ్రవాఙ్మయము , పుట-17.

తనశక్తిచేత ప్రపంచమంతయు వ్యాపించియున్నవాడు, వారికి కావలసినవి యొసంగువాడు, వారిని వదలకయుండువాడుకాన విష్ణువనబడెను.[1]

వ్యాప్త్యర్థకమైన 'విష్లృ' ధాతువునుంచి 'విష్ణు' శబ్దం పుడుతోంది. వ్యాపక పరబ్రహ్మ పరమాత్మే విష్ణుశబ్దంచేత వ్యవహరింపబడుతున్నాడు.

విష్ణుః శిపివిష్ణుః . అనగా కిరణాలని ధరించినవాడని అర్థం. విష్ణువు తనకిరణాలతో విశ్వాన్ని ఆవరించిఉన్నాడు. ఆకారణంతో విష్ణువు సూర్యుని రూపాలలో ఒకరూపంగా భావించబడ్డాడు. సూర్యుడు ఈవిశ్వాన్ని చుట్టివస్తున్నట్లు కనబడుతుండడంచేత అతడే విశ్వవ్యాపి అనీ, జగత్కారకుడనీ వేదకాలంలో చెప్పబడింది. ఋగ్వేదంలో చాలాచోట్ల విష్ణువు జగద్వ్యాపి అని చెప్పబడింది. అందువల్ల విష్ణునామం సూర్యునితో అనుసంధించబడింది. ఆకాలంలో సూర్యుడికి చెప్పబడిన లక్షణాలన్నీ సూర్యాంతరాత్మశక్తికి చెందినవి కావడంచేత విష్ణువే సూర్యాంతరాత్మగా భావింపబడింది. ఈవిషయం మైత్రేయ ఉపనిషత్తులోనూ, మహాభారతంలోనూ వర్ణింపబడింది. విష్ణువు పన్నెండో సూర్యుడిగా 'శతపథబ్రాహ్మణం' చెప్పింది. వైష్ణవ సంధ్యావందనం సాయం సూర్యోపస్థానమంత్రంలో —

---

1. గరిమెళ్ళ వీరరాఘవులు — విష్ణుతత్త్వము - విగ్రహము — పుట.1

" ధ్యేయస్సదా సవితృమణ్డల మధ్యవర్తీ
నారాయణ స్సరసిజాసన సన్నివిష్టః
కేయూరవాన్ మకర కుణ్డలవాన్ కిరీటీ
హారీ హిరణ్మయ వపుర్ధృత శఙ్ఖ చక్రః
శఙ్ఖ చక్ర గదాపాణే ద్వారకా నిలయాచ్యుతః।
గోవిన్ద పుణ్డరీకాక్ష రక్షమాం శరణాగతమ్ ॥ " 1

అనే శ్లోకాన్ని "ఓం ప్రాచ్యైదిశేనమః ... ఓం భూమ్యైనమః , ఓం విష్ణవేనమః " అని వందనంచేస్తూ పఠిస్తారు.

ఆ సమయంలో వారు - నాలుగుభుజాలుకలవాడు , సూర్యమండలాంతర్వర్తి , ఎర్రతామర పుష్పాసనం మధ్యలో కూర్చున్నవాడు , కిరీటం , హారం , భుజకీర్తులు , మురుగులు మొదలైన ఆభరణాలచేత అలంకరింపబడినవాడు , శ్రీవత్సము , తులసిమాల , కౌస్తుభము ధరించినవాడు , పీతాంబరుడు , శంఖచక్రాది ఆయుధాలు ధరించినవాడు అయిన శ్రీమహావిష్ణువు సూర్యమండలం మధ్యలో ఉన్నట్లుగా భావించాలి.

సూర్యుడు రెక్కలుకలిగిన దేవతాపక్షిగాచెప్పబడ్డాడు.

---

1. మెలుగు రామానుజాచార్యస్వామి , శ్రీవైష్ణవ ఆహ్నికం - నిత్యకర్మానుష్ఠాన విభాగం (ప్రథమభాగం) , పుట - 33 , 34 .

విష్ణువాహనం దేవతాపక్షి అయిన గరుడుడు. ఇలా ఋగ్వేదంలో మొదట దేవతలందరిలోనూ ఒకదేవతగా చెప్పబడిన విష్ణువు తర్వాత దేవతలందరికీ దేవతగా భావింపబడే పరతత్త్వస్వరూపంగా భావింపబడ్డాడు.

విష్ణువులోనే వరుణునిధర్మపాలనం, ఇంద్రుని మేధాశక్తి, అగ్నివీర్యం, సూర్యుని దివ్యజ్ఞానం గుర్తించబడ్డాయి. అతడే సృష్టి, స్థితి, లయకారకుడని భావించబడింది. పరమపదవాసి అయిన విష్ణువే క్రమంగా త్రివిక్రమ, నారాయణ, వాసుదేవ, శ్రీకృష్ణనామాలతో వ్యవహరింపబడ్డాడు. సటీకామరకోశంలో విష్ణువుకి నారాయణ, కృష్ణ, వైకుంఠ, విష్టరశ్రవ, దామోదర, హృషీకేశ, కేశవ, మాధవ, స్వభూ(స్వయంభువు), దైత్యారి, పుండరీకాక్ష, గోవింద, గరుడధ్వజ, పీతాంబర, అచ్యుత, శార్ఙ్గి, విష్వక్సేన, జనార్దన, ఉపేంద్ర, ఇంద్రావరజ, చక్రపాణి, చతుర్భుజ, పద్మనాభ, మధురిపు, వాసుదేవ, త్రివిక్రమ, దేవకీనందన, శౌరి, శ్రీపతి, పురుషోత్తమ, వనమాలి, బలిధ్వంసి, కంసారాతి, అధోక్షజ, విశ్వంభర, కైటభజిత్, విధువు, శ్రీవత్సలాంఛనుడనే పేర్లు ఉన్నట్లు చెప్పబడింది.

మనుస్మృతికాలానికే విష్ణునామం నారాయణ శబ్దంతో అనుసంధింపబడింది. భాగవతపురాణంనాటికి ఈపేరు నిశ్చయమైంది.

ఒక్క వేదాలేకాక వేదాంతభాగాలైన ఉపనిషత్తులకూడా విష్ణువుని భగవంతునిగా చెప్పి అతని గొప్పతనాన్ని ప్రశంసించాయి. వీటిలో ఈశావాస్యోపనిషత్తు విష్ణుతత్త్వాన్ని విపులంగా చెప్పింది. మైత్రావరణీయోపనిషత్తుకూడా — "ఏవం సవితుర్వరేణ్యం ధ్రువమాచల మమృతం విష్ణుసంజ్ఞం సర్వాధారంధామ" — సూర్యుని వరణీయం, నిశ్చయం, అచంచలం, అమృతం విష్ణువునందే కలవని, వైష్ణవపదమే సర్వులకు ప్రాప్యమని ప్రతిపాదించింది.

విష్ణునామాల్లో నారాయణశబ్దం విశిష్టమైంది, ప్రధానమైంది. వైష్ణవ తిరుమంత్రమైన — "శ్రీమతే నారాయణాయనమః, నారాయణచరణౌ శరణం ప్రపద్యే, ఓం నమో నారాయణాయ" అనేవి ఈవిషయాన్ని తెలుపుతాయి.

నారాయణుడంటే నారములకి (నీటికి) అయనము (స్థానం) గా కలవాడని అర్థం. సకల ప్రాణికోటికి ప్రాణం నీరు. ఆ నీటిని ఇచ్చేవాడు అంటే సకలప్రాణులకి ప్రాణాన్ని ఇచ్చేవాడు నారాయణుడు. ఇక్కడ నీరుఅంటే కేవలం నీరుకాదు. నిత్యవస్తువుల సమూహం. ఆ నిత్యవస్తువులు — జ్ఞానం, శక్తి, వాత్సల్యం, సౌశీల్యం.

నారాయణుడు లక్ష్మీపతి. వైకుంఠనిలయుడు. జ్ఞానానందైక స్వరూపుడు. అవాప్తసమస్తకాముడు. సర్వాంతర్యామి. సకల

జగత్సర్గస్థితిసంహారకర్త. ఆర్తి, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని అనే చతుర్విధ పురుషాశ్రయనీయుడు. ధర్మార్థకామమోక్ష చతుర్విధ ఫలప్రదుడు. నిత్యనిర్దోష సమానాధికరహితమైన జ్ఞాన, శక్తి, బల, ఐశ్వర్య, వీర్య, తేజస్సులు కలవాడు. స్వామిత్వం, సౌశీల్యం, వాత్సల్యం, సౌలభ్యం, సౌహార్దం, కృతిత్వం మొదలైన కళ్యాణగుణాలు కలవాడు. దయాశక్తి, క్షమాశక్తి, ఆనందశక్తి, చిత్శక్తి, ప్రవృత్తిశక్తి, నివృత్తిశక్తి, అనుగ్రహశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి అనేశక్తులు కలవాడు. సౌందర్యం, సౌకుమార్యం, లావణ్యం కలిగిన విలక్షణమైన విగ్రహం కలవాడు. జ్ఞానస్వరూపులైన నిత్యసూరులచేత సేవితుడు. పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చ అనే ఐదుస్వరూపాలు కలవాడు.

ఈ పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చ అనేవి విష్ణుని పంచతత్వాలు.

వీటిలో పరత్వమంటే పరమాకాశమై, తేజోమయమై, రజస్తమోగుణాలకలయికతో, శుద్ధసత్త్వమయమై, అనంతమై, ఆనందప్రదమై, ఏకరూపమై, కాంతి ప్రవాహంలో వెలిగే అద్వితీయమైన ఉభయవిభూతి నిర్వాహకోక్తిస్థితి. ఇది ఈపంచతత్వాలన్నిటిలోనూ గొప్పది. సమస్తప్రపంచం నిలవడానికి స్థానమైనదీ, సర్వశరణ్యమైనది. వైకుంఠవాసుదేవుడే ఈతత్త్వం. ఇతడు నిత్యసూరులమధ్య ఉంటాడు. అది పంచోపనిషత్ స్థానం. పరమేష్ఠి, పుమాన్, విశ్వః, నివృత్తః, సర్వఏవహి – ఈపదాలు పంచోపనిషత్తుల

సారభూతాలు. ఈ పదాన్వయమే పరమేశ్వర శరీరం. పరమేశ్వరుడు ఈ పంచోపనిషన్మయుడు.

వ్యూహమంటే సృష్టి, స్థితి, సంహారార్థమూ, ఉపాసకానుగ్రహార్థమూ వాసుదేవ – సంకర్షణ – ప్రద్యుమ్న – అనిరుద్ధనామాలు తదుపయుక్తాలైన గుణవిశేషాలుగలవాడై ఉండే స్థితి. ప్రపంచ సృష్టి, స్థితి, లయాలనే వ్యూహమని కొందరు చెబుతారు. వ్యూహమంటే ఒకస్థానం. ఒక ప్రత్యేక కార్యంకోసం స్థిరపరచబడిన ఏర్పాటు. పరమాత్మే సృష్టికోసం, భక్త కైంకర్యాలకోసం నాలుగు వ్యూహాలుగా మారాడు. విష్ణువు జ్ఞాన, ఐశ్వర్య, శక్తి, బల, వీర్య, తేజాలనే షడ్గుణపరిపూర్ణుడు. ఆ ఆరుగుణాలచేత పరిపూర్ణుడైన మొదటివ్యూహం వాసుదేవుడు. అతని ఆరుగుణాల్లోనూ జ్ఞాన, బల గుణాలతో పరిపూర్ణుడై రెండోవ్యూహంగా సంకర్షణుడావిర్భవించాడు. అతడు ఇంద్రనీల శరీరచ్ఛాయగలవాడు. సృష్టిచెయ్యడానికి అతడు ఆవిర్భవించాడు. ఆ ఆరుగుణాల్లోనూ ఐశ్వర్య, వీర్యాలుగల ప్రద్యుమ్నుడు బంగారుఛాయతో మూడోవ్యూహంగా సంకర్షణునినుండి సృష్టిని లయించడం కోసం వెలువడ్డాడు. ఆ ఆరుగుణాల్లోనూ శక్తి, తేజస్సుగల అనిరుద్ధుడు తాత్కాలిక మేఘకాంతితో ప్రద్యుమ్నునినుండి నాల్గోవ్యూహంగా భక్తుల్ని అనుగ్రహించడం కోసం వెలువడ్డాడు.

ఈ వ్యూహాల్లో విష్ణువు తన నాలుగుచేతుల్లోనూ పద్మం, గద, శంఖం, చక్రం అనే వాటిని ధరిస్తాడు. ఈ నాలుగూ మూర్తినిబట్టి

వరసగా ఒకచేతిలోనుంచి ఇంకొకచేతిలోకి మారుతుంటాయి. ఈ మార్పుల్నిబట్టి విష్ణువుకి కేశవాది 24 పేర్లు ఏర్పడ్డాయి. ఈ ఇరవైనాలుగు వైష్ణవులు నిత్యం జపించే నామాలు. అవి — ① కేశవ ② నారాయణ ③ మాధవ ④ గోవింద ⑤ విష్ణు ⑥ మధుసూదన ⑦ త్రివిక్రమ ⑧ వామన ⑨ శ్రీధర ⑩ హృషీకేశ ⑪ పద్మనాభ ⑫ దామోదర ⑬ సంకర్షణ ⑭ వాసుదేవ ⑮ ప్రద్యుమ్న ⑯ అనిరుద్ధ ⑰ పురుషోత్తమ ⑱ అధోక్షజ ⑲ నృసింహ ⑳ అచ్యుత ㉑ జనార్దన ㉒ ఉపేంద్ర ㉓ హరి ㉔ శ్రీకృష్ణ.

విభవమంటే శిష్టరక్షణ, దుష్టశిక్షణ, ధర్మసంస్థాపనలకోసం ధరింపబడిన మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, బుద్ధ, కల్క్యవతారాలు. ఒకకార్యాన్ని నెరవేర్చడం కోసం ఏదో ఒకరూపంతో వచ్చి, ఆకార్యం నెరవేరేవరకు ఆరూపంతో భూమిపైన ఉండడం. ముఖ్యాలని, గౌణాలని, ఆవేశాలని, అంశలని అవతారాలు నాలుగు విధాలు. వీటిలో ఆవేశావతారాలు స్వరూపావేశమని, శక్త్యావేశమనిరెండురకాలు.

రామ, కృష్ణ అవతారాలు పూర్ణ, పూర్ణతమ అవతారాలు. ఇవిముఖ్యాలు. వ్యాస, బుద్ధ, కల్కి మొదలైనవి గౌణాలు. పరశురామ, నృసింహాది అవతారాలు ఆవేశాలు. మిగిలినవి అంశలు. ఈ విభవతత్త్వంలో —

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం

ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే " 1

అని శ్రీకృష్ణపరమాత్మ సెలవిచ్చినట్లుగా అవసరం వచ్చినప్పుడల్లా భగవంతుడవతరించి ధర్మసంస్థాపనం, సాధురక్షణం చేస్తుంటాడు.

అంతర్యామిత్వమంటే – ఆయా ఆత్మలానర్చ పాపపుణ్యాల్ని తెలుసుకోవడానికి, ఆపుణ్యపాపాలకి తగినఫలం ఇవ్వడానికి, పరమయోగీంద్రులకి ప్రసన్నుడై వారి మనోభీష్టాల్ని తీర్చడానికి, లక్ష్మీసమేతుడై, విలక్షణవిగ్రహుడై, సకలప్రవృత్తి, నివృత్తుల్ని సదావలోకనం చేసుకుని సర్వత్ర నిండిఉండే స్థితి. జీవాత్మ, చిద్రూపం, హృదయం – వీటిలో ఉండి జీవికి కావలసిన పనులు నడిపే హృదయగుహాంతర పరమేశ్వరరూపం ఇది. పరమాత్మ సర్వాంతర్యామిగా ఉండి జీవుల్ని నడిపిస్తాడు, నియమిస్తాడు. ప్రపంచస్థితిగతులకి కారణమౌతాడు.

అర్చావతారమంటే —

" యే యథామాం ప్రపద్యంతే తాన్ తథైవ భజామ్యహం " 2 వంటి వాక్యాల ప్రకారం తనకై తనకు ఒకరూపంగాని, ఒక పేరుగాని లేకుండానే తన ఆశ్రితులాదరించే రూపాన్నే తనరూపంగాను, వారు పిలిచేపేరే తనపేరుగాను

---

1. భగవద్గీత, నాల్గవ అధ్యాయం, జ్ఞానయోగం
2. భగవద్గీత, నాల్గవ అధ్యాయం, జ్ఞానయోగం

కలవాడై , తాను సర్వజ్ఞుడైఉండీ అజ్ఞునిలాగా , సర్వశక్తుడై ఉండీ అశక్తునిలాగా, రక్షకుడై ఉండీ రక్షింపబడేవానిలాగా స్వస్వామిభావాన్ని మారచేసుకుని , సర్వసులభుడై , సకలాత్మలూ తనని సేవించి , అనుభవించి ముక్తినిపొందడానికి అనువుగా దేశ , కాల నియమాయిలేక కోవెలల్లోనూ , గృహాలల్లోనూ విగ్రహరూపంలో నిలిచిఉండేస్థితి. విగ్రహాలలో వ్యూహసంకర్షణ , విభవసంకర్షణమూర్తులు వేరువేరుగా ఉన్నాయి. విష్ణుని పంచతత్త్వాల్లో పర , వ్యూహ , విభవాలకి విగ్రహాలున్నాయి. అంతర్యామికి విగ్రహముండదు. పైన చెప్పిన మూడు తత్త్వాలకి సంబంధించని కేవల విగ్రహం ఉండదు.

ఇక "వేదాహమేతం పురుషం మహాన్తమ్ ఆదిత్య వర్ణం తమసస్తుపారే" అనే తైత్తిరీయ పురుషసూక్తవచనంకూడా పరమ పురుషుడైన శ్రీమన్నారాయణుని అసాధారణమైన 'విద్యుద్వర్ణంతో కూడి ఉండడం' అనే లక్షణాన్ని ప్రతిపాదిస్తోంది.

కఠవల్లికూడా "సర్వే వేదాయత్ పదమామనన్తి" (అన్ని వేదాలూ ఏస్థానాన్ని గురించి చెప్తున్నాయో) అని ప్రారంభించి , "సోఽధ్వనః పరమాప్నోతి తద్విష్ణోః పరమం పదమ్" (అతడు మార్గం చివరని పొందుతున్నాడు అదే విష్ణువు పరమపదం) అని విష్ణుపారమ్యాన్ని చెప్తోంది.

ఈ తైత్తిరీయోపనిషత్తులోనే శీక్షావల్లి మొదటి

అనువాకంలో "శంనో విష్ణురురుక్రమః" అనే వాక్యంద్వారా విష్ణువు వామనావతారంలో ముల్లోకాలనూ రెండు అడుగులతో ఆక్రమించుకోవడాన్ని స్ఫురింపజేసింది. పై వాక్యానికి 'విశాలమైన పాదాలుగల విష్ణువు మాకు సుఖాన్నిచ్చుగాక' అని అర్థం. ఆ సంఘటనతోనే విష్ణువు 'ఉరుక్రముడు' అని పేరుపొందాడు. ఉరుక్రముడంటే సర్వవ్యాపి అని అర్థం. అథర్వణ వేదంలోనూ, శతపథ బ్రాహ్మణంలోనూ ఈ త్రివిక్రమావతార కథఉంది.

ఈ విధంగా వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు విష్ణుపరత్వాన్ని చాటాయి.

తాత్త్వికసిద్ధాంతాల్ని ప్రాకృతజనవిశ్వాసాలకి అనుగుణంగా మలిచి వర్ణించే, వివిధభావాలతో కూడిన పురాణాలు కూడా ఈశ్వరాస్తిత్వాన్ని వెల్లడిచేస్తున్నాయి. వీటిలో కొన్ని విష్ణుపారమ్యాన్ని తెలిపితే, కొన్ని శివపారమ్యాన్ని తెలుపుతున్నాయి. పురాణాలు మొత్తం పద్దెనిమిది. వీటిలో విష్ణు, భాగవత, నారదీయ, గరుడ, పద్మ, వరాహపురాణాలు వైష్ణవాలు. ఈ వైష్ణవపురాణాల్లో కూడా పద్మ, విష్ణు, భాగవత పురాణాలే విష్ణుమతానికి, దానివికాసానికి ముఖ్యాలంటున్నారు. వేదాల్లో చెప్పబడినట్లుగానే ఇవి విష్ణు ప్రాధాన్యాన్ని, భక్తిభావాన్ని సూచించాయి.

ఇతిహాసాలైన రామాయణ భారతాలు కూడా విష్ణుని అవతారస్వరూపంతోపాటు భక్తిసంప్రదాయాల్ని కూడా వివరించాయి. రామకృష్ణాది

అవతారాన్ని ఇతిహాసాలు వర్ణించాయి.

తత్త్వప్రతిపాదకాలైన పురాణేతిహాసాల్లోనే కాకుండా తటస్థశాస్త్రాలైన జ్యోతిషం మొదలైన శాస్త్రాల్లోకూడా శ్రీమన్నారాయణుడే పరతత్త్వమైన జగత్కారణభూతుడని స్పష్టంగా నిరూపించబడింది. జ్యోతిశ్శాస్త్రం-

"అస్మాన్నారాయణాద్భీషా
వాతః పవత ఏవహి
ఉదేతి సూర్యోమృత్యుశ్చ
ధావతీన్ద్రోఽపి వర్షతి ॥
తదాశ్రయా మహామాయాఽనాదిర్నిహార సన్నిభా "[1] అని

శ్రీమన్నారాయణుని భయంవల్లే గాలి ఎల్లప్పుడూ వీస్తుందనీ, సూర్యుడు ఉదయిస్తాడనీ, మృత్యువు తన సంహారకర్మని త్వరగా నిర్వహిస్తుందనీ, ఇంద్రుడు వర్షిస్తాడనీ, ఆమహావిష్ణువుని ఆశ్రయించి తద్భరీరభూతమైతూ మహామాయాశబ్దవాచ్యమై ప్రకృతిఉందనీ చెప్పింది.

అలాగే సూర్యసిద్ధాంతంలోకూడా వాసుదేవుడే పరబ్రహ్మమని, ఆయన స్వరూపం అవ్యక్తమై, నిర్గుణమై, శాంతమై, జీవతత్త్వంకంటే భిన్నమైనదై, అవ్యయస్వరూపమై ఉంటుందనిచెప్పబడింది.

---

1. తి.వ. రామానుజస్వామి, శ్రీవైష్ణవ ఆచార నిర్ణయము, పుట - 29.

ఇలాగే రేమశసిద్ధాంతంలోకూడా సాక్షాత్తూనారాయణుడే కార్యకారణరూపంగా ఉండి, జగదాధారుడై ఉన్నాడని చెప్పబడింది.

అద్వైతమతకర్త అయిన శంకరాచార్యులవారుకూడా బ్రహ్మసూత్రభాష్యంలో జగత్కారణత్వాదుటు శ్రీమన్నారాయణునిలోనే ఉన్నాయని, బ్రహ్మశబ్దవాచ్యుడు నారాయణుడేనని చెప్పారు. ఇందుకు –

"అతశ్చ సంక్షేపమిదం శృణుధ్వమ్
నారాయణస్సర్వమిదం పురాణ
స్ససర్గకాలే చ కరోతి సర్గమ్
సంహారకాలేచ తదత్తి భూయః॥" [1]

అనేశ్లోకం ఉదాహరణ. దీనికి శంకరాచార్యులవారు 'అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయస్తథా' అనే గీతావాక్యాన్ని ప్రమాణంగాచూపారు.

ఈవిధంగా మహావిష్ణువే జగత్కారకుడని వేదాల నుండి అన్ని ప్రసిద్ధప్రమాణాలు స్పష్టపరుస్తున్నాయి.

జీవుడు సత్యజ్ఞానానంద స్వరూపమైన పరతత్త్వ దివ్యమంగళ స్వరూపానుభవాన్ని పొందడానికి స్థితినిబట్టి ఉన్ముఖుడౌతాడు.

---

1. శాంకరభాష్యం, ద్వితీయాధ్యాయం, మొదటి సూత్రభాష్యం

ఈ ఉన్నదైతే భక్తి. భక్తి జీవుని భగవదనుభూతి మార్గానికి తీసుకుపోతుంది. అందువల్ల ఉపనిషత్తుల్లో భక్తినిగురించి, భగవదనుగ్రహ శక్తినిగురించి చెప్పబడివుంది. వేదాల్లోకూడా భక్తిబీజాలు కనబడతాయి. భక్తిమార్గం మొదట వేదాల్లోనూ, ఉపనిషత్తుల్లోనూ తర్వాత పురాణేతిహాసాల్లోనూ చెప్పబడి ప్రపత్తికి ప్రాతిపదిక కల్పించింది.

"ఉపనిషత్కాలానికి సత్యజ్ఞానానందాత్మకమైన నిత్యపదార్థమే బ్రహ్మమనియు, దాని అనుగ్రహమునసే జీవులకాత్మసాక్షాత్కారమగుననియు, ఆస్థితిని పొందుటకు భక్తిసాధనకెంత అవసరమనియు నిశ్చయమైంది. ఇట్టి నిశ్చయబుద్ధియే తర్వాత ఆగమపురాణేతిహాసాలలో విస్తరించబడి వైష్ణవమతంగా రూపొందింది."[1] అని వేటూరి ఆనందమూర్తిగారు పేర్కొన్నారు. విశ్వవ్యాపి అని ఋగ్వేదంకీర్తించే విష్ణువు, బ్రాహ్మణాలు ప్రస్తుతించేనారాయణుడు, జనసామాన్యంలో దైవంగా విశేషాదరణపాత్రుడైన వృష్ణివంశసంభూతుడు వాసుదేవ కృష్ణుడు - ఈ ముగ్గురి మేళనంనుంచి వైష్ణవమతం ఆవిర్భవించింది.

వేదకాలంలో ఉన్న దైవస్తుతి క్రియాత్మకమై, మంత్రప్రయోగంతోకూడి ఉపాసనారూపంలో విస్తరించింది. వేదాల్లో ఈ ప్రార్థనల్ని విన్న పరతత్త్వాంశ అప్పుడప్పుడు సాక్షాత్కరించి ఆపదలనుండి కాపాడేదని తెలుస్తోంది. దైవప్రార్థన వలన లౌకికమైన ప్రయోజనాలు సాధింపబడుతున్నాయని

---

1. డా॥ వేటూరి ఆనందమూర్తి, వైష్ణవాంధ్ర వాఙ్మయము, పుట-22.

గుర్తించాక బ్రహ్మాన్నిగురించిన జిజ్ఞాస, తత్సాధన, శ్రద్ధ అధికమయ్యాయి. ప్రార్థనాయజ్ఞాలతోకూడిన వైదికారాధన క్రమంగా భక్తి ప్రతిమారాధనగా రూపొందింది.

భారతదేశంలో బ్రాహ్మణమత నిరాసంతో జైనబౌద్ధాలు అవతరించాయి. కానీ భక్తివిశ్వాసాలతో పరమేశ్వర కృపావీక్షణాలకోసం నిరీక్షించే ప్రజలకి అవి తృప్తినియ్యలేదు. ఆదశలో హిందూమతం ప్రకలి భక్తిప్రధానాలు, ఏకేశ్వరమతాలూ అయిన శైవ, వైష్ణవాలుగా ఆవిర్భవించింది. ఆదశలో ప్రత్యేకమైన ఆగమాలుగా శైవ, వైష్ణవ, శాక్తాగమాలు మూడు వెలిశాయి.

వీటిలో వైష్ణవాగమం వైఖానసమని, పాంచరాత్రమని రెండువిధాలు. వైఖానసంలో 27 సంహితలు, పాంచరాత్రంలో 108 సంహితలు ఉన్నాయి. వైఖానసం వైదిక, సౌమ్య, ఐహికాముష్మిక ఫలప్రదం, నదీతీర పర్వతాదుల్లో పూజింపదగినది. వాసుదేవాది మూర్తులు గలది. ఈవైఖానస పాంచరాత్రాలకే భగవచ్ఛాస్త్రమని పేరు. ఈ ఆగమశాస్త్రాలని భారతభాగవతాది పురాణాలే ఆధారాలు.

విష్ణుపురాణాల్లో పద్మ, విష్ణు, భాగవతపురాణాలే వైష్ణవమత వికాసానికి ముఖ్యాలంబనాలు. భాగవతపురాణంలో భక్తిభావం ప్రపంచింపబడింది. అదే ఉత్తమమైన మోక్షసాధనమనీ, భక్తికి అసాధ్యమైనదేదీ లేదనీ, వర్ణభేదాది తారతమ్యాలులేవనీ చెప్పడం జరిగింది.

విష్ణుభక్తుడనేవాడు తనధర్మాన్ని విడవకుండా, మిత్రామిత్రాది భేదాన్ని ఎంచకుండా, పరాయిసొమ్మునాశించకుండా, ఏజీవికీ, ఎప్పుడూ అపకారం తలపెట్టకుండా పరిశుద్ధమైన చిత్తంతో ఉండాలి.

ఇటువంటి పౌరాణికధర్మాలు ఇతిహాసకావ్యాల్లోకూడా విస్తరించబడ్డాయి. భక్తిభావం శరణాగతి, ప్రపత్తిగా రూపొందడం భారతంలో కనిపిస్తుంది. రామాయణంకూడా శరణాగతిని ప్రతిపాదించడంవల్ల శరణాగతి వేదమనే పేరు పొందింది. భారతసారమనదగిన భగవద్గీత ఉపనిషత్సారాన్ని, భాగవతాస్తిత్వాన్ని జీర్ణించుకుని భారతీయతత్త్వశాస్త్రంలో అమితమైన ప్రాధాన్యాన్ని సంపాదించుకుంది. ఇవన్నీ వైష్ణవాన్ని అభివృద్ధి చెయ్యడంలో తమవంతుపాత్రని సమర్థవంతంగా నిర్వహించినవే.

వైష్ణవమత వికాసంలో భాగంగా మొదట క్రీ.పూ. 4వశతాబ్దిలో వాసుదేవ సంప్రదాయం మధురప్రాంతంలో ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇది ఆంధ్రశాతవాహనులద్వారా దక్కనుప్రాంతంలో ప్రచారంలోఉన్నట్లు విదితం. ఇది ఆంధ్రశాతవాహనులద్వారా దక్కను ప్రాంతంలో ప్రవేశించినట్లు ఆకాలంలో ఉన్నశాసనాలు తెలుపుతున్నాయి.

ఇలా క్రమంగా ఇక్ష్వాకులు, పల్లవులుకూడా వైష్ణవమతావలంబకులయ్యారు. వీరిలో పల్లవులు విష్ణ్వాలయ నిర్మాణం చేశారు. తూర్పుచాళుక్యులకాలంలో వైష్ణవానికి మరింత ప్రచారం కలిగింది. తమిళదేశంలో

ఆళ్వారులు ఉదయించి, భక్తి ప్రధానమైన వైష్ణవాన్ని ప్రచారం చేశారు. సర్వదేశ, సర్వకాల, సర్వావస్థల్లోనూ విష్ణుని దివ్యకళ్యాణగుణాల్ని కీర్తించడంలోనే నిమగ్నులై ఉండడంవల్ల వీరిని ఆళ్వారులన్నారు. వీరు వైష్ణవాన్ని అభివృద్ధిపరచే మధురాతిమధురాలైన ద్రావిడదివ్య ప్రబంధాల్ని రచించారు. వైష్ణవులైన ప్రతివ్యక్తీ ఈదివ్యప్రబంధాల్ని నిత్యం పఠించాలి. పన్నెండుమంది కలిసి రచించిన నాలుగువేల పాశురాలుగల ద్రవిడప్రబంధం తరువాతిఆచార్యులకి మార్గదర్శకమయ్యింది. విశిష్టాద్వైత వేదాంతసిద్ధాంతరహస్యాల్ని ఈ నాలాయిర దివ్యప్రబంధాదిరూపంలో ద్రవిడదేశంలో ఆళ్వార్లు విస్తరింపజేశారు.

తర్వాత నాథముని, యామునాచార్యులు విశిష్టాద్వైతానికి విశిష్టమైన సేవచేశారు.

వైష్ణవానికి సిద్ధాంతాల్ని మెరుగుపర్చి, వాటికి విశేషమైన ప్రచారం కల్పించి, సర్వజనులకి కులమతాలతో ప్రమేయంలేని మోక్షసాధనం కేవలం వైష్ణవధర్మాచరణంమాత్రమేనని చాటి, దక్షిణభారతదేశంలో శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని స్థాపించి, దానికి ఒకరూపాన్ని ఏర్పరచిన మహాపురుషుడు జగద్గురువు శ్రీరామానుజాచార్యులు. ఈయన వేదాంతసూత్రాలకి విశిష్టాద్వైతపరంగా రచించిన భాష్యగ్రంథమైన శ్రీభాష్యం, శ్రీమద్భగవద్గీతా భాష్యం, వేదార్థసంగ్రహం, శరణాగతిగద్యం, వేదాంతదీపం, వేదాంతసారం, గద్యత్రయం అనే గ్రంథాల్ని రచించారు. కులమతాల్ని ఎంచక వైష్ణవధర్మాన్ని బోధించి ఎక్కువమందిని శిష్యులుగా చేసుకున్నఘనత రామానుజులవారిదే.

శ్రీకృష్ణదేవరాయ , అచ్యుతరాయాదులు వైష్ణవానికి ఎనలేని సేవచేశారు. తర్వాత సాళువనరసింగరాయలు పరమవైష్ణవభక్తుడు. వైష్ణవాన్ని స్వీకరించి , తన సంకీర్తనాసుమాలతో వేంకటేశ్వరుని అర్చించి , వైష్ణవాన్ని ప్రచారంచేసిన అన్నమాచార్యుడు నరసింగరాయలు వైష్ణవ భక్తుడవడానికి కారకుడు. నరసింగరాయలు విష్ణ్వాలయాలకి దానధర్మాలు విశేషంగాచేసి , వైష్ణవాచార్యుల్ని ఆదరించాడు.

మొత్తానికి 12వ శతాబ్దినాటికే వైష్ణవంబాగా అభివృద్ధిచెందింది. హిందూమత ప్రతిష్ఠాపనలో మొదట కొంతకాలం శైవం ప్రబలంగా ఉన్నా తర్వాత వైష్ణవాచార్యుల బోధనలు , ప్రయత్నాలవల్ల తెలుగుదేశంలో వైష్ణవం బాగా అభివృద్ధిచెందింది.

**వైష్ణవలక్షణాలు :-** శ్రీవైష్ణవానికి సూత్రబద్ధమైన స్వరూపస్వభావాలని నిర్దేశించి శ్రీరామానుజులవారు వ్యాప్తిచేశారు. సంస్కృతవాఙ్మయంలోఉన్న విష్ణుతత్త్వ ప్రతిపాదక సాహిత్యాన్ని ఆధారంగాచేసుకుని శ్రీవైష్ణవం సూత్రబద్ధం కాబడింది. దీన్ని 'విశిష్టాద్వైతం' అనికూడా అంటారు.

" విశిష్టంచ విశిష్టంచ విశిష్టే విశిష్టయోః

అద్వైతం విశిష్టాద్వైతమ్ - సూక్ష్మ చిదచిద్విశిష్టమును , స్థూల చిదచిద్విశిష్టమును , విశిష్టమగుచుండు (కలిసిపోయియుండు) కతన రెండుకూడియుండిన విశిష్టముల కూడికకు విశిష్టాద్వైతమని యీమతమునకు

చేరుకర్గైను"[1] అని ఆంధ్రవిజ్ఞానంలో ఉంది.

ఇందులో ఈశ్వరుడు, జీవాత్మ, ప్రకృతి అనేమూడు తత్త్వాలుంటాయి. "తత్త్వమనగా ప్రమాణబోధితమైన యదార్థవస్తువు."[2] అంటే భూత, భవిష్యత్, వర్తమానకాలాలచేత బాధింపబడకుండా ఉండే నిత్యమైన పదార్థం (వస్తువు). అటువంటి పదార్థాలు సమస్తలోకాలకీ ఈశ్వరుడు, జీవుడు, ప్రకృతి అనేవితప్ప వేరేవీలేవు. అన్ని కాలాల్లోనూ, అన్నివిధాలుగానూ, అతత్త్వమైన ఏకపదార్థం చేతన, అచేతన పదార్థాలతో విడదీయరాని విధంగా కూడిఉంటుంది. ఇది శ్రుతి ప్రమాణసిద్ధంకావడంవల్ల విశిష్టాద్వైతంగా చెప్పబడింది. స్థూలంగా విశిష్టాద్వైతం అంటే సర్వదా చిదచిత్తులతోకూడిఉన్న పరమాత్మ ఒక్కడేనని అర్థం. చిత్తుఅంటే జీవాత్మ, అచిత్తు అంటే ప్రకృతి.

విశిష్టాద్వైతసిద్ధాంత ధర్మంమేరకు సృష్టిలేనపుడు జీవాత్మలు అనంతాలై, ప్రకృతిలో నామరూపాలు లేనివిగా, అగోచరాలై ఉంటాయి. ఆత్మ, ప్రకృతులను అగోచరాలుగా చెయ్యడమే సృష్టిగా చెప్పబడింది. ఈసృష్టి అంతంలో అవితమ పూర్వస్థితిని పొందుతాయి. అదే లయంగా చెప్పబడింది. ఇంక ఈ మతంలో స్థితి అని వేరుగా ఏదీ చెప్పబడలేదు.

---

1. శ్రీ ప్రసారభూపాలుడు, ఆంధ్రవిజ్ఞానం (ఆరోసంపుటం), పుట - 3028.
2. శ్రీ వ.చ. రఘునాథాచార్యులు, విశిష్టాద్వైతవైభవము, పుట - 30

జగత్తుని సృష్టించడంలో ఉపాదానకారణంగానూ, నిమిత్తకారణంగానూ కూడా అయి ఉండడం పరమేశ్వర విశిష్టమైన స్థూలచిదచిత్తు, సూక్ష్మచిదచిత్తు అభేదైక్యంపొందిఉన్న యిటువంటి ప్రపంచం పరమేశ్వరునికి శరీరప్రాయమని చెప్పబడింది. చిత్తుఅంటే చైతన్యం కలవనీ, అచిత్తంటే చైతన్యం లేనివని భావం. జగత్తులో వస్తుసమూహం అంతాచిత్తు, అచిత్తులని రెండువిధాలు. ఈరెండు సూక్ష్మ, స్థూల భేదాలచేత మళ్ళీరెండేసి విధాలు. ఇలా నాలుగువిధాలైన జగద్వస్తువులలో పరమేశ్వరుడుంటాడని అందులో సూక్ష్మ చిదచిత్తులలో ఉండడం కారణంగానూ, స్థూలచిదచిత్తుల్లోఉండడంకార్యంగానూ చెప్పబడింది.

ఈవిశిష్టాద్వైతంలో చిదచిత్తులకి, పరమాత్మునికి అభేదము, భేదమూ రెండూచెప్పబడ్డాయి. తనతో అనుభూతమై ఉండేసర్వాన్నీ తనకి శరీరంగా కలవాడైనందువల్ల ఇటువంటి బ్రహ్మం ఒక్కడేనని అభేదాన్ని చెప్పవలసిఉంటుంది. ఇలా ఏకమైన బ్రహ్మం నామరూపకల్పనలచేత అనేక విధాలైన శరీరాలతో, చిదచిత్తులతో అనేకరూపాలుగా ఏర్పడినప్పుడు భేదం, అభేదం రెండు ఉన్నట్లు చెప్పకోవాలి. ముండకోపనిషత్తులో—

" ద్వాసుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే
తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్య

న్నశ్నన్నన్యో అభిచాకశీతి " 1

అని చెప్పబడింది. అంటే ప్రాణస్నేహితులై ఎప్పుడూ కలిసిఉండే రెండుపక్షులు ఒకే చెట్టుపైన కూర్చుని ఉన్నాయి. వాటిలో ఒకటి చెట్టుపళ్ళని ఆసక్తితోతిందూంటే, మరొకటి ఏమీ తినకుండా చూస్తోంది - అని అర్థం.

ప్రాణస్నేహితులై ఎప్పుడూ కలిసిఉండేవి జీవాత్మ, పరమాత్మలు. ఇందులో పళ్ళుతినేపక్షి ప్రతిజీవిలోనూ కర్మకి, అనుభవానికి ముఖ్యకారణమైన మనస్సు (జీవాత్మ). రెండోపక్షి జీవనంలో క్షణికరూపాలైన సుఖదుఃఖాలు బొత్తిగా అంటని శుద్ధచైతన్యం (పరమాత్మ).

కర్మనిర్వర్తించేది, కర్మఫలాన్ని అనుభవించేది నిజానికి మనస్సే అయినా అంటే ఆత్మే అయినా, శరీరం-మనస్సులతో తాదాత్మ్యం పొందిన జీవాత్మ కర్మకి తానేకర్తనని, ఆఫలానికి తానే భోక్తనని అనుకుంటుంది. జీవాత్మ పరమాత్మకంటే ప్రత్యేకం అనుకున్నా ఇది ఎన్నటికి కర్మలకిగాని, కర్తకిగాని, కర్మఫలానికిగాని భోక్తకాలేదు. ఇది అజ్ఞానంలో మునిగి తన నిర్వీర్యానికి దుఃఖిస్తుంది. పరమాత్మని ఎప్పుడైతే చూసిందో అప్పుడే తన దుఃఖాన్ని పోగొట్టుకుంటుంది.

" యదాపశ్యః పశ్యతే రుక్మవర్ణం

---

1. ముండకోపనిషత్తు, తృతీయముండకము, ప్రథమఖండం, పుట-59.

కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిం
తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ
నిరంజనః పరమం సామ్యముపైతి » [1]

— ఇక్కడ స్వయంప్రకాశమైన, సృష్టికర్తయిన బ్రహ్మకి కూడా సకల జగత్తుకీ కర్త, ప్రభువైన పరమాత్మని సాక్షాత్కరించుకోగానే విద్వాంసుడైన సాధకుడు పుణ్యపాపాలని అతిక్రమించి నిరంజనం, సర్వోత్కృష్టము అయిన పరమాత్మ ఐక్యతని పొందుకుంటాడు.

బ్రహ్మజ్ఞానం కలిగినతర్వాత పుణ్యపాపాలు మనశ్శరీరాలకేగాని ఆత్మకి చెందవని, మనస్సుకంటె ఆత్మభిన్నమైనదని తెలుస్తుంది. అప్పుడు సాధకుడికి సమస్తద్వైతభావమూ నశించి, పరమాత్మ తన ఆత్మేనని గుర్తిస్తాడు.

అలా తెలుసుకున్న చిదచిత్తులు ప్రళయదశలో పరమాత్మలో సూక్ష్మరూపంలో చేరి ఉంటారు. సృష్టికాలంలో చిదచిత్తులు స్థూలరూపంలోఉంటే వాటిలో ప్రాణమై ఈశ్వరుడుంటాడు. సూక్ష్మ చిదచిద్విశిష్టుడైన పరమాత్మకీ, స్థూలచిదచిద్విశిష్టుడైన పరమాత్మకీ భేదంలేదు. కాబట్టి దీనికి విశిష్టాద్వైతమనే పేరువచ్చింది.

---

1. ముండకోపనిషత్తు, తృతీయముండకము, ప్రథమఖండం, పుట-61.

<u>పరమాత్మలక్షణాలు</u> :- పరమాత్మ చిదచిద్విశిష్టుడు. సర్వదా అవినాభూతుడు మనిషికి శరీరాత్మల్లాగ జీవుడు, పరమాత్మ ఉంటారు. అంటే పరమాత్మ ఆత్మ అయితే జీవుడు శరీరం. పరమాత్మ జీవరూపంలోనూ, జీవుడు ప్రకృతి రూపంలోనూ భాసిస్తారు. పరమాత్మ నియామకుడు, నాయకుడు, శరీరి, శేషి, ఆధారుడై ఉన్నాడు. చిదచిత్తులచేత సూక్ష్మ, స్థూలావస్థలలో పరమాత్మ ఆశ్రయమై ఉన్నాడు.

ఈ సమస్త ప్రపంచమూ చిదచిత్తులతో కూడి ఉంది. ఇటువంటి జీవజడపదార్థాలతో కూడిన ప్రపంచం పుట్టుకకి, స్థితికి, నాశనానికి కారణమైనవాడు పరమాత్మ. ఈ విషయాన్ని —

" సర్గస్థితి వినాశానాం జగతోయో జగన్మయః
మూలభూతో సమస్తస్యై విష్ణవే పరమాత్మనే "

అని విష్ణుపురాణం తెలుపుతోంది.

సర్వాత్మ - పరబ్రహ్మ, పరంజ్యోతి, పరతత్త్వం, పరమాత్మ, సత్ మొదలైన వివిధశబ్దాలచేత సమస్త ఉపనిషత్తుల్లోనూ తెలియజేయబడుతున్నాడు.

అనాదిసిద్ధమైన అజ్ఞాన కర్మసంబంధంచేత జీవులకి

ప్రకృతి సంబంధం కలిగి , దానివల్ల ఏర్పడుతున్న జనన , మరణ , సుఖ , దుఃఖ ప్రవాహరూపమైన సంసారాన్ని నశింపచేయడానికి కారణమైనవాడు పరమాత్మ .

పరమాత్మ ప్రవచనం చేతగాని , బుద్ధిచేతగాని , బహువిధశాస్త్రజ్ఞానం చేతగాని పొందబడడు . ఇతరోపాయాల్ని విడిచిపెట్టి పరమాత్మనే ఉపాయంగా వరించిన వానికే పరమాత్మ సాక్షాత్కరిస్తాడు . అవిద్యామూలకమైన సంసారాన్ని నశింపజేసి , స్వవిషయమైన దర్శనాన్ని కలిగించేవాడు పరమాత్మ .

సమస్తమైన అశుభాలకీ విరుద్ధమైన స్వభావం కలవాడు , సమస్త కళ్యాణాలకీ ఆస్పదమైనవాడు , ఇతరవస్తువులకంటే విలక్షణమైనవాడు పరమాత్మ . సమస్త చిదచిదాత్మక ప్రపంచంలో వ్యాపించి ఉన్నవాడు పరమాత్మ .

వైష్ణవం పరమాత్మని సుగుణమూర్తిగా , భువనైక సుందరునిగా గ్రహించింది . సత్యం , జ్ఞానం , ఆనందం , వాత్సల్యం , సౌశీల్యం , కారుణ్యం మొదలైన మంగళప్రదమైన అసంఖ్యాకమైన గుణాలతోకూడుకున్నవాడు పరమాత్మ . సకల కర్మలఫలాన్ని ఇచ్చేవాడు లక్ష్మీవిశిష్టుడు . ఈమతంలో ఈశ్వరుడు పర , వ్యూహ , విభవ , అర్చ , అంతర్యామి భేదాలతో ఐదువిధాలుగా ఉన్నాడు .

<u>జీవునిలక్షణాలు</u> :- జీవుడు జ్ఞానానందమయుడు, నిర్మలస్వభావుడు. దుఃఖము, అజ్ఞానము మొదలైన ధర్మాలు ప్రకృతిసంబంధంవల్లనే జీవునికి ఏర్పడుతున్నాయి. కర్మవలన జీవుడు వివిధదేహాల్లో ప్రవేశిస్తాడు. జీవుడంటే ప్రకృతి సంబంధంచేత ఏర్పడే వివిధ దేహాలు ఏవీకాని ఆత్మ.

పరమాత్మకి శేషస్థానంగా, ఆధేయంగా, అధీనుడిగా జీవుడు ఉంటాడు. అణుపరిమాణుడు, నిత్యుడు. ప్రతి దేహంలోనూ భిన్నంగా ఉంటాడు. పరమాత్మలాగే స్వతస్సుఖిగా ఉండి, అవిద్యాకర్మవశుడై ప్రకృతి సంబంధంవల్ల సంసారమగ్నుడై ఉంటాడు. ఇటువంటి విశిష్టలక్షణాలతో కూడిన జీవుడు దేహం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, ప్రాణం - వీటికంటే విలక్షణుడై ఉంటాడు. ప్రపంచంలో జీవులు చాలామంది ఉంటారు. ఆనందరూపులుగాను, అజడులుగాను, అణువులుగాను, అవ్యక్తులుగాను, అచిన్త్యులుగాను, నిరవయవులుగాను, నిర్వికారులుగాను, జ్ఞానాశ్రయులుగాను ఉంటారు.

ఇటువంటిలక్షణాలు కలిగినజీవులు నిత్యులు, ముక్తులు, బద్ధులు, కేవలులు, ముముక్షువులు అని ఐదువిధాలుగా ఉంటారు.

నిత్యులు స్వాభావికంగా పాశనాశకులై, నిర్మల జ్ఞానానందమయులై, సంసారబంధరహితులై, సర్వలక్షణసంపన్నమూర్తులై ఉంటారు. నిత్యమూ పరమాత్మ సాన్నిధ్యంలో ఆద్యంతరహితులై, భగవంతునికి కింకరులై,

సృష్టి, స్థితి, సంహారాల్ని వినోదంగానే చెయ్యగల మంత్రులై ఉండేవారు. అనంత, గరుడ, విష్వక్సేన, సుదర్శన, పాఞ్చజన్యాదులు ఈకోవకి వస్తారు. ఈ అయిదుగురిని నిత్యసూరులంటారు.

ముక్తులు చిరకాలం అచిత్తుతో కలిగిన సంబంధ విశేషంతో సంసారబంధబద్ధులై, పరమాత్మ కృపవలన ఆయన స్వరూపరూప గుణలీలాద్భుతరసాల్ని అనుభవించి, ఆఅనుభవానందాన్ని తమమనస్సుల్లోనే ఉంచుకోలేక నోటితో కీర్తిస్తూ, అపుణ్యవిశేషంవల్ల జన్మరాహిత్యంపొంది పరమాత్మ సాన్నిధ్యాన్ని చేరేవారు. భాగవతకైంకర్యాసక్తులై, నిత్యనైమిత్తికాచార పరాయణులై, శరణాగతిమార్గానుయాయులై పరమాత్మ సాన్నిధ్యాన్నిపొందేవారు. ఆళ్వారులు, ఆచార్యులు ఈకోవకివస్తారు.

బద్ధులు పాంచభౌతికమైన, అనిత్యమైన, సుఖదుఃఖానుభవపూరితమైన దేహమే ఆత్మఅనే భ్రాంతితో, అజ్ఞానులై ఉంటారు. స్వదేహపోషణమే పురుషార్థమని, విషయలాభాలకి అనురూపమైనవ్యాపారమే సర్వవిధపుణ్యమని భావిస్తారు. భౌతికమైన ప్రపంచవిషయాల్ని నిజాలుగా భ్రమిస్తారు. పరమాత్మని మరచిఉంటారు. వీరు సాధారణమానవులు, జంతువులు, క్రిమికీటకాదులు.

కేవలులు సంసారం హేయమని భావిస్తారు. ప్రకృతి మొదలైన వాటికంటె భిన్నంగా ఆత్మఅనేది వేరొకటిఉందని భావించి, నిర్వికల్ప

సమాధిలో ఉండి, అనేకసాధనలద్వారా ఆ ఆత్మస్వరూపాన్ని సాక్షాత్కరింప చేసుకుంటారు. ఆత్మే పరమాత్మఅని భావిస్తారు. వీరికి సంసారప్రాప్తి, భగవత్ప్రాప్తి ఉండవు.

ముముక్షువులు సంసారంపట్ల అసహ్యంకలవారై, భగవత్ప్రాప్తికోసం తపిస్తారు. ఇతరవిషయాలపట్ల వైరాగ్యంతో, భగవదనుభవైకకారణ జీవితాన్ని మాత్రమే కోరుకుంటారు. మోక్షాన్ని ఆశిస్తారు.

ఈవిధంగా జీవులలక్షణాలు ఉంటాయి.

**ప్రకృతిలక్షణాలు :-** "అవస్థాసప్తకములను దరంగములుగాగల ఘోర సముద్రమై, యనంతక్లేశములననుభవింప జేయునదియై, పరమాత్మతో జీవాత్మను చేరనీయని విరోధి ప్రకృతి. తత్సంబంధము సంసారము"[1]

ఈప్రకృతే 'అచిత్తు' అని భావింపబడుతోంది. కొందరు అచిత్తులో ప్రకృతి ఒకభాగం అనిభావిస్తారు.

అచిత్తుజ్ఞానశూన్యమై, వికారాస్పదమై ఉంటుంది. అది శుద్ధసత్త్వమని, మిశ్రసత్త్వమని, సత్త్వశూన్యమని మూడు విధాలు.

---

1. మన్నంశేషాచలంనాయుడు, శ్రీమత్పరమవైదికసిద్ధాంతప్రదీపిక, పుట - 11.

శుద్ధసత్త్వమంటే రజస్తమోగుణాల్ని కలిగిఉండక, పూర్తిగా సత్త్వగుణం మాత్రమే కలిగిఉండి, నిత్యమై, జ్ఞానానందజనకమై, భగవంతునిపైనే చిత్తం కలిగినది. ఇది అచేతనరూపంలోఉండి తేజోరూపమై నిత్యముక్తులచేత, ఈశ్వరునిచేత భేదింపబడకుండా ఉంటుంది.

మిశ్రసత్త్వమంటే సత్త్వరజస్తమోగుణాలు మూడూ కలిగిఉండి బద్ధాత్మల జ్ఞానానందాలకి తిరోధాయకమై ఉంటుంది. నిత్యమై పరమేశ్వరుని లీలాపరికరమై ఉంటుంది. ప్రదేశభేదంచేత, కాలభేదంచేత అనేక వికారాల్ని కలిగించేదిగా ఉంటుంది. దీన్నే ప్రకృతి, మాయ, అవిద్య అంటారు. వికారాల్ని పుట్టించేది కావడంవల్ల ప్రకృతిని, జ్ఞానానికి విరోధికాబట్టి అవిద్యఅని, అనేక విచిత్రాల్ని సృష్టించేది కాబట్టి మాయఅని పేర్లువచ్చాయి.

ఈమిశ్రసత్త్వంలో పంచభూతాలు, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, శబ్దం - స్పర్శ - రసం - గంధం - రూపం అనే ఐదువిషయాలు మనస్సు, అహంకారము అనేవి ఉంటాయి.

సత్త్వశూన్యమంటే కాలం. ఇది ప్రకృతిలోఉండే మార్పులకి నిలయమై ఉంటుంది. కలాకాష్టం, నిమిషం, వినాడి, ఘడియ, ముహూర్తం, పగలు, రాత్రి, దినం, వారం, పక్షం, మాసం, ఋతువు - వీటితోకూడిన సంవత్సరాలభేదంకలదై, దివ్యమై, భగవల్లీలోపకరణమై ఉంటుంది.

**<u>వైష్ణవుల లక్షణాలు</u> :-** సాధారణంగా ఇవి బాహ్య , ఆంతరంగికాలని రెండు విధాలు. బాహ్యంగా వైష్ణవుని లక్షణాలుగా కంఠంలో తులసిపూసలమాలని ధరించడం , భుజాలకి శంఖచక్రాల్ని ధరించడం , ముఖానికి ఊర్ధ్వపుండ్రాలు ధరించడం మొదలైనవి.

ఆంతరంగిక లక్షణాలుగా అష్టాక్షరిని నిత్యం అనుష్ఠిస్తూ నిష్ఠకలిగి ఉండడం , జ్ఞానానురాగపూర్వకంగా ఇతరదేవసంబంధా పట్ల వైరాగ్యం కలిగిఉండడం మొదలైనవి ఉన్నాయి.

వైష్ణవభక్తుడు భగవంతుని వాసస్థానంలోఉండడం భగవద్భక్తుల్ని అనుభవించడం - వంటివాటికోసం ప్రయత్నించేవాడు కావాలి. భగవత్సేవాతత్పరుడై ఉండాలి. ఆనందప్రదమైన ప్రేమ భగవత్సేవకి దారి తీస్తుంది. ఆప్రేమ భగవంతునిమీద కలగడానికి భక్తుడు విమోక , వివేక , అభ్యాస , అనవసాద , అనుద్ధర్ష , క్రియ , కళ్యాణాలనే సప్తాంగసాధనాల్ని చేపట్టగలిగిఉండాలి.

అంతే ఆహారనియమం కలిగిఉండడం , విషయ భోగాలపట్ల ఆసక్తికలగకుండా ఉండడం , భగవద్విషయాల్ని మాటిమాటికీ పరిశీలించుకోవడం , తనశక్తిమేరకు యజ్ఞాలు చేయడం , పరద్రవ్యంపట్ల విముఖత కలిగిఉండడం , సత్యం - అహింస - దయ - దానగుణాలు కలిగి ఉండడం విష్ణుభక్తుల లక్షణాలు. కోరికల్ని విడిచిపెట్టడం ముఖ్యమైనలక్షణం.

భగవత్స్వరూపానుభవమే (మోక్ష) కైవల్యపదవి అనికొందరు నిర్వచించారు. భక్తవత్సలుడైన పరమాత్మ నిరవధికానంత రూపాన్ని, పునరావృత్తి రహితమైన స్వపద (వైకుంఠ) వాసంలో ప్రాణి అధికారంమేరకు సాలోక్యముక్తి, సామీప్యముక్తి, సారూప్యముక్తుల్ని అనుగ్రహించడానికి స్వస్వరూపానుసంధాన మహాభాగ్యమనుభవించడమే కలిగే గతిగా, అదే మోక్షసుఖానుభవంగా చెప్పబడింది.

విశిష్టాద్వైతంలో రెండు భేదాలున్నాయి. రామానుజునికి పూర్వం ఒక్కటిగానే ఉన్నా ఆయనతర్వాత భేదాలు ఏర్పడ్డాయి. రామానుజ విధానానికి తెన్గల (పాంచరాత్ర) సంప్రదాయమని, వేదాంతదేశిక విధానానికి వడగల (వైఖానస) సంప్రదాయమని పేర్లు. ఈ సంప్రదాయాల్లో అభిప్రాయ భేదాలు తక్కువ కానీ పట్టుదలలెక్కువ. ఈ రెండు రకాల భక్తుల్లోనూ భేదం వీరి ముఖాల్లోనే కనిపిస్తుంది. వీరు ముఖంలో ధరించే నామాలు వేరుగా ఉంటాయి. తెన్గల సంప్రదాయంవారు ముక్కుమీదకి పాదం వచ్చేట్లుగా తిరుమణిదిద్దుతారు. వడగలవా పాదంలేకుండానే తిరుమణిదిద్దుతారు. తెన్గలవారిలో వితంతువులు శిరోముండనం చేసుకోరు. వడగలవారు శిరోముండనం చేసుకుంటారు.

ఈశ్వరకటాక్షం ఎవరిపట్లైనాసరే నిర్హేతుకంగా కలుగుతుందని తెన్గలవారు, సహేతుకంగా కలుగుతుందని వడగలవారు చెప్తారు. పరమాత్మ ఆశ్రితులదోషాల్నికూడా భోగ్యంగా తలచే వాత్సల్యగుణం కలవాడనీ, పరులదుఃఖాన్ని తనదుఃఖంగా తలచే దయామయుడనీ తెన్గలవారు తలుస్తారు.

వడగలవారు అలాకాకుండా భక్తులదోషాల్ని పరమాత్మ లక్ష్యపెట్టకపోవడమే వాత్సల్యమని , పరదుఃఖాన్ని సహించకుండా ఉండడమే 'దయ' అని నిర్వచిస్తారు

తెన్గలవారు ప్రపత్తి భక్తిలాగ మోక్షసాధనం కాదంటారు. స్వరూపయథాత్మ్యజ్ఞానే ప్రపత్తికి అధికారి అని , సర్వధర్మపరిత్యాగము ప్రపత్తికోసం చెయ్యాలనీ అంటారు. వడగలవారు - ప్రపత్తికి ఆకించనుడే అధికారిఅనీ , సర్వధర్మ పరిత్యాగమూ అప్రయత్నంగానే (ఆకించనుడికి) జరుగుతుందనీ అంటారు.

తెన్గలవారు — శాస్త్రోక్తకర్మల్ని ప్రపన్నుడాదరించడం, ఆప్రపన్నునిచూసి ఇతరులాచరించడాన్ని ప్రోత్సహించడమనీ , ప్రపత్తికి పూర్వధర్మాలైన వాటని ప్రపన్నుడాచరించక్కర్లేదనీ , ప్రపన్నులందరికీ పరమేశ్వరానుగ్రహం ఇదివరకే ఉంటుందనీ , ప్రపన్నుడు ఏకారణంచేతనైనా పాపంచేసినా పూర్వప్రపత్తిని అనుసంధిస్తే పాపనివృత్తి అవుతుందనీ,ప్రపన్ను ఎంతహీనకులజుడైనా గౌరవింపబడటానికి అర్హుడేనని అంటారు. వడగలవారు అలాకాక శాస్త్రోక్తకర్మల్ని ఆచరించడం భగవదాజ్ఞానుసారం భగవత్ప్రీతికోసమ ప్రపన్నుడికి పూర్వధర్మాలు ప్రపత్తికి అంగాలు కాబట్టి ఆచరణీయాలనీ, ప్రపన్నులందరికీ భగవదనుగ్రహం కలగదనీ, ప్రపన్నుడేకారణంచేతైనా పాపంచేసినట్లైతే , మళ్ళీప్రపత్తిని సక్రమంగా ఆచరించాలనీ, హీనకులస్థుడు ప్రపన్నుడైనా తారతమ్యం ఉంటుందనీ చెప్తారు.

తెన్గలవారు అణుప్రాయాలైన ఆత్మల్లో ఈశ్వరుడు అంతర్యామిగా ఉన్నాడనీ, వడగలవారు ఆత్మలో ఈశ్వరుడు వుండడం అసంగతమనీ, ఆత్మలో కాకుండా బయట అంతటినీ వ్యాపించి వుంటాడనీ అంటారు.

తెన్గలవారు కర్మ, జ్ఞాన, భక్తి యోగాలు మూడూ ఆచార్యనిష్ఠతో కూడి మోక్షానికి స్వతంత్రోపాయాలని, మోక్షలాభం ఈశ్వరునిదే కాని జీవులది కాదని, అది అధికారభేదాన్ని అనుసరించి వుంటుందని అంటారు. వడగలవారు కర్మ, జ్ఞానాలు భక్తికి అంగాలేకాని స్వతంత్రోపాయాలు కావని అంటారు. మోక్షలాభం ఈశ్వరునిది కాదని, జీవులదేనని, అధికారభేదం అనేది లేనేలేదని అంటారు.

ఈ విధంగా వైష్ణవంలో పరమాత్మ, చిదచిత్తుల లక్షణాలు, వైష్ణవుల లక్షణాలు కనిపిస్తున్నాయి.

**మతవిధులు** :- మతవిధులకి వైష్ణవమతంలో సంస్కారపంచకము అని పేరు. "తాపః పుండ్రస్తథానామ మంత్రో యాగశ్చ పంచమః" అని తాపము, పుండ్రము, నామము, మంత్రము, యాగము - అనేవి ఐదు సంస్కారవిధులు నిర్ణయింపబడ్డాయి.

**1. తాపము** :- తప్తంచేయబడిన (కాల్చిన, వేడిచేసిన) శంఖచక్రాల్ని భుజాలమీద తపింపచేసి, చిహ్నమేర్పడేటట్లు చేసే సంస్కారవిధి.

**2. పుండ్రము** :- శ్వేతమృత్తిక (సుద్ద) తోనూ, శ్రీచూర్ణంతోనూ ద్వాదశోర్ధ్వపుండ్రాలు నిత్యమూ ధరించే సంస్కారవిధి.

**3. నామము** :- విష్ణుసంబంధనామాల్ని వాడుకపేరుగా ధరించేసంస్కారవిధి.

**4. మంత్రము** :- అష్టాక్షరీమహామంత్రం ఉపదేశంపొంది, జపంచేసే సంస్కారవిధి.

**5. యాగము** :- తిరువారాధనమనబడే పరమేశ్వరారాధనం చేసే సంస్కారవిధి.

ఈ పంచసంస్కారాల్లో పనికి 'సమాశ్రయణము' అని, గురువుకి 'ఆచార్యుడు' అని, పరమేశ్వరునికి 'పెరుమాళ్' అని, ముఖ్యభక్తులకి 'ఆళ్వారులు' అని మతసాంకేతిక నామాలున్నాయి.

అలాగే పరమేశ్వరార్చనం ఐదువిధాలుగా చెప్పబడింది.

**1. అభిగమనం** :- దేవతాస్థానమార్గాల్లో సమ్మార్జనాది (తుడవడంమొదలైన) కైంకర్యాల్ని చెయ్యడం.

**2. ఉపాదానం** :- చందనం, పూలు, మాలలు మొదలైన పూజాద్రవ్యాల్ని పెరుమాళ్ళకోసం సంపాదించడం.

**3. ఇజ్య** :- పెరుమాళ్ళ పూజచెయ్యడం.

**4. స్వాధ్యాయం** :- అర్థానుసంధాన పూర్వకంగా మంత్రజపంచెయ్యడం, తత్త్వప్రతిపాదకాలైన మతశాస్త్రాభ్యాసం చెయ్యడం మొదలైనవి.

**5. యోగం :-** దేవతానుసంధానం చెయ్యడం.

ఇవి మతవిధులుగా చెప్పబడ్డాయి. ఉపాసనాసహిత జ్ఞానంచేత ద్రష్టదర్శనాలు (చూసేవారు, చూడబడేవి) రెండూనశించినప్పుడు ఉండేవంటి జ్ఞానం కలిగినవాడు భగవద్భక్తుడనబడతాడు.

విశిష్టాద్వైతమతసిద్ధాంతం మేరకు ప్రాణికి ఉండేబంధం మలినవంతమై సంసారవేదనలు కలుగుతున్నాయి. వాటినుంచి విముక్తికి కారణం పరమేశ్వరానుగ్రహం. విముక్తినిచ్చేఅధికారం పరమాత్మది. సర్వత్రాస్వతంత్రుడైన పరమాత్మ దయామయుడుకాబట్టి తన భక్తులకతిశయాన్ని (ప్రసాదసిద్ధిని) ఇస్తూ ఉంటాడు. పరమాత్మ ప్రసాదసిద్ధి కలగనిదే మోక్షం కలిగేసాధనం వేరేదీ లేదు కాబట్టి పరమాత్మ అనుగ్రహం కాంక్షించి అర్చనాదులు జరుపుతూ ప్రపత్తితో భక్తుడు వేచి ఉండాలి.

**వైష్ణవధర్మాలు :-** వైష్ణవమతధర్మంలో జగత్సృష్టి, స్థితి, లయవిధానాలు వేరుగా ఉంటాయి. మహావిష్ణువే సర్వానికి కర్త, భర్త, నియామకుడు. మహావిష్ణుతత్త్వం స్వయంరూపమహావిష్ణువు, తదేకాత్మరూపమహావిష్ణువు, ఆవేశరూపమహావిష్ణువు అనిమూడు విధాలుగా ఉంటుంది.

**1. స్వయంరూప మహావిష్ణువు :-** ఇదిస్వయంరూపమనీ, స్వయం ప్రకాశమనీ రెండు విధాలు. ఇందులో స్వయంరూపం వ్రజేంద్రనందనరూపం

అని చెప్పబడింది. ఇందులో మళ్ళీ స్వయంప్రకాశం ప్రభావమనీ, విభావమనీ రెండు విధాలుగా చెప్పబడింది. ఇందులో ప్రభావం బలరామరూపమనీ, విభావం ఐశ్వర్యం, మాధుర్యం అని రెండువిధాలుగానూ చెప్పబడింది.

ఐశ్వర్యానికి 'మూలసంకర్షణ' అనిపేరుంది. ఇది ద్వారక చతుర్ధశ బలరామత్వమనీ, బృందావన ద్విభుజ బలరామత్వమనీ రెండు విధాలు. ఇంక మాధుర్యం ఆశ్రయ విగ్రహతత్త్వంగా ఉంటుంది. ఇన్నివిధాలుగా స్వయంరూపమహావిష్ణువు చెప్పబడ్డాడు.

<u>2. తదేకాత్మరూపమహావిష్ణువు</u> :- ఇది స్వాంశమనీ, విలాసమనీ రెండు విధాలు. ఇందులో స్వాంశ ① పురుషత్వము ② గుణము ③ లీలావతారాలు ④ మన్వంతరాలు ⑤ యుగావతారాలు ⑥ అర్చావతారాలు అని ఆరువిధాలు.

<u>1. పురుషత్వము</u> :- కారణార్ణవశాయి మహావిష్ణువు, గర్భోదకశాయి మహావిష్ణువు, క్షీరోదకశాయి మహావిష్ణువు అనిమూడువిధాలు.

<u>2. గుణము</u> :- బ్రహ్మ, విష్ణు, మహేశ్వరత్వాలని మూడు విధాలు.

<u>3. లీలావతారాలు</u> :- యజ్ఞవరాహ, సుయజ్ఞ, కపిల, దత్తాత్రేయ, కుమార, నరనారాయణ, ధ్రువ, పృథుచక్రవర్తి, ఋషభ, హయగ్రీవ, మత్స్య, కూర్మ, నృసింహ, హరి, వామన, హంస, మన్వంతర, ధన్వంతరి, పరశురామ, శ్రీరామ, శ్రీకృష్ణ, బలరామ, వ్యాస, బౌద్ధ, కలికి అవతారాలు.

<u>4. మన్వంతరావతారాలు</u> :- ఇవి చతుర్దశ మానవులకాలాల్లో కలిగినమహావిష్ణువు

అవతారాలు. ఇవి పద్నాలుగు.

1. స్వయం — యజ్ఞావతారము
2. స్వరోచి — విభు అవతారము
3. ఉత్తమ — శక్తిసేన అవతారం
4. తామస — హరి అవతారం
5. రైవత — వైకుంఠావతారం
6. చాక్షుష — అజితావతారం
7. వైవస్వత — వామనావతారం
8. సావర్ణి — సార్వభౌమావతారం
9. దక్షసా — ఋషభావతారం
10. బ్రహ్మసా — విష్వక్సేన అవతారం
11. ధర్మసా — ధర్మసేతు అవతారం
12. రుద్రసా — సుధామావతారం
13. దేవసా — యోగేశ్వరావతారం
14. ఇంద్రసా — బృహద్భాను అవతారం

<u>5. యుగావతారాలు</u> :- సత్యయుగంలో హరి అవతారం శుక్లవర్ణం, త్రేతాయుగంలో హయగ్రీవావతారం రక్తవర్ణం, ద్వాపరయుగంలో శ్యామావతారం కృష్ణవర్ణం, కలియుగంలో కృష్ణావతారం పీతవర్ణం.

<u>6. అర్చావతారాలు</u> :- శిలావిగ్రహంగా 'శైలీ', కర్రతో చేయబడ్డ విగ్రహంగా 'దారుమయీ', లోహంతో చేయబడ్డ విగ్రహంగా 'లౌహీ', లేపనంతో చేయబడ్డ విగ్రహంగా 'లేప్య', వ్రాయబడ్డ విగ్రహంగా 'లేఖ్యము', ఇసుకతో చేయబడ్డ

విగ్రహంగా 'సైకతి', మట్టితో చేయబడ్డ విగ్రహంగా 'మృణ్మయి చేదా మనోమయి', మణితో చేయబడ్డ విగ్రహంగా 'మణిమయి' అని అష్టవిధ అర్చావతారాలు.

తదేకాత్మరూపమహావిష్ణువులో రెండో భేదమైన విలాసం ఆదిచతుర్వ్యూహమనీ, ద్వితీయచతుర్వ్యూహమని రెండు విధాలు.

వీటిల్లో దేవస్థానాల్లో ప్రతిష్ఠింపబడే విష్ణుదేవుని విగ్రహాలచేతుల నాల్గింటిలో ఉండే శంఖం, చక్రం, గద, పద్మాల విన్యాసం తెలుస్తుంది. వీటినిగురించి తెలుసుకోవాలంటే మనకెదురుగా మనవైపుతిరిగిఉన్న విష్ణుదేవుని విగ్రహం ఉందని అనుకోవాలి. మరల నాలుగుచేతుల్లోనూ రెండుచేతులు పైకి, రెండుచేతులు క్రిందికి ఉన్నాయని అనుకోవాలి. పైకి ఉన్న విగ్రహం కుడిచెయ్యి ఒకటనీ, క్రిందివైపుకున్న విగ్రహం కుడిచెయ్యి రెండనీ, పైకి ఉన్న విగ్రహం ఎడమచెయ్యి మూడనీ, క్రింది వైపుకున్న విగ్రహం ఎడమచెయ్యి నాల్గని భావించి, మనసులో ఉంచుకుని శంఖచక్రగదాపద్మాల్ని ఆయుధాలుగా తెలుసుకోవాలి.

ఇంకా ఈ చతుర్వ్యూహాల్లో కేశవాది శ్రీకృష్ణాంతంగా వింశతి వ్యూహాలుంటాయి. అలాంటి విష్ణువు విగ్రహాలు వైభవమూర్తులనీ, విలాసమూర్తులనీ రెండురకాలమూర్తులుగా ఉంటాయి.

<u>**ఆదిచతుర్వ్యూహము**</u> :- ఇది నాలుగురకాలు.

| | | |
|---|---|---|
| వాసుదేవవ్యూహం | — | గద, శంఖం, చక్రం, పద్మం. |
| సంకర్షణవ్యూహం | — | గద, శంఖం, పద్మం, చక్రం. |
| ప్రద్యుమ్నవ్యూహం | — | చక్రం, శంఖం, గద, పద్మం. |
| అనిరుద్ధవ్యూహం | — | చక్రం, గద, శంఖం, పద్మం. |

<u>ద్వితీయచతుర్వ్యూహం</u> :- ఇది వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ భేదాలతో నాలుగువ్యూహాలు.

<u>వాసుదేవవ్యూహం</u> :- ఇందులో ఐదు ఉపవ్యూహాలు ఉన్నాయి.

| | | |
|---|---|---|
| కేశవవైభవవిలాసమూర్తి | — | పద్మం, శంఖం, చక్రం, గద. |
| నారాయణవైభవ విలాసమూర్తి | — | శంఖం, పద్మం, గద, చక్రం. |
| మాధవవైభవవిలాసమూర్తి | — | గద, చక్రం, శంఖం, పద్మం. |
| అధోక్షజ విలాసమూర్తి | — | పద్మం, గద, శంఖం, చక్రం. |
| పురుషోత్తమ వైభవవిలాసమూర్తి | — | చక్రం, పద్మం, శంఖం, గద |

<u>సంకర్షణవ్యూహం</u> :- ఇందులో ఐదు ఉపవ్యూహాలు ఉన్నాయి.

| | | |
|---|---|---|
| గోవిందవైభవవిలాసమూర్తి | — | చక్రం, గద, పద్మం, శంఖం |
| విష్ణు వైభవవిలాసమూర్తి | — | గద, పద్మం, శంఖం, చక్రం. |
| మధుసూదన వైభవవిలాసమూర్తి | — | చక్రం, శంఖం, పద్మం, గద. |
| ఉపేంద్రవైభవ విలాసమూర్తి | — | శంఖం, గద, చక్రం, పద్మం |
| అచ్యుత విలాసమూర్తి | — | గద, పద్మం, చక్రం, శంఖం. |

**ప్రద్యుమ్నవ్యూహం** :- ఇందులో ఐదు ఉపవ్యూహాలున్నాయి.

| | | |
|---|---|---|
| త్రివిక్రమ వైభవ విలాసమూర్తి | — | పద్మం, గద, చక్రం, శంఖం. |
| వామన వైభవ విలాసమూర్తి | — | శంఖం, చక్రం, గద, పద్మం. |
| శ్రీధర వైభవ విలాసమూర్తి | — | పద్మం, చక్రం, గద, శంఖం. |
| నృసింహ విలాసమూర్తి | — | చక్రం, పద్మం, గద, శంఖం. |
| జనార్దన విలాసమూర్తి | — | పద్మం, చక్రం, శంఖం, గద. |

**అనిరుద్ధవ్యూహం** :- ఇందులో ఐదు ఉపవ్యూహాలున్నాయి.

| | | |
|---|---|---|
| హృషీకేశ వైభవ విలాసమూర్తి | — | గద, చక్రం, పద్మం, శంఖం. |
| పద్మనాభ వైభవ విలాసమూర్తి | — | శంఖం, పద్మం, చక్రం, గద. |
| దామోదర వైభవ విలాసమూర్తి | — | పద్మం, శంఖం, గద, చక్రం. |
| హరి విలాసమూర్తి | — | శంఖం, చక్రం, పద్మం, గద. |
| శ్రీకృష్ణ విలాసమూర్తి | — | శంఖం, గద, పద్మం, చక్రం |

**3. ఆవేశరూప మహావిష్ణువు** :- ఆవేశరూపమంటే మహావిష్ణువు శక్తి ఆవేశించడం. ఈ విష్ణుశక్తిని పరాశక్తి అనీ, స్వరూపశక్తి అనీ అంటారు. మహావిష్ణుశక్తి ఆవహించడాన్ని ముఖ్యావేశమని అంటారు.

పరమేశ్వరుడైన మహావిష్ణువే ఒక్కొక్క ముక్తపురుషుని ఒక్కొక్కపనికి నియమించి, తనశక్తిని అతనిపై ఆవహింప జేయడమే ఇందులోని భావం. సనకుడు, సనన్దుడు, సనత్కుమారుడు,

సనాతనుడు , నారదుడు , పృథుచక్రవర్తి , పరశురాముడు , అనంతుడు , శేషుడు మొదలైనవాళ్ళు మహావిష్ణువుచే నియమింపబడి వారివారి నియమిత కార్యనిర్వహణచేసిన ముక్తపురుషులుగా చెప్పబడ్డారు.

మహావిష్ణువుశక్తి అయిన పరాశక్తి (స్వరూపశక్తి) అంతరంగశక్తి లేదా చిచ్ఛక్తి అనీ , తటస్థశక్తి లేదా జీవశక్తి అనీ , బహిరంగశక్తి లేదా మాయాశక్తి అనీ మూడువిధాలు. మళ్ళీ ఇందులో ఒక్కొక్కటి సంధినీశక్తి , సంవిత్‌శక్తి , హ్లాదినీశక్తి అనేమూడురకాలై మొత్తం తొమ్మిదిరకాల శక్తులుగా ఏర్పడ్డాయి. ఇంకా ఈతొమ్మిదిశక్తులు ఒక్కొక్కటి ఇచ్ఛాశక్తి , జ్ఞానశక్తి , క్రియాశక్తి అనే మూడు భేదాలుకలిగి మొత్తం ఇరవైయేడురకాలుగా ఏర్పడ్డాయి.

ఇంకా చైతన్య వైష్ణవసిద్ధాంతధర్మంలో ముఖ్యావేశానికి తరువాత గౌణావేశమని ఇంకొక ఆవేశముంది. దీనికి భావావేశమనిపేరు. దీన్ని 'విభూతి' అని చైతన్యమతస్థులు అంటారు. పరమేశ్వరుడైన మహావిష్ణువు తేజస్సొకరిపైపడి , అతని మనస్సులో వ్యాపించి పనినిచేసేట్లుగాచేయడం గౌణావేశమని చెప్పబడింది. గౌణావేశంలో విభూతినిపొందడం జరుగుతుంది.

ఆవిధంగా విభూతిని పొందినవాళ్ళు ఆరుగురు గోస్వాములున్నారు. వాళ్ళు శ్రీరూపగోస్వామి , సనాతనప్రభుగోస్వామి , భట్ట రఘునాథగోస్వామి , గోపాలభట్టగోస్వామి , జీవగోస్వామి , రఘునాథగోస్వామి.

ఈవిధంగా విష్ణువుధర్మాలు చెప్పబడ్డాయి.

వైష్ణవమతం విష్ణువునే సర్వస్వంగా భావిస్తుంది. విష్ణువుకిమించిన శక్తి వేరొకటిలేదని , విష్ణువే అన్నిశక్తులకి మూలమని భావిస్తుంది. ఈమతాన్ని ఆదరించి , మతంచేత తాము ఆదరింపబడిన మహానుభావులు ఎందరోఉన్నారు. మతంఅనేది మనుషుల్ని ఒకక్రమమార్గంలో నడిపిస్తుంది.

రెండో ప్రకరణం

# అన్నమయ్య కీర్తనల్లో వైష్ణవ భక్తితత్త్వం

# అన్నమయ్య సంకీర్తనల్లో వైష్ణవ భక్తితత్త్వం

బాల్యంలోనే తల్లిదండ్రుల్నివిడిచి తిరుపతివెళ్ళిన అన్నమయ్యకి స్వామిఆదేశంతో 'ఘనవిష్ణుడు' అనేయతి పంచసంస్కారాలుగావించి, వైష్ణవముద్రలిచ్చాడు. ఆనాటినుంచి అన్నమయ్య వైష్ణవుడై, విష్ణ్వవతారుడైన వెంకటేశ్వరుని కళ్యాణగుణాల్ని సంకీర్తనలుగామలిచి గానంచేస్తూ, తద్వారా వైష్ణవమతప్రచారంచేస్తూవచ్చాడు. వైష్ణవుడై, వైష్ణవంపైన అభిమానాన్ని పెంచుకొని, ఆదరించి, ఆచరించి, పలువురిచేత ఆచరింపచేసినవాడు అన్నమయ్య. అందువల్ల అన్నమయ్యకీర్తనల్లో వైష్ణవమతంలో కనిపించే ఆచారాలు, ధర్మాలు, లక్షణాలు ఒక్కటనేమిటి వైష్ణవానికి సంబంధించిన ప్రతిఅంశమూ ద్యోతకమౌతుంది. ముఖ్యంగా అన్నమయ్యకీర్తనల్లో వైష్ణవభక్తితత్త్వాన్ని ప్రతిబింబించే కీర్తనలు ఎక్కువగా కనిపిస్తాయి.

హిందూదేశంలో మతాలెన్నో ఉద్భవించినా శ్రుతి, స్మృతి ప్రమాణబలంతో నిలిచిన మతాలు మాత్రం మూడే. అవి ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతాలు.

జీవాత్మ, పరమాత్మలు శాశ్వతంగా వేరని చెప్పేది ద్వైతం. జీవాత్మపరమాత్మలకి దశాభేదమేగాని, వస్తువొక్కటేనని చెప్పేది అద్వైతం. జీవాత్మపరమాత్మలు ఒక్కటే అయినా వాటిసంబంధం శరీరశరీరి భావనతో కూడినది. శరీరి ప్రధానం. శరీరం అప్రధానం. శరీరం శరీరిని ఆశ్రయించి ఉండేదని చెప్పేది విశిష్టాద్వైతం. ఈమతంలో విష్ణువుతప్ప మిగతాదంతా అప్రధానమే. ఇక్కడ శరీరం అంటే ప్రకృతి, శరీరి అంటే జీవుడు. ఈజీవుడు ప్రకృతితో కూడి పరమాత్మయందుండాడు.

"జీవనపరమార్థమైనముక్తి భగవత్ప్రాప్తిరూపమైనది"[1] ఈముక్తిని పొందడానికి అనేక సాధనాలు, ఉపాయాలు వేదకాలంనుండి చెప్పబడుతూ వచ్చాయి. ముఖ్యంగా కర్మ, జ్ఞాన, భక్తిమార్గాలు ప్రధానమార్గాలుగా భావించబడ్డాయి. వీటిలో మూడోఅంశమైన భక్తి 'భజ' ధాతువునుండి వచ్చింది. 'భజసేవాయాం' అనేదాన్నిబట్టి వచ్చినభక్తి సేవారూపమైంది. అంటే భగవంతునిపూజించడమేభక్తి.

"మోక్షప్రాప్తికై ఏకైకసాధనము భక్తియని వైష్ణవ

---

1. డా॥ కిడాంబినరసింహాచార్య, తిరునామములు - సమగ్రపరిశీలనము, పుట-48.

విశ్వాసము. మోక్షమునకు ముఖ్యసాధనము భగవత్ప్రసాదము, భగవదనుగ్రహము. ఆయనుగ్రహప్రాప్తికి సాధనము జ్ఞాన, ధ్యాన, వేదన, ఉపాసనాశబ్దములచే చెప్పబడు భక్తియోగము." [1]

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరునిమీద 32000 కీర్తనలు చెప్పాడు. వీటని అధ్యాత్మ, శృంగారకీర్తనలుగా విభజించాడు. వేదాంతం, భక్తి, లోకనింద మొదలైనవాటికి సంబంధించిన కీర్తనలు అధ్యాత్మికాలు. నాయికానాయకుల ప్రణయానికి సంబంధించిన కీర్తనలు శృంగారాలు. జీవపరమాత్మలచర్చ ప్రధానంగా వేదాంతానికి సంబంధించింది. జ్ఞాన, భక్తి, ధ్యానయోగాలు అధ్యాత్మకీర్తనల్లో చెప్పబడ్డాయి.

సకలకళ్యాణగుణోపేతుడు, సచ్చిదానందమూర్తి, పరమపురుషుడు అయిన విష్ణువుపైన శ్రద్ధాపూర్వకమైన ప్రేమానురాగాల్ని ప్రదర్శించడం భక్తి అనిపించుకుంటుంది. భక్తి ఒక పారవశ్యానికిలోనైన భవ్యస్థితి. అది అమృతస్వరూపం. పరమాత్మ భక్తికిమాత్రమే సులభుడు. వైష్ణవాన్నిస్వీకరించి, భక్తి సులభుడైన పరతత్వాన్ని వేంకటేశ్వరుడిగా సేవించి, వేంకటేశ్వరుడే కలియుగంలో జీవులకి ముక్తిదాయకుడని భావించి అన్నమయ్య –

"భక్త సులభుడును పరతంత్రుడు హరి
యుక్తి సాధ్యమిదె యొకరికీగాడు" (సం.3 - కీ.10)

---

1. గరిమెళ్ళ వీరరాఘవులు, విష్ణుతత్త్వము - విగ్రహము, పుట -43.

అని కీర్తించాడు. ఈ కీర్తనలో అన్నమయ్య విష్ణువుని కీర్తిస్తూనే తన అల్పత్వాన్ని, పరమాత్మ ఆధిక్యాన్ని చెప్పుకున్నాడు.

వ్యక్తోపాసనే భక్తిఅని ప్రపంచంలో వాడుక. అయినా వ్యక్తోపాసనలు చాలాఉన్నాయి. అవిఅన్నీ భక్తియోగమనిపించుకోవు. ఉపాస్యం (ప్రతీక) ఏదైనాసరే దానిలో సర్వవ్యాపి అయిన భగవంతుణ్ణిచూసి అలాభావించిచేసిన భక్తే నిజమైన వ్యక్తోపాసన. అన్నిటలోనూపరమేశ్వరుడొక్కడే అనే భావంతో పూజించడమే నిజమైనభక్తి. ఉపాసన అంటే భగవంతునికి సమీపంలో కూర్చోవడం అనిఅర్థం. అంటే భగవంతునిపైతప్ప ఇకదేనిపైనా ఆసక్తిలేకపోవడం. అలాగే కర్మజ్ఞానాల్ని తరించడంచేత కలిగే ఫలమేభక్తి. భగవంతునిపై భక్తుడుచూపే అవ్యాజమైన ప్రేమేభక్తి. ఈ విషయమే నారదభక్తిసూత్రాల్లో "సాత్వస్మిన్ పరమప్రేమరూపా" అని చెప్పబడింది. నారదపాంచరాత్రంలో భీష్ముడు, ప్రహ్లాదుడు భగవంతుడునావాడనే మమకారమే భక్తి అని చెప్పారని చెప్పబడింది. భగవంతునిపట్ల అవ్యాజమైన పరమప్రేమతో జీవుడుచేసే సమస్తకర్మలూ భగవంతునిలోనే సన్యస్తాలుకావాలి. భక్తునిమనసు ఈశ్వరునితో నిండిఉండాలి. అంటే ఆమనసే ఈశ్వరునిగా అయిపోవాలి. విష్ణుని అర్చించే చేతులే చేతులని, విష్ణుని కొనియాడేనోరేనోరని అనుకునే స్థితిరావాలి. ఈస్థితిలో జీవుడికి భావనాయోగం మాత్రమే కాకుండా, ప్రకృతిలోకూడా ఈశ్వరానుభవం సిద్ధిస్తుంది. అందుకే అన్నమయ్య -

" **భావములో నా బాహ్యము నందును**

**గోవింద గోవిందయని కొలువవో మనసా**

హరియవతారములే యఖిలదేవతలు
హరిలోనివే బ్రహ్మాండములు
హరినామములే అన్నిమంత్రములు
హరిహరిహరి యనవో మనసా (సం.3 - కీ.561)

అన్నాడు. భక్తుడికి లోకమంతా ఈశ్వరమయం. భావనా ప్రవృత్తుల భేదాన్నిబట్టీ సఖ్య, వాత్సల్య, దాస్య, శృంగార, వైర భేదాలబట్టీ భక్తి అనేకవిధాలు.

భక్తిని నారదాదులు పరమప్రేమరూపంగా నిర్వచించారు. సాధారణంగా ప్రేమ అంటే ఒకవస్తువుపట్లగాని, ఒకవ్యక్తిపట్లగాని కలిగే అనురాగం. అయితే విషయానురాగం క్షణికమైంది. భగవంతుని విషయంలో ఏర్పడే అనురాగం అవిచ్ఛిన్నమైనది, బ్రహ్మానందభరితమైనదీను. కానీ జీవునిమనసు తెలిసీకూడా విషయానురాగాలపట్ల శ్రద్ధ చూపిస్తుంది. అప్పుడు జీవుడు తన మనసుని తన అధీనంలో ఉంచుకోవాలి. విషయానురాగాల పట్ల ఉన్న అనురాగం కేవలం భగవద్విషయకం మాత్రమే అయ్యేట్లు చూసుకోవాలి. అలా నిష్కామంగా, నిర్హేతుకంగా భగవంతునిపట్ల ఏర్పడిన నిరంతర ప్రేమే భక్తి. ఆభక్తి జీవునికి పరస్వరూపజ్ఞానానంతరం అంటే భగవంతుని స్వరూపజ్ఞానం, సర్వశక్తిమత్వం, సర్వజ్ఞత్వం, వాత్సల్యం, సౌశీల్యం, సౌలభ్యం మొదలైన గుణాలజ్ఞానం కలిగినతర్వాతనే ఏర్పడుతుంది. ఇటువంటి వైష్ణవభక్తి చిగురించడానికి వైష్ణవుడనేవాడెంచెయ్యాలో చెప్పే అన్నమయ్య కీర్తన ఇది —

" వతెనను పొందె వైష్ణవము యిది
వలప్రుఁ దౌనెపో వైష్ణవము ॥ పల్లవి ॥
కోరిక బడుగుచు గుఱి నిన్నిటిపై
వైరాగ్యమెపో వైష్ణవము
సారెకుఁ గోపముఁ జలమునుఁ దనలో
వారించుటపో వైష్ణవము ॥ వతె ॥

సుడిగను దేహప్రసుఖదుఃఖములో
వడిఁ జొరనిదెపో వైష్ణవము
ముడివడి యింద్రియముల కింకరుఁడై
వడఁబడనిదెపో వైష్ణవము ॥ వతె ॥

వృదుడునఁ దనసక లోపాయంబుల
వదుటడపో నిజవైష్ణవము
యెదుటను శ్రీవేంకటేశ్వరు నామము
వదనము చేర్చుట వైష్ణవము ॥ వతె ॥ (సం.1-కీ.405)

ఈ కీర్తనలో అన్నమయ్య వైష్ణవాన్ని స్వీకరించిన భక్తునికి ఉండవలసిన లక్షణాల్ని పొందుపరిచాడు.

" భగవంతునికి , భక్తునికి తొమ్మిదిరకాలసంబంధాలు

ఉంటాయి. 1. పితృపుత్ర సంబంధము 2. రక్ష్యరక్షక సంబంధము 3. శేషశేషి సంబంధము 4. భర్తృభార్యా సంబంధము 5. జ్ఞాతృజ్ఞేయ సంబంధము 6. స్వస్వామి సంబంధము 7. ఆధారాధేయ సంబంధము 8. శరీరాత్మ సంబంధము 9. భోక్తృభోగ్య సంబంధము." [1]

ఈ సంబంధాలన్నిటినీ దృష్టిలోపెట్టుకొని భగవంతుడికి తననిపూర్తిగా సమర్పించుకుంటే అప్పుడు భగవంతుడు ముక్తి ప్రసాదిస్తాడు. భక్తిమార్గం మూడున్యాయాలుగా ఉంటుంది. 1. మార్జాలకిశోరన్యాయం 2. మర్కట కిశోరన్యాయం 3. కచ్ఛపకిశోరన్యాయం.

ఇందులో మార్జాలకిశోరన్యాయం అంటే పిల్లిపిల్లకి ఏ బాధ, భయమూ, బాధ్యత ఉండవు. అంతా తల్లిపిల్లికే ఉంటుంది. పిల్లి తనపిల్లని ఒకచోటునుంచి ఇంకోచోటుకి తీసుకువెళ్ళేటప్పుడు ఎంతోజాగ్రత్తగా ఆపిల్లకి ఏ బాధ, నొప్పి కలగకుండా తననోట్లోఉండే మెత్తలతో పిల్లమెడని కరిచిపట్టుకుని తీసుకువెళ్తుంది. తల్లి ఎక్కడికి తీసుకువెళితే పిల్ల అక్కడికి కళ్ళుమూసుకుని తన శరీరాన్ని మొత్తం తల్లిఆధీనంచేసి వెళ్తుంది. అలాగే సంపూర్ణ విశ్వాసాన్ని భక్తుడు భగవంతుడిమీదపెట్టి సర్వమూ అతడికే వదిలేసి, సర్వమూ తనకిక అతడే అనుకోవాలి. అప్పుడే భగవంతుడుకూడా ఆభక్తునిపైన అంతశ్రద్ధా చూపిస్తాడు. ముక్తిని ప్రసాదిస్తాడు. అలాముక్తిని పొందినవాడు తిరిగి

---

1. గరిమెళ్ళ వీరరాఘవులు, విష్ణుతత్త్వము - విగ్రహము, పుట - 52.

ఆత్మాభిమానం, శరీరాభిమానం, లౌకికవిషయాసక్తులు తనకి పుట్టకుండా ఉండడంచేత పునరావృత్తిరహితమైన, శాశ్వతమైన భగవద్గుణానురూపముక్తిని పొందుతాడని వైష్ణవమతం విశ్వసిస్తుంది. అటువంటిముక్తిని పొందడానికి భక్తుడు భగవంతుని వాసస్థానంలో ఉండడం, భగవద్భక్తుల్ని అనుభవించడం భగవంతుని దగ్గరుండడం, భగవద్రూపసామ్యాన్నిపొందడం, భగవల్లీనమవడం వంటికోర్కెల్నికూడా వదిలేసి నిష్కామంతో భగవత్సేవ చెయ్యాలి. అన్నిటికంటె భగవత్సేవే ముఖ్యం. లోకంలో సేవాభావం దుఃఖాన్ని కలిగించేదిగా ఉంటుంది. కాని భగవత్సేవ చెయ్యడంమాత్రం బ్రహ్మానందాన్నిస్తుంది. అన్నమయ్యకి పరమాత్మపట్ల సేవాతత్పరత ఎక్కువని —

"నీదాస్యమొక్కటే నిలిచి నమ్మఁగలది
శ్రీదేవుఁడవు నీచిత్తము నాభాగ్యము ॥పల్లవి॥

పుత్రదారధనధాన్యభూములు నమ్మితినా
పాత్రమ గురుఋణానుబంధము లవి
చిత్రముగ నముఁగావు శ్రీవేంకటేశ నీవే
పత్రపుష్పమాత్రమే నాభక్తియెల్లా నీకు" ॥నీదా॥ (సం.2-కీ.20)

అనే కీర్తన తెలుపుతుంది. అటువంటి ఆనందాన్నిచ్చే ప్రేమ భగవంతునిపైన కలగడానికి భక్తుడుచేసే ప్రయత్నాలకే సప్తాంగాలని పేరు. అవి — వివేకము, విమోకము, అభ్యాసము, అనవసాదము, అనుద్ధర్షము, క్రియ, కళ్యాణం.

వివేకమంటే ఆహారశుద్ధి. వైష్ణవభక్తుడు సత్త్వగుణాభివర్ధక ఆహారాన్నే భుజించడం. విమోకమంటే భోగాలపట్ల అనురాగాన్ని త్యజించి వాటికి దూరంగా ఉండడం. భక్త్యాలంబనమైన భగద్విషయాన్ని మాటిమాటికీ పరిశీలించుకోవడం అభ్యాసం. నిత్యమూ ఉత్సాహంగా ఉండడం అనవసాదం. అతిసంతోషం లేకుండా ఉండడం అనుద్ధర్షం. యథాశక్తితో దేవ, బ్రహ్మ, పితృ, మనుష్య, భూత యజ్ఞాల్ని చెయ్యడం క్రియ. సత్యం, దయ, దానం, అహింస, పరద్రవ్యంపట్ల అనాసక్తి వంటి గుణాలుండడం కళ్యాణం. ఈ సప్తాంగాలు మానవుణ్ణి ఉన్నతునిగా తీర్చిదిద్దుతాయి కూడా. ఈ సప్తాంగాల్ని తెలిపే కీర్తనలు అన్నమయ్యకీర్తనల్లో చాలా ఉన్నాయి. ఉదాహరణకి —

" పరమయోగీశ్వరుల పద్ధతి యిది
ధరలోన వివేకులు దలపోసుకొనుట ॥ పల్లవి ॥

మొదల నాత్మజ్ఞానము దెలిసి పిమ్మట
హృదయములోని హరి నెరుగుట
వుదుటైన యింద్రియాల నోడిసి పంచుకొనుట
గుదిగొన్న తనలో కోరికె లుడుగుట ॥ పర ॥

తనపుణ్యఫలములు దైవముకొసగుట
పనివడి యతనిపై భక్తి చేసుట

తనివితో నిరంతరధ్యానయోగపరుఁడౌడు

మనసులోఁ బ్రకృతి సమ్మంధము మరచుడు ॥ పర ॥

నడుమ నడుమ విజ్ఞానపు కథలు వినుడు

విడుముడి నాచార్యసేవ చేయుడు

యెడయక శ్రీవేంకటేశుపై భారమువేసి

కడ వైష్ణవులకృప గలిగి సుఖించుడు ” ॥ పర ॥

(సం.3 - కీ.212)

“ జ్ఞానయజ్ఞ మీగతి మోక్షసాధనము

నానార్థములు నిన్నే నడిపె మాగురుడు ”

(సం.2 - కీ.148)

“ ఇందిరవడ్డించ నింపుగను

చిందక యిట్లె భుజించవో స్వామి ॥ పల్లవి ॥

అక్కాళపాకాలు నప్పాలు వడలు

పెక్కైన సయిదంపు పేణులను

సక్కెరరాశులు సద్యోఘృతములు

కిక్కిరియ నారగించవో స్వామీ ” ॥ ఇందిర ॥

(సం.1 - కీ.22)

సప్తాంగాల్ని తెలియజేసే ఇటువంటి కీర్తనలు అన్నమయ్య

ంద్రవేదంలో చాలానే ఉన్నాయి.

అలాగే భక్తుల ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని అని నాలుగురకాలు. ఆర్తుడు, అర్థార్థి ఇద్దరూ ఐహికైశ్వర్యకాములు. జిజ్ఞాసువు ఆత్మస్వరూపాన్ని తెలుసుకోదలచినవాడు. జ్ఞాని భగవంతుని పొందదలచినవాడు. వీరిలో భగవంతుని పొందదలచిన జ్ఞాని మాత్రమే ఉత్తమభక్తుడు. జ్ఞాని అయిన వానికి మోక్షం ఇట్టే లభిస్తుందని అన్నమయ్య ఈక్రింది కీర్తనలో ఇలాచెప్పాడు —

"ఇష్టజ్ఞానమాత్రమున నెవ్వరైనా ముక్తులే
పుట్టుగుల మరిలేవు పొందుదురు మోక్షము"

(సం.3 - కీ. 211)

పైకీర్తనలో అన్నమయ్య జ్ఞానమంటే ఏమిటో, జ్ఞానం గొప్పతనం ఏమిటో వివరించి, జ్ఞానం కొద్దిగా ఉన్నా ముక్తులౌతారని చెప్పాడు.

సప్తాంగాలవల్ల జీవులసత్త్వం శుద్ధిచేయబడుతుంది. సత్త్వశుద్ధి చేయబడిన జీవుడు తమభక్తిని (ప్రేమపూర్వకమైన) పరమాత్మపట్ల ప్రకటించడానికి అనేకమార్గాల్ని ఎన్నుకుంటాడు. ఏమార్గాన్ని ఎన్నుకున్నా భక్తుడికి గమ్యం ఒక్కటే. అదే పరమపదం.

భాగవతం భక్తిమార్గాల్ని తొమ్మిదివిధాలుగా చెప్పింది. నారదుడు పదకొండు, ఆలంకారికులు ఐదువిధాలుగా విభజించారు.

<u>భాగవతం</u> :- 1. శ్రవణం 2. కీర్తనం 3. స్మరణం 4. పాదసేవనం

5. వందనం 6. అర్చనం 7. దాస్యం 8. సఖ్యం 9. ఆత్మనివేదనం.

నారదభక్తిసూత్రాలు :- 1. గుణమాహాత్మ్యాసక్తి 2. స్మరణాసక్తి 3. రూపాసక్తి 4. పూజాసక్తి 5. దాస్యాసక్తి 6. సఖ్యాసక్తి 7. ఆత్మనివేదనాసక్తి 8. వాత్సల్యాసక్తి 9. కాంతాసక్తి 10. పరమవిరహాసక్తి 11. తన్మయాసక్తి.

ఆలంకారిక రసపర భక్తిమార్గాలు :- 1. దాస్యభక్తి 2. సఖ్యభక్తి 3. వాత్సల్యభక్తి 4. మధురభక్తి 5. శాంతభక్తి.

ఈ భక్తిమార్గాలన్నిటినీ అన్నమయ్య తనకీర్తనల్లో వివరించాడు. భాగవతంచెప్పిన భక్తిమార్గాలు అన్నమయ్యకీర్తనల్లో ఇలా ఉన్నాయి —

1. శ్రవణం :- ఎల్లప్పుడూ భగవద్గుణమహిమలు వినడం శ్రవణం. అన్నమయ్య విష్ణునికథలు, గుణకీర్తులు, మహిమలు విన్నాడుగాబట్టె విష్ణుసంకీర్తన చేశాడని చెప్పవచ్చు. అన్నమయ్య —

" కలిగె మాకు నిది కైవల్యం
కలకాలము హరికథాశ్రవణం ॥ పల్లవి ॥

నిరతం నిత్యం నిఖిల శుభకరం

దురితం పోర భవదూరం
పరమ మంగళం భావాతీతం
కరివరదం నిజకైంకర్యం" ॥ కలిగె ॥

(సం.2 - కీ.464)

ఈ కీర్తనలో శ్రవణభక్తిమార్గాన్ని తెలిపాడు. ఇంతేకాక "వినరో భాగ్యము విష్ణుకథ, వెనుబలమిదివో విష్ణుకథ" (సం 3 - కీ.355) అంటూ లోకులకి కూడా విష్ణుకథల్ని వినమని చెప్పాడు.

2. కీర్తనం :- భగవంతుని గుణగానం చెయ్యడమే కీర్తనం. అన్నమయ్య రోజుకొక్క సంకీర్తన చొప్పున శ్రీవెంకటేశ్వరునిపై చెప్పి ఆయన గుణాల్ని తనివితీరా కీర్తించాడు. అన్నమయ్య చెప్పిన -

"చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు
జాలెల్ల నడగించు సంకీర్తనం ॥ పల్లవి ॥

సంతోషకరమైన సంకీర్తనం
సంతాపమణగించు సంకీర్తనం
జంతువుల రక్షించు సంకీర్తనం
సంతతముఁ దలఁచుఁడీ సంకీర్తనం" ॥ చాలదా ॥

(సం.1 - కీ.343)

ఈ కీర్తనలో విష్ణుసంకీర్తన గొప్పతనం వివరించాడు.

తాను వేంకటేశ్వరునిపై భక్తితోచెప్పిన కీర్తనల్లో ఒక్కటో వేంకటేశ్వరానుగ్రహం సంపాదించడానికి చాలనిచెప్పే -

" దాచుకో నీపాదాలకుఁదగ నేఁజేసిన పూజలివి
పూఁచి నీకీరితిరూపు పుష్పములివియయ్యా ॥ పల్లవి ॥

వొక్క సంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించగ
తక్కినవి భండారాన దాఁచి వుండనీ
వెక్కసమగు నీనామము వెలసులభము ఫలమధికము
దిక్కై నన్నేలితివిఁక నవి తీరని నాధనమయ్యా " ॥ దాచుకో ॥

అనేకీర్తనకూడా అన్నమయ్యకి సంకీర్తన మీదఉన్న గాఢమైననమ్మకాన్ని తెలుపుతుంది.

<u>3. స్మరణం</u> :- పరమాత్మ సర్వవ్యాపకత్వాదిగుణాల్ని స్మరించడం - నిత్యమూ పరమాత్మని తలుచుకుంటూ ఉండటం స్మరణం.

" మఱచితిమంటో మరిలేదు
తఱితో దలచవో దైవము మనసా ॥ పల్లవి ॥

పుట్టుటునున్నది పోవుటునున్నది

పట్టపు జీవుల ప్రపంచము

నట్ట నడుమనే నరహరి నామము

గుట్టున దలచవొ గనుగొని మనసా " [1]

అనే కీర్తనలో స్మరణభక్తిని గురించి చెప్పాడు.

<u>4. పాదసేవనం</u> :- నిరంతరం భగవంతుని పాదాల్ని సేవిస్తూ ఉండడం పాదసేవనం. అన్నమయ్య తాను నమ్మిన శ్రీవేంకటేశ్వరుని పాదాల్ని –

" ఈ పాదమే కదా యిలయెల్లఁ గొలచినది

యీ పాదమే కదా ఇందిర హస్తముల కితవైనది    ॥ పల్లవి ॥

ఈ పాదమే కదా ఇందరును మ్రొక్కెడిది

యీ పాదమే కదా యీగగనగంగ పుట్టినది.

యీ పాదమే కదా యెలమిఁ బెంపొందినది

యీ పాదమే కదా యిన్నిటికి నెక్కుడైనది "    ॥ ఈ పాదమే ॥

(సం.1 - కీ.66)

అని భావించి,

" కల్లగాదు శ్రీవేంకటేశుని పాదసేవ నాకు

---

1. అన్నమాచార్యులవారి ఆధ్యాత్మ శృంగార సంకీర్తనలు (స్వరసహితం),

టి.టి.డి. ముద్రణ, పుట - 82.

మొల్లమాయ నామనసు మోదమాయ దైవమా " (సం.1 - కీ.186 )

అని శ్రీవేంకటేశ్వరుని పాదసేవ చేసుకున్నాడు. ఈవిధంగా అన్నమయ్య తన కీర్తనల్లో పాదసేవనాన్ని గురించి చెప్పాడు.

5. వందనం :- భగవంతునిపైనే తనసర్వభారమూఉంచి మనోవాక్కాయ కర్మలతో (త్రికరణశుద్ధిగా ) నమస్కారం చెయ్యడం వందనం. అన్నమయ్య –

" వందే వాసుదేవం

బృందారకాధీశ వందిత పదాబ్జం ॥ పల్లవి ॥

కరిపురనాథ సంరక్షణే తత్పరం

కరిరాజవరద సంగత కరాబ్జం

సరసీరుహాననం చక్రవిభ్రాజితం

తిరువేంకటాచలా దేవం భజే " ॥ వందే ॥

( సం.1 - కీ.53 )

అనే కీర్తనలో ఈ వందనమనే భక్తిమార్గాన్ని పాటించిచూపాడు.

6. అర్చనం :- పూజాసక్తిని కలిగి భగవంతుని అర్చించడం అర్చనం. అన్నమయ్య –

"షోడశ కళానిధికి షోడశోపచారములు
జూడఁగాడ నిచ్చలును సమర్పయామి ॥ పల్లవి ॥

అలరు విశ్వాత్మకున కావాహన మిదె సర్వ-
నిలయున కాసనము నెమ్మి నిదె
అలగంగాజనకున కర్ఘ్య పాద్యాచమనాలు
జలధిశాయికిని మజ్జన మిదె ॥ షోడ ॥

వరపీతాంబరునకు వస్త్రాలంకారమిదె
సరిశ్రీమంతునకు భూషణము లివె
ధరణీధరునకు గంధపుష్ప ధూపములు
తిరమిదె కోటిసూర్యతేజునకు దీపము ॥ షోడ ॥

అమృతమథనునకు నదివో నైవేద్యము
గమిఁ జంద్రనేత్రునకుఁ గప్పురవిడెము
అమర శ్రీవేంకటాద్రి మీఁది దేవునికి
తమితోఁ బ్రదక్షిణాలు దండములు నివిగో" ॥ షోడ ॥

(సం.2 - కీ.134)

వంటి కీర్తనల్లో షోడశోపచారాలతో కూడిన అర్చనాన్ని గురించి చెప్పాడు.

**7. దాస్యం :-** భగవదాజ్ఞానువర్తిగా ఉండి భగవత్కైంకర్యానికే తన సర్వస్వాన్ని

సిద్ధంగా ఉంచి దాస్యం చెయ్యడం. అన్నమయ్య ఈ భక్తిమార్గాన్ని కూడా అనుసరించినట్లు —

"వేదు భయము మతికాదు భవము
ఆదియు నంత్యముఁ దెలిసిన హరియాజ్ఞే కాన ॥ పల్లవి ॥

తలఁపులు గడుగక వొడలటు దాఁగడిగిన నేమి
వెలుపలి కాంక్షలు వుడుగక విధులుడిగిన నేమి
అలరుచు శ్రీహరిదాస్యము ఆతుమఁ గలిగిన యాతఁడు
వెలఁగుచు పనులైనా సేసిన మరియేమి" ॥ వేదు ॥
(సం.౨ - కీ.౫౫)

"నీదాసమొక్కటె నిలిచె నమ్మగలది" (సం.౨ - కీ.౨౦)

వంటి కీర్తనలవల్ల తెలుస్తోంది. అదీగాక వైష్ణవంలో ఎక్కువగా దాస్యభక్తినే నమ్ముతారు. వైష్ణవులంతా 'దాసోహం' (నేనుదాసుణ్ణి) అనేమాటని తమకు పెద్దలదగ్గర కూడా వినయంగా ఉపయోగిస్తుంటారు. పరమాత్మకి తాము దాసులమనే భావంతోనే కైంకర్యాలు చేస్తుంటారు. కాబట్టే అన్నమయ్య కీర్తనల్లో కూడా ఈ దాసభావమే ఎక్కువగా కనిపిస్తుంది.

**8. సఖ్యం** :- నిస్వార్థంగా స్నేహం చెయ్యడం సఖ్యం. పరమాత్మని తన అనుగు చెలికాడుగా భావించి తనమంచినీ, చెడునీ మనసువిప్పి చెప్పుకునేంత

సన్నిహితుడైన స్నేహితునిగా శ్రీనివాసుని భావించి, అతనితోడి చెలిమిని అన్నమయ్య –

" పెంచఁ బెంచ మీఁదఁ బెరిగేటి చెలిమి
ఇంచుకంత లాలిముల కెడలేని చెలిమి ॥ పల్లవి ॥

అండుముట్టులేక మనసులందుకొన్న చెలిమి
కండఁగండు నవ్వించే ఘనమైన చెలిమి
వెండ వెండఁ దిరిగాడ వెట్టిగొన్న చెలిమి
యిండివారి చిత్తములకు నెడరైన చెలిమి ॥ పెంచ ॥

అంకురించినట్టి తలఁపులధికమయిన చెలిమి
లంకెలయిన యాసలెల్లా లావుకొన్న చెలిమి
వేంకటాద్రి విభునిఁ గూడి వేడుకయిన చెలిమి
పంకజాననలకెల్లఁ బాయరాని చెలిమి " ॥ పెంచ ॥

(సం.1 - కీ.29)

అని తలచి వేంకటేశ్వరుడు తనపైచూపించే నిజమైన సఖ్యతకే పొంగిపోయాడు.

**9. ఆత్మనివేదనం :-** స్వరక్షణభారాన్ని, సర్వస్వాన్ని భగవంతునికి సమర్పించి తనకు ఆ భగవంతుడొకడే అన్ని ఉపాయాలూ అని అనుకోవడం. అంటే తనకు సంబంధించిన సంబంధాలన్నీ అతడే అనిభావించి, అతనిపై సంపూర్ణవిశ్వాసముంచి

తననిపూర్తిగా స్వామికి సమర్పించుకోవడం ఆత్మనివేదనం. దీన్నే శరణాగతి అని అంటారు. అన్నమయ్య వేంకటేశ్వరుడే తన సర్వస్వంగా భావించినట్లు —

"సర్వోపాయముల జగతి నాకితఁడే
పూర్వధరుఁడు పురుషోత్తముండితఁడే || పల్లవి ||

సకలగంగాది తీర్థస్నానఫలము లివిస్వామి పుష్కరిణి జలమే నాకు
సకలపుణ్యక్షేత్రావాస యాత్రలివి సరి వేంకటాచల విహారమిదియే
సకల వేదాధ్యయన శాస్త్రపాఠంబులివి శౌరి సంకీర్తనం బిదియే నాకు
సకల కర్మానుష్ఠానముల యితని కిచ్చఁడఁ జొతుపడి కైంకర్యమిదియే" || సర్వో ||
(సం.2 - కీ.132)

అంటు అన్నమయ్య కీర్తనలనిబట్టి తెలుస్తోంది. శరణాగతికి, ప్రపత్తికి తెంగల వైష్ణవులు పెద్దగా భేదాన్ని అంగీకరించరు. కానీ వడగలవారు శరణాగతికి, ప్రపత్తికి భేదాన్ని పాటిస్తారు. అంతేకాక శరణాగతికన్నా ప్రపత్తే విశిష్టమైందిగా కూడా భావిస్తారు. అన్నమయ్య శరణాగతిని, ప్రపత్తిని చాలాకీర్తనల్లో చెప్పాడు.

శరణాగతి ఆరువిధాలని —

"ఆనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్యవర్జనం
రక్షిష్యతీతి విశ్వాసః గోప్తృత్వ వరణం తథా
ఆత్మ నిక్షేప కార్పణ్యే షడ్విధా శరణాగతిః" (సం.2 - పీఠిక - పుట.7)

అనే వచనంవల్ల తెలుస్తోంది. అవి –

<u>1. ఆనుకూల్యస్య సంకల్పం</u> :- "శ్రుతిః స్మృతిః మమైవాజ్ఞా అను భగవద్వచనానుసారము శ్రుతిస్మృతులలో చెప్పబడిన నిత్యనైమిత్తికములందు, భగవద్విషయమునందు మాత్రమే శ్రద్ధగలిగియుండునటుల సంకల్పించుకొనుట"[1] అన్నమయ్య –

"ఒడఁబరచు కొంటిని నృపేంద్ర నిన్నునిప్పుడె
చిడిముడి నీసేవకే సెలవు చేసుకొమ్మా ॥ పల్లవి ॥

కన్నుల నేఁ జూచేదెల్లా కమలాక్ష నీపాదాలే
విన్న వినుకులెల్లా విష్ణుఁడ నీకథలే
తిన్నని నామాటలెల్లా త్రివిక్రమ నీ మంత్రాలే
అన్నిటా నాభావము సమర్పణము నీకును ॥ ఒడ ॥

ఒట్టి నే నడచేవెల్లా వారినీ ప్రదక్షిణాలే
గుట్టున నాసేఁతలెల్లా గోవింద నీకైంకర్యాలే
ముట్టి నే భుజించినవి ముకుంద నీ ప్రసాదాలే
వెట్టిన నాభోగమెల్లా నీవసము చేసితి ॥ ఒడ ॥

---

1. అధ్యాత్మసంకీర్తనలు, సంపుటం-2, పీఠిక, పుట-7.

ఇల నేఁ బండఁబడేవి యీశ్వర నీకు మెక్కుతే
తలఁచే నాతలఁపెల్లా దామోదర నీధ్యానమె
నలువంక శ్రీవేంకటనాయక నీయనుజ్ఞను
నెలవై నాభవమెల్లా నీసొమ్ము చేసితి "  ॥ ౨౮॥

( సం. 2 , కీ. 201 )

అని తనకు సంబంధించిన నిత్యనైమిత్తికాలన్నిటిలోనూ వేంకటేశ్వరునికి సంబంధించిన విషయాలమీద మాత్రమే శ్రద్ధ ఉండేటట్లుగా ఏర్పాటుచేసుకున్నానని చెప్పుకున్నాడు. ఇటువంటి కీర్తనలనిబట్టి అన్నమయ్య ఆనుకూల్యసంకల్పం కలవాడని తెలుస్తోంది.

<u>౨. ప్రాతికూల్యవర్జనము</u> :- "భగవద్వ్యతిరిక్తము , భగవద్విరుద్ధములు అగు విషయములను పరిత్యజించుట " [1]

" వేఱొక భావనవేల వీనితోఁ బెనఁగనేల
తూఁటినందే వారిఁగూర్చి తుదగంటగాక  ॥ పల్లవి ॥

చూచేకన్నుల నేమీఁ జూడకుండ వచ్చునా
చూచినందెల్లా వారిఁజూచుట గాక
వేచిన వీనుల నేమీ వినకుండ వచ్చునా

1. తాళ్ళపాక అన్నమాచార్యుడు , అధ్యాత్మకీర్తనలు , సం-2 , పీఠిక , పుట-7.

కాదియవే హరికథగా వింటగాక ॥ వేఱాక ॥

కోరేటి చవ్వుల జిహ్వ సొరకుండవచ్చునా
కోరిన చవ్వుల హరిఁ గూర్చుడుగాక
ఆలీఁ బారే మనసు అడఁచఁగ వచ్చునా
ఆరితేరి అన్నిటాను హరిఁ గండుగాక " ॥ వేఱాక ॥

( సం. 2 - కీ. 123 )

వంటి కీర్తనలవల్ల అన్నమయ్య ప్రాతికూల్యవర్జనం చేసినట్లు తెలుస్తోంది. శ్రీ వెంకటేశునిదే ఈశరీరం, చిత్తం అని భావించి అతన్ని చూడనిదే ఉండలేని భావాన్ని అన్నమయ్య వ్యక్తపరిచాడు.

<u>3. రక్షిష్యతీతి విశ్వాసము</u> :- "భగవంతుడు తప్పకనన్ను రక్షించును, అను గాఢశ్రద్ధ."[1] అన్నమయ్య —

"నమ్మలేము కానలేము నరులాల మనమింతే
సమ్మతించి యేలేవాఁడు సర్వేశుఁడే సుండీ ॥ పల్లవి ॥

కంటికిఁ గంటి రెప్ప కాచుక వుండినయట్లు
వొంటి దేహమెల్లా జీవుడు కన్నట్లు
యింటుక దేవి నేహెద్దు అంతరాత్మయై వుండీ

1. తాళ్ళపాక అన్నమాచార్యుని అధ్యాత్మసంకీర్తనలు, సం. 2, పీఠిక, పుట - 7.

జండయై కాచుకున్నాడు సర్వేశుఁడె సుండీ " ॥ నమ్మ ॥

( సం.2 - కీ.96 )

వంటి కీర్తనల్లో వేంకటేశ్వరుడు రక్షిస్తాడనే భావాన్ని చాలా నమ్మకంగా వ్యక్తంచేశాడు.

<u>4. గోప్తృత్వ వరణము</u> :- "నీవు తప్పనాకు వేరురక్షకుడు లేడు అని, భగవంతునినే తనకు రక్షకుడుగా నిర్ణయించుకొనుట." [1]

"బాటఁజూట నీవారియేమాకును సకలక్రియలకు నాయకుడు

నాయకతుదనే యూతఁడుండఁగా నటగడ నెవ్వరి వెదకేము ॥ పల్లవి ॥

భూకాంతాపతి కింకరులము యీభూములిన్నియును మాసొమ్మే

పైకొని చక్రాయుధుఁడే మాదాపు భయము లిన్నిటాఁ బాసితిమి

యీకడ నచ్యుతమరఁగు చొచ్చితిమి యెన్నటికిని నాశములేదు

యేకాంతని ఇఁక నాసపడుచు నేమెవ్వంకి నోళ్ళుదెరచెదము " ॥ బాట ॥

( సం.3 - కీ.371 )

వంటి కీర్తనల్లో అన్నమయ్య వేంకటేశ్వరునే తనరక్షకుడుగా నిర్ణయించుకున్నట్లు కనిపిస్తుందనవచ్చు.

<u>5. ఆత్మనిక్షేపము</u> :- "తనకు సంబంధించిన సర్వభారమును (పోషణము,

---

1. తాళ్ళపాక అన్నమాచార్యుని అధ్యాత్మసంకీర్తనలు, సం.2, పీఠిక, పుట-7.

రక్షణము, ఆపదలనుండి కాపాడుట, పరమగతికి తీసికొనిపోవుట వగైరాలను) స్వామికే సమర్పించుట." [1] అన్నమయ్యరచించిన –

"సకలబలంబులు నీవే సర్వేశ్వర నాకు
అకలంకంబగు సుఖమే అన్నిటనిదె నాకు ॥ పల్లవి ॥

పొందుగఁ జక్రాంకితమే భుజబలమిదె నాకు
అందిన హరి నీ చింతే ఆత్మబలము నాకు
సందడిఁ బేరుబలము కేశవనామము నాకు
యిందును నందును భవభయమింక లేదిదె నాకు" ॥ సకల ॥

( సం.౨–కీ.౧౦౯ )

అనేకీర్తనలో అన్నమయ్య వేంకటేశ్వరునియెడ ఆత్మనిక్షేపం చేసినట్లుతెలుస్తుంది.

<u>౬. కార్పణ్యము</u> :– "నేను అకించనుడను, అన్యథాగతిలేనివాడను. నాకు నీవేదిక్కు. నన్ను తప్పక కాపాడవలెను – అని తనదీనత్వమునుచాటుకొనుట." [2]

"దీనుడనేను దేవుఁడవు నీవు
నీ నిజమహిమే నెరపుడ గాక ॥ పల్లవి ॥

---

1. తాళ్ళపాక అన్నమాచార్యుని అధ్యాత్మసంకీర్తనలు, సం.౨, పీఠిక, పుట - 8.
2. తాళ్ళపాక అన్నమాచార్యుని అధ్యాత్మసంకీర్తనలు, సం.౨, పీఠిక, పుట - 8.

మతి జనన మెఱఁగ మరణం బెఱఁగను
యితవుగ నినునేఁక నెఱఁగేనా
క్షితిఁ బుట్టించిన శ్రీపతివి నీవే
గతి నాపై దయ దలఁయువుగాకా ॥ దీనుఁడ ॥

తలఁచ బాపమని తలఁచఁ బుణ్యమని
తలఁపున నిఁక నినుఁ దలఁచేనా
అలరిన నాలో యంతర్యామివి
కలుషమెడయ ననుఁ గాయువుగాకా ॥ దీనుఁడ ॥

తడవ నావేయము తడవ నామలినము
తడయక నీమేలు దడవేనా
విడువలేని శ్రీవేంకటవిభుఁడవు
కడదాఁకా నేఁకఁ గాయువుగాకా " ॥ దీనుఁడ ॥

(సం.3 - కీ.474)

అనే కీర్తనలో అన్నమయ్య అల్పత్వాన్ని చెప్పుకుని వేంకటేశ్వరుని శరణువేడికాపాడమన్నాడు. ఇటువంటి కీర్తనలు అన్నమయ్య అధ్యాత్మకీర్తనల్లో ఎన్నోఉన్నాయి.

ఇటువంటి ఏదిక్కూ లేనివాడిని, దీనుడిని, నీవే నాకుదిక్కు - అనే భావాలతో శరణుకోరే శరణాగతుణ్ణి భగవంతుడుకూడా వీడు ఏదిక్కూ లేనివాడు, దీనుడు, నన్నే నమ్ముకుని ఉన్నవాడు, ఇతన్ని తప్పకుండా

రక్షించాలి - అని భావిస్తాడు. ఇటువంటి శరణాగతులయ్యే గజేంద్రుడు మోక్షాన్ని, ద్రౌపది మానసంరక్షణని పొందినట్లు పెద్దలు చెప్తారు. ఈ భాగవత భక్తి మార్గాన్ని నారదుడు హెచ్చుతగ్గులుగా చేసిచెప్పాడు. శ్రవణకీర్తనలు గుణమాహాత్మ్యాసక్తిఅనీ , పాదసేవ , వందనాలు రూపాసక్తి అనీ , స్మరణ, పూజ , దాస్య , సఖ్యాలు రెంటిలోనూ సమానమే అనీ చెప్పుకోవచ్చు. ఒక్క ఆత్మనివేదనే ఐదువిధాలు. ఈ ఐదువిధాలు పైన చెప్పబడ్డాయి. భగవంతుణ్ణి బిడ్డగా భావించి లాలించడం వాత్సల్యాసక్తి. అన్నమయ్య విష్ణ్వవతారాల్లో ఒకటైన కృష్ణావతారంలో బాల్యంలో కృష్ణుడుచేసిన పనులన్నిటిని వాత్సల్యం ఉట్టిపడే కీర్తనలుగా చెప్పాడు. తనే యశోదగామారి చిన్నికృష్ణునిదుండగాలని సహించలేక చెప్పి , మందలించమని సలహాయివ్వవచ్చిన గొల్లెతలకి కిందికీర్తనలో సమాధానం చెప్పాడు. చూడండి –

" కానరటే పెంచరటే కటకటా బిడ్డలను
నేను మీవలెనే కంట నెయ్యమైన బిడ్డను || పల్లవి ||

బాయిటఁ బారవేసిన పాలు వెన్నలను
చేయి వెట్టకుందురా చిన్నిబిడ్డలు
మీయిండ్ల జతనాలు మీరు సేసికొనక
పాయక దూరేరెలె ప్రతిలేని బిడ్డని || కాన ||
మూసినకాఁగుల నెయి ముంగిట పెరుగుటా
ఆసపడకుందురా ఆడేబిడ్డలు
వేసరియిటు మోసపోక వుండలేక మీరు

సేసేదింతేసి దూరు చెప్పరాని బిడ్డని ॥ కాన ॥

చాక్కమైన కొప్పెరల జున్నుల జున్నులను
చిక్కిన విడుతురా చిన్నిబిడ్డలు
మిక్కిలి పూజలుచేసి మెచ్చించఁదగదా
యెక్కువైన తిరువేంకటేశుడైన బిడ్డని ॥ కాన ॥

(సం.12 - కీ. 253)

పై కీర్తనలో అన్నమయ్యకు చిన్నికృష్ణునిపట్ల ఎంతవాత్సల్యంఉందో తెలుస్తుంది.

భగవంతునికి తనను భార్యగా భావించుకోవడం కాంతాసక్తి. గోపికలు పరబ్రహ్మ అయిన శ్రీకృష్ణుణ్ణి తమభర్తగా భావించి అనేక విధాలుగా ఆ జగదేకభర్తకి సేవలుచేశారు. అశాశ్వతమైన భౌతిక విషయాలని విడిచి బ్రహ్మానందాన్ని చేకూర్చే పరమాత్మమీదే మనసునిలిపి తన్మయత్వాన్ని పొందడం భక్తిలక్ష్యం. దీనికి కర్మ, జ్ఞానాలు అంగాలు. తపస్సు, ధ్యానం, యోగం మొదలైనమార్గాల్ని సనకసనందఅగస్త్యాదులు స్వీకరించారు. సంతతచింతన, సంకీర్తనామార్గాల్లో నారదగోపికాదులు పయనించారు. ఇందులో అన్నమయ్య సంతత చింతనామార్గాన్ని, సంకీర్తనామార్గాన్ని కూడా అవలంబించాడు. నారదునిలాగే అన్నమయ్య వేంకటేశ్వరుని కొన్నివేలకీర్తనల్లో సంకీర్తించాడు. గోపికలలాగా తాను నాయికగా, వేంకటేశ్వరుడు నాయకుడుగా భావించి అతనితో తన అలౌకిక ప్రణయాన్ని వర్ణించుకుని కీర్తనల్లో పొందుపరుచుకున్నాడు. వైష్ణవ సిద్ధాంతం ప్రకారం విష్ణువు ఒక్కడే లోకాలన్నిటికీ పురుషుడు. తక్కినవారంతా

స్త్రీప్రాయులు. ఈ అభిప్రాయంతోనే అన్నమయ్య శృంగార సంకీర్తనలు రచించాడు. పైగా విష్ణువు అలంకారప్రియుడు, శృంగారప్రియుడూను. అందుకే అన్నమయ్య నాయికగా తనని ఊహించుకుని నాయకుడైన శ్రీనివాసునితో తనను కరుణించమని వేడుకునే కీర్తనలు కొల్లలుగా రచించాడు. ఉదాహరణకి –

" గరిమతో నిన్నిటాఁగల నీకు
 వెరసిన నామీఁదఁ బ్రియమున్నదా ॥ పల్లవి ॥

తనురోమ రోమరంధ్రములను బ్రహ్మాండ
 జనన సంహార విచారములు
 మనసున నీకివి మంత్రములై నన్నుఁ
 గనుఁగొని కరుణించఁగలదా వేళ ॥ గరి ॥

కడలేని నీమేనఁ గలుగు దేవతలను
 బడిబడిఁ బలుమారుఁ బలికింపుదు
 విడువక నముఁగూడి వేంకటేశ్వరనెత్త
 మదరి యాడఁగ నీకు నదనున్నదా " ॥ గరి ॥

(సం.30 - కీ.27)

వంటి కీర్తనల్లో ఈ కాంతాసక్తి కనిపిస్తుంది.

ఇలాగే భగవద్విరహాన్ని సహించలేక నాయిక అయిన

తాను తపించడంకూడా అన్నమయ్య కీర్తనల్లో కనిపిస్తుంది. ఇదే నారదుడు చెప్పిన పరమ విరహాసక్తి.

"ఇదివో నీచిత్తము ఇకె భాగ్యము
కదలక యిందులోనె కనుకో నీవికను ॥ పల్లవి ॥

పున్నమ వెన్నెలలోనఁ బొద్దువోక జవరాలు
నిన్నుఁ దలఁచి రేయెల్లా నిద్దురవోదు
విన్నవించితిమి నీకు వేవేలకు నొక్కమాటె
యెన్నిక వెల్లా నీవె యెఱుఁగుదు వికను" ॥ ఇదివో ॥

(సం.25 - కీ.63)

అనె కీర్తనలో అన్నమయ్య నాయిక విరహాన్ని సహించలేనితనాన్ని చెలికత్తెలచేత వేంకటేశ్వరునికి చెప్పించాడు. ఇలా వేంకటేశునిపై విరహం చెందిన నాయిక అవస్థల్ని చెప్పే కీర్తనలు ఎన్నో అన్నమయ్యకీర్తనల్లో ఉన్నాయి.

ఆలంకారికమతంలో ఉన్న దాస్య, సఖ్య, వాత్సల్యాలకి పైనచెప్పిన లక్షణాలు వర్తిస్తాయి. కాంతాసక్తి, విరహాసక్తి కలిసి మధురభక్తి అవుతుంది. భగవంతుని ధ్యానిస్తూ అందులో నిమగ్నమవడం తన్మయాసక్తి. ఇదే శాంతభక్తి. అన్నమయ్య అనుక్షణమూ భగవంతుడైన వేంకటేశ్వరుని ధ్యానించబట్టే రోజుకి ఒకటికిపైగా సంకీర్తనలు ఆయన్ని కీర్తిస్తూ చెప్పగలిగాడు. నిరంతర ధ్యానం అనేది ధ్యానంచేసేవారి మనసుని, ధ్యానించేవస్తువుపట్ల

అవ్యాజమైన, పరమమైన ప్రేమతోనిండేటట్లు చేస్తుంది. కాబట్టే అన్నమయ్య వెంకటేశ్వరునిపై అంతభక్తి చూపగలిగాడు. ఈ భక్తిమార్గాలన్నిటినీ అనుసరించగలిగాడు. ఈవిషయం అతని కీర్తనల్నిబట్టి తెలుస్తోంది. ఉదాహరణకి—

" నీవారైన వారికి నీపై భక్తే కాక
భావించవేరక వట్టి భ్రమఁ బడవలెనా ॥ పల్లవి ॥

గురునాథి నీవ్యగలిగివుండగాను
తిరుమంత్రమే నాకు దిక్కయివుండగా
వరుస నాచార్యుడు వహించుక వుండఁగాను
పరగఁ దపము చేసి బడలఁగ వలెనా ॥ నీ ॥

కమలాక్ష నీముద్రలే కాచుక నాకుండఁగాను
అమరిదాస్యము కాణాచై వుండఁగా
తమితోడ వైష్ణవులు దాపుదండై వుండఁగాను
తెమలి తీర్థాలెల్లా ద్రిమ్మరించవలెనా ॥ నీ ॥

శ్రీవేంకటేశ్వర నీసేవే గతియై యుండగా
ఆవటించి మతికృపాయమై వుండఁగా
తాపులవే శరణవే ధర్మము రక్షించగాను
వేవేలు దానాలుచేసి వేఁడుకొనవలెనా" ॥ నీ ॥
(సం. 3 - కీ. 219)

ఈ కీర్తనలో తన్మయాసక్తి, దాస్యభక్తి, శరణాగతి మొదలైన భక్తిమార్గాలు చెప్పబడ్డాయి. అన్నమయ్య రచించిన ప్రతికీర్తనా ఏదో ఒక భక్తిమార్గాన్ని తెలుపుతూనే ఉంటుంది.

అన్నమయ్యకూడా కొన్నిభక్తిమార్గాల్ని చూపాడు.

అన్నమయ్య రచించిన —

" నానా భక్తులివి నరులమార్గములు
యే నెపాననైనా నాతఁడియ్యకొను భక్తి ॥ పల్లవి ॥

పాలికిఁగా వాదించుటది ఉన్మాదభక్తి
పరులఁ గొలువకుంటే పతివ్రతాభక్తి
ఇరసి యాత్మఁ గనుటదియె విజ్ఞానభక్తి
అరమరచి చొక్కితే ఆనందభక్తి ॥ నానా ॥

అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి
అతని దాసులసేవే అదియె తురీయభక్తి
క్షితి నొకపని గొంచెసుటో తామసభక్తి
అతడె గతని వుండుటది వైరాగ్యభక్తి ॥ నానా ॥

ఒట్టై స్వతంత్రుడైతే అది రాజసభక్తి

నెక్కిన శరణాగతే నిర్మలభక్తి
గక్కన శ్రీవేంకటేశు కైంకర్యమే సేసి
తక్కుముక్కులేనిదే తగ నిజభక్తి " ॥ నానా ॥

(సం.2 - కీ.469)

అనే కీర్తనలో ఉన్మాదభక్తి, పతివ్రతాభక్తి, విజ్ఞానభక్తి, ఆనందభక్తి, రాక్షసభక్తి, ఉభయభక్తి, తామసభక్తి, వైరాగ్యభక్తి, రాజసభక్తి, నిర్మలభక్తి అనే దశవిధ భక్తులు చెప్పాడు. ఈ భక్తులన్నిటికీ కూడా అన్నమయ్య తనకీర్తనల్ని ఉదాహరణలుగా చూపాడు. మోక్షమాశించే నరులకి ఈ భక్తిమార్గాలే నిజమార్గాలు.

భగవంతునిపట్ల భక్తిని చూపడంలో జాతి, విద్యా, సంపదలు అవసరం లేదు. భక్తికి భగవంతునిపట్ల ప్రేమే ప్రధానం.

రూపగోస్వామి భక్తిని మూడువిధాలుగా చెప్పాడు. అవి సాధనభక్తి, భావభక్తి, ప్రేమభక్తి. కర్మ, జ్ఞాన సహకృతమైన ప్రేమే ప్రధానమైన భక్తి. అదే రాగాత్మికభక్తి. ఈ భక్తిలో మూడు దశలున్నాయి. అవి సాధన, పరా, పరమాభక్తులు.

సాధనదశలో భక్తులు శమదమాదుల్ని అలవర్చుకుని తనని గురించిన, భగవంతుని గురించిన యథార్థజ్ఞానం సంపాదిస్తాడు. భగవత్కార్యాచరణలో మనసుని సమాయత్తపరుస్తాడు. శమదమాదులవల్ల మనసు పరిశుద్ధమై, నిరంతరం భగవద్ధ్యానంలో లగ్నమవడమే రెండోదశ.

అయిన పరాభక్తి. ఈ దశలో భగవంతున్ని అంతర్యామిగా భక్తుడు భావిస్తాడు. అన్నమయ్య వెంకటేశ్వరుని అంతర్యామిగా భావించి చెప్పిన కీర్తనలు –

"అంతర్యామీ అలసితి సొలసితి
ఇంతట నీ శరణిదే చొచ్చితిని" (సం.2 - కీ.475)

వంటివి అనేకం ఉన్నాయి. వీటిలో చాలామటుకు వెంకటేశ్వరుని శరణువేడిన ఘట్టాలే కనిపిస్తాయి.

మూడోదశలో పరమాభక్తిలో భగవంతుని విరహాన్ని సహించలేక భక్తుడు పిచ్చివాడవుతాడు. ఇతని సర్వకర్మలూ భగవత్పరాలు. ఇతని మనసు భగవన్మయం అవుతుంది. ఇతడు తన అల్పత్వాన్ని గ్రహించి, భగవత్కృపని కాంక్షించి, ఆత్మని భగవంతునికి సమర్పిస్తాడు. అన్నమయ్య ఈ స్థితికి చేరుకుని శ్రీవెంకటేశునికి తన అల్పత్వాన్ని తెలియజెప్పి ఆత్మసమర్పణచేసినవిషయం –

"ఎట్టువలసినాఁ జేయు మేటి విన్నపములిఁక
కట్టుకో పుణ్యమైనాఁగాక మరేమైనాను ॥ పల్లవి ॥
భావించ నీవేలికవు బంటుమాత్రమింతే నేను
నీవు సర్వాంతరాత్మవు నేనొకఁడను
సావధానమున నేను సర్వభక్షకుఁడ నింతే
శ్రీవెంకటేశ నీవు జీవరక్షకుడవు" (సం.3 - కీ.45)

అనే కీర్తనవల్ల తెలుస్తోంది. ఈశ్వరుని చేరడానికి ఆత్మార్పణతప్ప మరోమార్గంలేదు. ఈశ్వరునికి ఆత్మసమర్పణ చెయ్యడమే ప్రపత్తి అనబడుతుంది. భక్తుడు ప్రపన్నుడు కావడానికి ముందు భగవంతుని సర్వశక్తిమత్త్వంవంటి లక్షణాలు తెలిసిఉండాలి. తనని రక్షించేవాడు ఈశ్వరుడుతప్ప వేరొక శక్తిమంతుడు లేడనే దృఢవిశ్వాసం కావాలి. జీవుడికీ, ఈశ్వరుడికీ ఉండే సంబంధం విడదీయరానిది అని గ్రహించి, అతనిని ఆశ్రయించి "నీవేతప్ప నితఃపరంబెరుగ "ను అనే దశకి రావడమే పరమాభక్తి. ఇదే ప్రపత్తి. భక్తి చివరిదశ ఇదే. ఈవైష్ణవభక్తిమార్గ విశిష్టతని అన్నమయ్య –

"ప్రపన్నులకు నిది పరమాచారము
విపరీతాచారము విడువఁగవలయు ॥ పల్లవి ॥

భగవదపచారము భాగవతాపచారముఁ
దగులక దేవతాంతరము మాని
నగధరు శరణమునమ్మి యాచార్యుని
బగివాయనిదే పరమ వైష్ణవము ॥ ప్రప ॥

దురహంకారము దుఃఖము సుఖమును
జొరయక ప్రాకృతుల పొంతఁ బోవక
దరిశనాభిమానధర్మము వదలక
పరిశుద్ధిమండుటౌ పరమవైష్ణవము ॥ ప్రప ॥

ఉపాయాంతరము లొల్లక భక్తిచేపట్టి
యెప్పుడూఁ దీర్థప్రసాదేచ్ఛతోడ
నిప్పుడాత శ్రీవేంకటనిలయుఁడే గతియని
ప్రపత్తి గలుగుటే పరమవైష్ణవము ॥ ప్రప ॥

( సం.2 - కీ.317.)

అని చెప్పాడు. ఈరీతిగా అన్నమయ్య ప్రపత్తిని వివరించిచూపి, ప్రపత్తి కలిగి ఉండడమే పరమవైష్ణవమని చాటాడు. నిష్కామప్రేమ, భగవద్విశ్వాసం, ఆత్మసమర్పణ అనేవి ప్రపత్తికి ప్రధాన లక్షణాలు.

ఈ ప్రపన్నులు రెండు విధాలు. ఆర్తులు, తృప్తులు. భగవద్విరహాన్ని భరించలేక తక్షణం మోక్షాన్ని ఆశించేవారు ఆర్తప్రపన్నులు. భగవద్విరహాన్ని భరించగలవారు తృప్తప్రపన్నులు. వీరికి జన్మావసానంలో మోక్షం కలుగుతుంది. వీరికి మోక్షంకంటే భగవత్కైంకర్యమే ఇష్టం. భగవదానందం కోసమే కైంకర్యాల్ని చేస్తారు. వీరికి భగవన్ముఖోల్లాసమే ధ్యేయంగా ఉంటుంది. "ప్రపత్తిలోని తృప్తుడికి మూడు దశలుండును. లాభత్యాగ, భారత్యాగ, స్వరూప త్యాగములు."[1] తనకి కలిగిన ఆధ్యాత్మిక జ్ఞాన త్యాగమే లాభత్యాగదశ. నేను ప్రపత్తిని చేసేవాడిననే భావం లేకపోవడమే భారత్యాగదశ. నాకు అధికారి, రక్షకుడు, ఆశ్రయమైనవాడు అతడేనని పరమాత్మకి చేసే ఆత్మసమర్పణ స్వరూపత్యాగదశ. ఈ భక్తిభావాన్ని అన్నమయ్య —

---

1. డా॥ కిడాంబి నరసింహాచార్య, తిరునామములు - సమగ్రపరిశీలనము, పుట-65.

"నాపాలి ఘననిధానమవు నీవే నన్ను
నీపాల నిడుకొంట నీవే నీవే || పల్లవి ||

ఒలిసి నన్నేలె దేవుఁడవు నీవే, యెందుఁ
దొలఁగని నిజబంధుఁడవు నీవే
పలుసుఖమిచ్చే సంపదవు నీవే, యిట్టె
వెలయు నిన్నియును నీవే నీవే || నా ||

పొదిగి పాయని యాప్తుఁడవు నీవే, నాకు
వదవఁ దోడగు దైవమవు నీవే
మదము వాపెడి నామతియు నీవే, నాకు
వెదక నన్నియును నీవే నీవే || నా ||

యింకా లోకములకు నెప్పుడు నీవే, యీ
పంకజభవాది దేవపతివి నీవే
ఉంకివి వాపఁగ నంతకు నీవే, తిరు
వేంకటేశ్వరుఁడవు నీవే నీవే" || నా ||

(సం.1 - కీ. 108)

వంటి కీర్తనల్లో వెలిబుచ్చాడు. ఈ కీర్తనలో అన్నమయ్య తనజ్ఞానం, కర్తృత్వం, రక్షకత్వం - అన్నిటిని భగవంతుడైన శ్రీనివాసుడికి సమర్పించినట్లు వ్యక్తమౌతుంది.

త్రికరణాలైన మనసు, వాక్కు, శరీరాలచేత, త్రిగుణాలైన సత్త్వరజస్తమోగుణాలచేత ప్రపత్తి తొమ్మిదివిధాలు. సాష్టాంగ ప్రణామం, శంఖచక్రఊర్ధ్వపుండ్రధారణ మొదలైన చిహ్నాలు కలిగి ఆచార్యుని అధీనంలో ఉండేది కాయికప్రపత్తి. మంత్రార్థంతెలియక ఆచార్యుని అధీనంలో ఉండి మంత్రం ఉచ్ఛరించడం వాచికప్రపత్తి. కాయిక చిహ్నలతో మంత్రార్థం తెలుసుకొని భగవంతుని ఉపాసించడం మానసప్రపత్తి. వీటిలో రెండుప్రపత్తుల్ని అన్నమయ్య ఆచరించాడు. కాయికచిహ్నాలు పొందాక అన్నమయ్య ఎన్నో కీర్తనల్లో మంత్రార్థాన్ని వివరించాడు. ఆత్మప్రతికూల ఫలాన్ని కోరడం తామసప్రపత్తి. కోరికల్ని వదిలిపెట్టకుండా అవితీరేందుకు భగవంతుని శరణువేడడం రాజసప్రపత్తి. కోరికల్ని వదిలిపెట్టి భక్తితో పరమాత్మకి 'నేనుదాసుణ్ణి' అనే భావం కలిగి ఉండడం సాత్త్వికప్రపత్తి. ఇదే నిజమైన ప్రపత్తి. పతివ్రత అయిన స్త్రీ తనభర్తని తప్ప వేరొకని తలచనట్లు ప్రపన్నుడుకూడా ఏకధ్యానిగా పరమాత్మపట్ల మెలగాలి. అన్నమయ్య శుద్ధమైన సాత్త్విక ప్రపత్తిని తనకీర్తనల్లో చూపించాడు.

"నీదాసుడన నేట నిజబుద్ధి గలిగితే
ఆదెసనప్పుడే పుణ్యుడాయనతడు
వేడుకో నొక్కొక్కవేళ వెలుతురు గలిగితే
నీదయ వెట్టె వెనక నీవే తీరుతువు"

(సం.3-కీ.18)

అని నిజమైన ప్రపత్తిని వివరించాడు.

వైష్ణవంలో ప్రపన్నుడికి అతిముఖ్యమైంది ఆచార్యభక్తి. ఆచార్యానుగ్రహం పొందితే ఈశ్వరుడుకూడా అనుగ్రహిస్తాడు. ఈశ్వరుడుకూడా ఆచార్యకృపని ఆశిస్తాడు. మంత్రం, ఆమంత్రానికి చెందినదేవత, మంత్రాన్ని ఉపదేశించిన ఆచార్యుడు ముగ్గురూ ఒక్కటే. భగవంతుని నమ్మినట్లె సర్వమూ ఆచార్యుడేనని నమ్మవచ్చు. ముఖ్యంగా వైష్ణవ సంప్రదాయంలో ఈమతదీక్ష పుచ్చుకునేవారికి ఆచార్యులు పంచసంస్కారాలు చేస్తారు. ఈ పంచసంస్కారాల్ని అన్నమయ్య ఘనవిష్ణయతి చేత పొందాడు. అన్నమయ్య రచించిన -

"జ్ఞానయజ్ఞమీగతి మోక్షసాధనము
నానార్థములు నిన్నే నడపె మాగురుడు" (సం.2-కీ.148)

అనే కీర్తనవల్ల పంచసంస్కారాలు పొందినట్లు, గురుముఖంగా జ్ఞానం పొందినట్లు తెలుస్తుంది. ఇలాగే -

"చూడుడిందరికి సులభుడు హరి
తోడునీడయగు దొరముని యితడు ॥ పల్లవి ॥

కరుణానిధి రంగపతికిఁ గాంచీ
వరునకు వెంకటగిరిపతికి
నిరతి నహోబల నృకేసరికిఁ ద
త్పరుఁడగు శఠకోపముని యితడు" (సం.1-కీ.117)

అనే కీర్తనలో శఠకోపమునిని తన ఆచార్యుడిగానే కాక లోకాలన్నిటికీ సుజ్ఞానాన్ని పంచి ఇచ్చేవాడిగా కీర్తించి తన ఆచార్యభక్తిని చాటుకున్నాడు.

వైష్ణవభక్తుడికి పైనచెప్పిన వాటన్నిటికంటే భాగవతసేవ ప్రధానమైంది. శరణాగతిలో ప్రధానలక్షణం కార్పణ్యం. కార్పణ్యమంటే పెద్దలకి , విష్ణుభక్తులకి సేవచెయ్యడం. భగవంతునిపట్ల ఉండేవిధంగా భక్తులపట్లకూడా ప్రేమ అవసరం. భగవంతునికి , భక్తుడికి భేదం లేదుకాబట్టి భగవంతుడికి దగ్గరకావడానికి భగవద్భక్తులసేవే ప్రధానమార్గం. అన్నమయ్య అందుకే -

" సహజ వైష్ణవాచార వర్తనుల
సహవాసమె మా సంధ్య
పరమ భాగవత పదసేవనమె
సరవినెన్న మా సంధ్య " (సం.1 - కీ.10)

అన్నాడు. ఆళ్వారుల్లో ఒకరైన కులశేఖరాళ్వారు -

" మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే
- - - - - - - - - - -
త్వద్భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య

భృత్యస్య భృత్య ఇతిమాం స్మరలోకనాథ "[1] అని ముకుందమాలలో చెప్పుకున్నాడు. వైష్ణవభక్తిజాలంలో అతిముఖ్యమైన ఈ భావాన్ని అన్నమయ్యకూడా-

"అచ్యుత మిమ్ము దలచెయంత పని వలెనా
యిచ్చల మీవారేమాకు నిహపరాలియ్యగా ॥ పల్లవి.॥

అందినీకు భక్తులైన యల మహానుభావుల
చందపు వారిపై భక్తి చాలదా నాకు
కందువ శ్రీ వెంకటేశ కడు నీబంటు బంటుకు
సందడి బంటనవుటే చాలదా నాకు " (సం. 3 - కీ. 23)

వంటి కీర్తనలద్వారా ప్రకటించాడు. ఈ భావం అహంకారనివృత్తికి దోహదం చేస్తుంది.

అన్నమయ్య తాను రామానుజమతస్థుడినని బాహాటంగా చెప్పుకున్నాడు. ఆమతాన్ని సంపూర్ణంగా విశ్వసించి అవిష్ణువుని సర్వోత్కృష్టంగా సాధించాడు. పరమవిష్ణుభక్తుడైన ఇతడు విష్ణువుపట్ల పతివ్రతాభక్తిని చూపుతూ -

---

1. కులశేఖరాళ్వార్, ముకుందమాల, 28 వ శ్లోకం

" సులభపు మార్గము చుట్టరానె వుండఁగాను
బలు ప్రయాసపు కర్మబద్ధులైరి జీవులు ॥ పల్లవి ॥

శ్రీపతి భక్తియనెటి చింతామణియుండగాను
యేపున మోసపొయ్యేరు యేల జీవులు
దేవుని నామాంకితపు సిద్ధరసముగలిగి
కోపులనుడిగి పనిగొనరేల జీవులు ॥ సుల ॥

(సం.3 - కీ. 279)

అని వెంకటేశ్వరుని ఔన్నత్యాన్ని చాటిచెప్పాడు.

"విశిష్టాద్వైత మతదీక్ష లోకోత్తరమగు తపమేఅని అన్నమయ్య విశ్వాసము. ఇందుజ్ఞానము, సంకల్పము, ఆనందము, ఇంద్రియములు, నిర్మమకారము, ధర్మదేవత, శమదమాదులు, వెంకటేశ్వరుని ధ్యానము ఇవన్నియు యజ్ఞమునకు వలసిన సర్వాంగములుగా రూపింపబడి ఆయా వస్తువులకు తగిన క్రియలతో పరిపుష్టములై యజ్ఞపరిసమాప్తిలో జరుగు అవభృథస్నానము తీర్థముగా, స్వామికృప పరిపూర్ణజలధిగా పర్యవసించినది. ఇంతటి మహాయాగము జరిగి ఈయవభృథము ముగిసినవెనుక ఈయజ్ఞ ఫలముగా సిద్ధించునది శుద్ధకైవల్యమే. దానికై అన్నమయ్య అట్టియసాటి సంకీర్తనాత్మకమైన తపము చేసినాడు." [1]

---

1. అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు, సం.1, పుట - 26, 27.

ఇందుకు అన్నమయ్య రచించిన –

"అదిగాక నిజమతంబదిగాక యాజకం
బదిగాక వేదయసుఖమదిగాక పరము ॥ పల్లవి ॥

అమలమగు విజ్ఞానమను మహాధ్వరమునకు
నమరినది సంకల్పమను మహాపశువు
ప్రమదమను యూపగంబమున విశసింపించు
విమలెందు యాహుతుల వేల్పంగవలదా" ( సం.1 - కీ.40 )

అనే కీర్తన ఉదాహరణ. మోక్షసాధనమార్గాల్లో భక్తి అత్యంతోత్తమమైనది, సులభమైనది, నిరపాయమైనది, నిర్మలమైనది. అందులోనూ అద్వితీయానంద రూపమైన భక్తికి శిశువులు, పశువులు కూడావిని ఆనందించే సంగీతాన్నిజోడించి పరమాత్మని కీర్తించేందుకు సాహిత్యాన్ని సాధనంగాగొని ఆరాధిస్తే అంతకన్నా భగవత్ప్రీతికోసం చేసే మహోత్తర ప్రయత్నం వేరేదీఉండదు. వేదాల్లో సామవేద రూపం తానేనని శ్రీకృష్ణపరమాత్మ స్వయంగా చెప్పాడు. అన్నమయ్య తాను స్వీకరించి, నమ్మి, ఆదరించిన వైష్ణవాన్నికూడా అందులో ఇమిడ్చి వేంకటేశ్వరుని కొలిచాడు. ఏభక్తికైనా ఒకదేవతారూపం ఉండడంకద్దు. ఆదేవతామూర్తుల్నిబట్టి మానవులు మతాల్ని ఏర్పరచుకున్నారు. భారతదేశంలో ఉన్న మతాలన్నిటిలోకీ వైష్ణవానికి విశిష్టమైన స్థానంఉంది. వైష్ణవమతంలో విష్ణువుతప్ప మిగతా ప్రపంచమంతా అప్రధానమే. అన్నిటికన్నా హరిభక్తే మిన్న. పసిబిడ్డకి తల్లితప్ప

మిగతావారెవ్వరూ తెలియనట్లు వైష్ణవుడికికూడా విష్ణువుతప్ప వేరెవరూతెలియరు. ఇలాగే పసిబిడ్డని ఉయ్యాలలోపెట్టి తప్పనిసరై కూలికివెళ్ళిన పనిమనిషికి ధ్యాసఅంతా ఆబిడ్డమీదే ఉన్నట్లు భక్తుడి ధ్యాసఅంతా భగవంతుడి మీదేఉండాలి. ఇటువంటి భక్తిని కుదుర్చుకోవడానికి వైష్ణవంలో నియమించబడిన సాధనాలు పాటిస్తే ఒక్క వైష్ణవుడే కాదు , మొత్తం మానవుడనేవాడే సర్వోన్నతగుణాలతో శోభిల్లుతాడు. ఇటువంటి గుణాలుగల మానవుడు సగుణుడు, నిర్గుణుడు అయిన పరమాత్మని తదేకధ్యానంతో ధ్యానిస్తే, తన సర్వస్వమూ అయినదేభారం అని వదిలేసి, నిశ్చింతతో కొలిస్తే ఇటువంటిభక్తికి భగవంతుడు సంతోషించకుండా ఉండడు. మోక్షం ఇవ్వకుండా ఉండడు.

"వలెనను వారిదెవైష్ణవము ఇది
వలపు దేనెవో వైష్ణవము" (సం.1 - కీ.405)

అనే కీర్తనలో వైష్ణవాన్ని గురించి ఉన్నతమైన భావాలు కలిగివుండాలంటాడు.

"సులభమా మనుజులకు హరిభక్తి
వలనొంది మరికదా వైష్ణవుడౌట" (సం.1 - కీ.144)

అని వైష్ణవుడవడం అంతసులభం కాదంటాడు.

"మదమత్సరము లేక మనసు పేదైతే
పదరిన యాసలవాడు వైష్ణవుడు" (సం.1 - కీ.59)

అని కొన్ని నిర్దిష్టలక్షణాలు వైష్ణవుడికి ఉండాలంటాడు. తానూహించిన ఉన్నతమైన వైష్ణవలక్షణాల్ని తానూ ఆచరించాడు. ఆచార్యముఖంగా వచ్చిన వైష్ణవభక్తి , జన్మసిద్ధంగావచ్చి సర్వోత్కృష్టంగా సాధింపబడినభక్తి , రెండూ కలిసి అన్నమయ్యకి వెంకటేశ్వరునిపై అవ్యాజమైన ప్రేమ (భక్తి) కలిగేటట్టు చేశాయి. ఆవైష్ణవభక్తి భావాలు ఇనుమడించిన అన్నమయ్య శ్రీనివాసునితో —

"ఇహమే కాని యిక పరమే కాని
బహుళమై హరినిపై భక్తే చాలు" (సం. 2 - కీ. 131)

అన్నాడు.

ఈవిధంగా మానవుని మహోన్నత గుణశోభితునిగా తీర్చిదిద్దే వైష్ణవభక్తితత్వాన్ని అన్నమయ్య తనకీర్తనల్లో ఇమడ్చి ప్రజల్లోకూడా వైష్ణవభక్తిభావాలు రేకెత్తేలా చేశాడు. ఆచార్యుడైన అన్నమయ్య వైష్ణవాన్ని వెంకటేశ్వరుని దర్శించడానికి , చేరుకోవడానికి ఒకమార్గంగా ఎంచుకున్నాడు. ఉత్కృష్టమైన వైష్ణవభక్తిమార్గాలు తనకీర్తనల్లో చూపుతూ పండితపామరులిరువురూ మెచ్చేవిధంగా శ్రీనివాసుని కీర్తించాడు. ఈవైష్ణవభక్తి భావ కుసుమాలు ఒక్క అన్నమయ్యకే కాక ప్రతిప్రపన్నునికీ పరమాత్మని పూజించడానికి ఉపకరించే కుసుమాలే.

మూడో ప్రకరణం

# అన్నమయ్య సంకీర్తనల్లో వైష్ణవ పూజావిధానం

# అన్నమయ్య సంకీర్తనల్లో వైష్ణవ పూజావిధానం

వేదకాలంనుంచి ప్రచారంలో ఉన్న హిందూమతంనుంచి పుట్టిన వైష్ణవమతంలో ప్రతిమతంలోనూ ఉన్నట్టే పూజాదికాలు ఉన్నాయి. విష్ణువుకి సంబంధించింది వైష్ణవంకాబట్టి వైష్ణవులు విష్ణువుని పూజిస్తారు.

విశ్వాన్నిరక్షించడం , పోషించడం విష్ణువుకర్తవ్యాలు. ఔదార్యం , సౌహార్దం , కారుణ్యం , వాత్సల్యం , మార్దవంవంటి కళ్యాణగుణనిధియై , నారాయణుడై విష్ణువు సర్వదా ప్రపన్నులని రక్షించడానికి బద్ధకంకణుడై ఉంటాడు. అటువంటి నారాయణుని అనుగ్రహంకోసం ప్రపన్నులు అర్చనావిధానాన్ని చేపట్టాలి. అంటే అర్చనచెయ్యాలి.

"నారాయణార్చన అంటే శ్రీ దేవా లక్ష్మీయుతుడు అయిన నారాయణుని అర్చించడమే కాని నారాయణుని దేవా లక్ష్మిని వేర్వేరుగా అర్చించడం కాదు. నారాయణునకు (ప్రణవంలోని అ), భక్తునకు (ప్రణవంలోని మ) మధ్య ఉన్నది లక్ష్మి. ఈ లక్ష్మి నారాయణుని చేరుకోవటానికి భక్తునకు తోడ్పడుతుంది. నారాయణుని అనుకంపను భక్తునిపై వర్షింపజేస్తుంది." [1] (ప్రణవం అంటే ఓంకారం. అ+ఉ+మ = ఓం)

వైష్ణవుడనేవాడు మనోవాక్కాయకర్మలచేత దేవతాంతర సంబంధంవదిలి విష్ణుభక్తుడై, పరబ్రహ్మస్వరూపం నారాయణుడేనని విశ్వసించాలి. వైష్ణవ సిద్ధాంతంలో సాక్షాత్తూ పరబ్రహ్మస్వరూపం నారాయణుడేనని, మిగిలిన బ్రహ్మరుద్రేంద్రాదులు అతని శరీరభూతులనీ, ఆయనికి శేషభూతులనీ నిరూపించబడింది. అటువంటి సకలఫలప్రదుడైన విష్ణువునే వైష్ణవులు పూజిస్తారు.

దైవపూజ మూడువిధాలు. 1. మానసీపూజ 2. హోమపూజ 3. బేరపూజ.

**<u>1. మానసీపూజ</u> :-** ధ్యానం చెయ్యడంద్వారా ప్రపన్నుడు తనహృదయాన్ని

---

1. వైఖానసాగమము, ఆంగ్లం - ఆచార్య యస్.కె.రామచంద్రరావు
   తెలుగు అనువాదం - ఆచార్యపోణంగి అప్పారావు, పుట-113

మూర్తిమంతం చేసుకుని , పూజాదికాలు చేస్తున్నట్లు ఊహించడం లేదా మనసులోనే పూజాదికాలు నిర్వర్తించడం.

2. హోమపూజ :- జ్వలించేఅగ్నిలో భగవంతుని మూర్తిని నిల్పించుకుని పూజించడం. అంటే భగవంతుని తేజోమయునిగా ఆరాధించడం.

3. బేరపూజ :- విగ్రహానికి పూజచెయ్యడం. బేరం అంటే ప్రతిమ. చక్కగా ప్రతిష్ఠింపబడిన ప్రతిమకి పూజచెయ్యడం.

ఈమూడు విధానాలలోనూ బేరపూజే ఉత్తమమైనదిగా పరిగణింపబడుతోంది. ఆకర్షణీయంగా , అందంగాఉన్న విగ్రహం మనోల్లాసాన్ని కలిగిస్తుంది. అప్పుడు భక్తికి లక్ష్యం విగ్రహంలోఉండే మూర్తి అవుతుంది. ఏకాగ్రత కుదురుతుంది. కనుక ఈబేరపూజే అన్నిపూజలలోకీ ఉత్తమమైనది.

పరమాత్మ నిష్కలుడు. అలాగే సకలుడూను. కాబట్టి పరమాత్మని అర్చించే విధానాలుకూడా రెండు అవుతాయి. నిష్కలుడు , నిరాకారుడు అయిన పరమాత్మని అర్చించడం నిరాలంబార్చన అవుతుంది. దీన్నే అమూర్తార్చన అంటారు. పైనచెప్పిన పూజావిధానాలలో మానసీ, హోమపూజలు ఈవిధానానికి చెందుతాయి. సకలుడు , సాకారుడు అయిన పరమాత్మని అర్చించడాన్ని సాలంబార్చన లేదా సమూర్తార్చన అంటారు. ప్రతిమని ఆరాధించడం (బేరపూజ) ఈ విధానానికి చెందుతుంది. ఈరెండు విధానాలనే "పురందరోపనిషత్" లో —

"భగవంతుని ఆరాధన రెండువిధాలు. బాహ్యపూజ, ఆంతరికపూజ. నానాక్షేత్రాలలో ఉన్న విగ్రహాలలో సాలగ్రామాలలో భగవంతుని ఊహించి ఆరాధించడం బాహ్యారాధన. మానసికరూపమైన పూజలోక ఆంతరిక ఆరాధన"[1] అని చెప్పబడింది. బాహ్యారాధనే బేరపూజ లేదా సమూర్తార్చన, ఆంతరిక ఆరాధనే అమూర్తార్చన.

అమూర్తార్చన సంకల్పసిద్ధులకి, వానప్రస్థాది ఆశ్రమవాసులకి తగినది. ఇక సమూర్తార్చన సంసారనిష్ఠులకి తగినది. సమూర్తార్చన రెండువిధాలు. గృహార్చన, దేవాలయార్చన. గృహార్చనకంటె ఆలయార్చనే ప్రాధాన్యం పొందింది. దేవాలయాల్లో విష్ణుపూజ క్రీ.శ. 2వశతాబ్ది నుంచేఉందని వైఖానసాగమంలో చెప్పబడింది.

"విష్ణువు ఐదురూపాలలో అభివ్యక్తమౌతాడని, అవతారం వాటిలో ఒకటని వైష్ణవమతం బోధిస్తుంది. ఈ ఐదురూపాలలో మొదటిది పరవాసుదేవరూపం. అదిమానవుల ఊహకు అతీతమైనది. సృష్టి, స్థితి సంహారకార్యసాధనకు ఏర్పడినది వ్యూహరూపం. ధరాధామంపై ప్రాకృతదేహంతో దిగివచ్చేరూపాన్ని 'విభవం' అంటారు. ఇక 'అంతర్యామి' రూపంలో ఆయన జీవుల హృదయాంతర్వర్తియై వారిభావాలను పరిభ్రమింపచేస్తూఉంటాడు. ఇంకచివరిది

---

1. పురందరోపనిషత్తు - కన్నడ వ్యాఖ్యానం - బన్నుంజె గోవిందాచార్య
తెలుగు అనువాదం - వక్కంతం సూర్యనారాయణరావ్, పుట - 107.

అర్చారూపం. దేవాలయాలలోనూ, భక్తుల నివాసాలలోనూ విగ్రహాదిరూపంలో ఉంటూ వారిపూజలను అందుకొంటూఉంటారు." 1

పంచసంస్కారాలు పొందినతర్వాత విష్ణ్వర్చకుడు దేవాలయానికివెళ్ళి అర్చించాలని పరాసంహితలో చెప్పబడింది. దేవతాప్రతిష్ఠితాలు, సిద్ధప్రతిష్ఠితాలు, మానుషప్రతిష్ఠితాలు, స్వయంవ్యక్తాలు అయిన భగవద్విగ్రహాల్లో శ్రియఃపతిని చూసుకుని కేశవాదినామాలతో అర్చించాలి. ఇలా అర్చించేవారు పాంచరాత్రవైఖానసులు. వీరు నిర్వికారంతో, నిరహంకారంతో, కైంకర్యపూతమైన మనసుతో భగవంతుని అర్చించాలి. అలాకాకుండా మోహంతోగాని, ద్రవ్యాశతోగాని, మోక్షంకోరిగాని లేదా ఇతరవాంఛలు తీరడానికిగాని భగవంతుని అర్చించకూడదు. అలాంటి అర్చన వేదమంత్రాలతో కూడినదైనా భగవంతునికి ప్రీతినికూర్చదు. అలాంటి అర్చనచేసేవాడు భండారుడవుతాడు. అతడినే వైష్ణవపరిభాషలో దేవలకుడంటారు. అతడి ఆయువు, సమస్తసంపదలూ నశిస్తాయి. ఇలాకాక కేవలం భగవత్తీర్థ ప్రసాదలనే ఆశించి భగవత్ప్రీతికోసం మాత్రమే భగవదారాధన చేసేవారిలో దేవలకత్వం ఉండదు.

పరదేవతారాధన రెండువిధాలు. 1. సద్వారకారాధన 2. అద్వారకారాధన. పరమాత్మని దేవతాంతర శరీరకునిగా ఆరాధించడం సద్వారకారాధన. సాక్షాత్తు పరబ్రహ్మనే ఆరాధించడం అద్వారకారాధన.

---

1. అడపారామకృష్ణారావు, అన్నమాచార్యులు, పుట - 15.

వేదం పూర్వ , ఉత్తరభాగాలుగా ఉంది. పూర్వభాగం జగచ్ఛరీరి అయిన పరమాత్మకి చేసే సద్వారకారాధనని చెప్తుంది. ఉత్తరభాగం సాక్షాత్తూ పరమాత్మ స్వరూపగుణవిభూతుల్ని విశదపర్చి ఆపరమాత్మని అద్వారకంగా పూజించేవిధానం చెబుతుంది.

పరమాత్మని పూజించేవారికి చిదచిదీశ్వరుల తత్త్వాల యథార్థజ్ఞానం ఉండాలని విశిష్టధర్మశాస్త్రం చెబుతోంది. భగవంతుని పూజించే వైష్ణవుడు తెల్లవారుఝామునే నిద్రలేచి , కాలకృత్యాలు తీర్చుకుని , ఆచమనంచేసి , నియమంతో దేహాత్మలకంటే భిన్నుడై , పరమాత్మస్వరూపాన్ని ధ్యానిస్తూ , తనదేహంపట్ల విరక్తిభావంకలిగి , దేహసంబంధం తీరడానికి విష్ణువుని ధ్యానించి, సహస్రనామాలతో స్తోత్రంచెయ్యాలి. తనగురువులకి భక్తిపూర్వకంగా నమస్కరించి పరమాత్మనిపూజించడం మొదలుపెట్టాలి.

ముముక్షువులైన వైష్ణవులు తమతమఇళ్ళలో ప్రత్యేకంగా విష్ణువిగ్రహాలని నిలుపుకుని నిత్యమూ తమ నిత్యనైమిత్తికకర్మల్ని ఆచరించి తర్వాత పూజించాలి. తామఆరాధించే గృహార్చబింబాన్ని (గృహంలో ఆరాధించే విష్ణువిగ్రహం) పంచగవ్యంతోనూ , మంత్రపూతజలంతోనూ అభిషేకించాలి. తర్వాత మూలమంత్రంతో ఆవాహనం మొదలైన ఉపచారాల్ని చెయ్యాలి.

" యథాశక్తిగా సంపాదించిన ఉపచారద్రవ్యాలతో

చేయవలసిన పూజను మూడువిధాలుగా విభజించవచ్చు. 1. ద్రవ్యప్రతీకపూజ 2. భూప్రతీకపూజ 3. మానసప్రతీకపూజ."[1] కర్ణతంత్రగ్రంథం ఈత్రివిధ పూజలనూ "ద్రవ్యలింగం శిలాద్యం స్యాత్, ఆత్మలింగం మనోమయం, అథవా స్థండిలం చైవ, విష్ణోర్లింగం ప్రకీర్తితం" అని స్పష్టంగా వివరిస్తోందని పురందరోపనిషత్‌లో చెప్పబడింది. శిల, లోహాదుల ప్రతిమలు ద్రవ్యప్రతీకలు. నేలపైన వ్రాయబడిన మండల స్థండిలాదులు భూప్రతీకలు. మనోమయరూపమే ఆత్మప్రతీక లేదా మానసప్రతీక.

"ఆరాధన ప్రతిమలు ఎనిమిదివిధాలు అని పరిగణించడంకూడా ఉంది. శైలీదారుమయీ లౌహీ, లేప్యా లేఖ్యా చ సైకతీ మనోమయీ మణిమయీ, ప్రతిమాஉష్టవిధా స్మృతా. శిలావిగ్రహం, దారువిగ్రహం, పంచలోహవిగ్రహం, వర్ణచిత్రం, రేఖలతో రూపొందించిన మండలాలూ, రంగవల్లులూ, మట్టివిగ్రహం, నవరత్నాలతో చేసినవిగ్రహం - ఇవి సప్తబాహ్యప్రతీకలు. మానసిక ప్రతీక ఎనిమిదవది."[2]

భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, సూర్యుడు, బ్రాహ్మణుడు, వైష్ణవుడు, గోవులు, సర్వభూతాలూ, ఆత్మ -

---

1. పురందరోపనిషత్, కన్నడవ్యాఖ్యానం - బన్నంజె గోవిందాచార్య
తెలుగు అనువాదం - వక్కంతం సూర్యనారాయణరావ్, పుట - 111.

2. " " " పుట - 110.

ఇవి పదకొండూ భగవంతుని ఆరాధనకి అధిష్ఠానాలు" [1]

వైష్ణవులైన వైఖానస, పాంచరాత్రులిరువురూ కొద్దిపాటి తేడాలతో విష్ణువుని అర్చిస్తూఉంటారు.

"ఎండగాని నీడగాని ఏమైనాగాని
కొండలరాయడే మాకులదైవము" (సం.1 - కీ.214)

అనిచాటిచెప్పే వైష్ణవసిద్ధాంతాల్ని అధ్యయనంచేసి, ఆచరించి, ప్రచారంచేసిన అన్నమయ్య తానునమ్మిన దేవుడైన వేంకటేశ్వరుని అర్చించేవాడని అతని -

"ఇందిరారమణుని తెచ్చియియ్యరో మాకిటువలె
పొందియీతని పూజింప పొద్దాయనిపుడు" [2]

అనేకీర్తనని బట్టి తెలుస్తోంది. ఆయన వేంకటేశ్వరునికి షోడశోపచారాలు చేసేవాడు. తిరువారాధనలో ఈ షోడశోపచారాలు ముఖ్యమైన ఉపచారాలు. అన్నమయ్య వేంకటేశ్వరునికి షోడశోపచారాలు చేసేవాడని -

---

1. పురందరోపనిషత్, కన్నడవ్యాఖ్యానం - బన్నంజె గోవిందాచార్య
తెలుగు అనువాదం - వక్కలంక సూర్యనారాయణరావ్, పుట-110.

2. ఆదపారామకృష్ణారావు, అన్నమాచార్యులు, పుట - 47.

"షోడశకళానిధికి షోడశోపచారము
జాడతోడ నిచ్చలను సమర్పయామి ॥ పల్లవి ॥

అలరు విశ్వాత్మకునకావాహనమిదె సర్వ
నిలయునకాసనము నెమ్మినిదె
అలగంగా జనకునకర్ఘ్య పాద్యాచమనాలు
జలధిశాయికిని మజ్జనమిదె ॥ షోడ ॥

వరపీతాంబరునకు వస్త్రాలంకారమిదె
సరి శ్రీమంతునకు భూషణములివె
ధరణీధరునకు గంధపుష్పధూపములు
తిరమిదె కోటిసూర్య తేజునకు దీపము ॥ షోడ ॥

అమృత మథనునకు నదివో నైవేద్యము
గమిఁ జంద్రనేత్రునకుఁ గప్పురవిడెము
అమరిన శ్రీవేంకటాద్రి మీఁది దేవునికి
తమితోఁ ప్రదక్షిణాలు దండములు నివిగో" ॥ షోడ ॥

(సం.2 - కీ. 134)

అనే అన్నమయ్య కీర్తన తెలుపుతోంది. ఈ కీర్తనలో ఒక్క కర్పూరనీరాజనం ఇవ్వడం తప్ప మిగిలిన అన్ని ఉపచారాలూ ఉన్నాయి. ఆవాహనచెయ్యడం, ఆసనమియ్యడం, భూషణాలు ధరింపజేయడం, గంధపుష్పధూపాల్ని

సమర్పించడం, నైవేద్యం పెట్టడం, కప్పురప్పు విడెమియ్యడం, ప్రదక్షిణ నమస్కారాలు చెయ్యడమనే ఉపచారాలు అన్నమయ్య స్వామికి చేసినట్లుగా ఈ కీర్తన చెప్తుంది. ఈ కీర్తనలో చెప్పని నీరాజనమనే ఉపచారాన్ని అన్నమయ్య ప్రత్యేకించి కొన్ని కీర్తనల్లో చెప్పాడు. చూడండి -

" క్షీరాబ్ధి కన్యకకు శ్రీమహాలక్ష్మికిని
నీరజాలయమునకు నీరాజనం

సగడు వెంకటేశు పట్టపురాణియై
నెగడు సతికళలకును నీరాజనం
జగతి నలమేల్మంగ జక్కదనములకెల్ల
నిగుడు నిజ శోభనపు నీరాజనం. "[1] అని

" మరలిమరలి జయమంగళము
సొరిది నిచ్చలును శుభమంగళము

కమలారమణికిఁ గమలాక్షునకును
మమతల జయజయ మంగళము
అమరజననికిని అమరవంద్యునకు

---

1. ముత్యాశ్యామసుందరి, అన్నమాచార్యుని మధురకీర్తనలు, సమీకరణ, పుట-63.

"సుమూహూర్తముతో శుభమంగళము" (సం.1 - కీ.448)

అన్నమయ్య వెంకటేశ్వరునికి మేల్కొలుపులు పాడాడు.

నిద్రిస్తున్న పరమాత్మని అన్నమయ్య -

"మేదిని జీవులఁ గావ మేలుకోవయ్యా
నీదయే మాకెల్ల రక్ష నిద్ర మేలుకోవయ్యా || పల్లవి ||

తగు గోపికల కన్నుఁదామరలు వికసించె
మిగుల సూర్యనేత్రుఁడ మేలుకోవయ్యా
తెగువ రాక్షసులనే తిమిరము విరియఁగ
నెగడిన పరంజ్యోతి నిద్ర మేలుకోవయ్యా || మేది ||

ఘనదురితపు నల్లఁ గలువలు వికసించె
మినుకు శశివర్ణుఁడ మేలుకోవయ్యా
పనివడి వేదాలనే పక్షులెల్లఁ బలుకఁగ
జనకయాశ్రిత పారిజాత మేలుకోవయ్యా || మేది ||

వరలక్ష్మీ కుచచక్రవాకము రొండొంటిరాయ
మెరయుతేజోరవిత మేలుకోవయ్యా
పొరని నీవు నిత్యభోగములు భోగించ

నిరతి శ్రీవేంకటేశ నేఁడు మేలుకోవయ్యా"  ॥ మేది ॥

(సం॰ 1 - కీ॰ 377)

అని మేల్కొలిపినట్టున్న కీర్తనలు ఇందుకు ఉదాహరణలు.

సాయంకాలం కూడా షోడశోపచారాలు చేశాక,

అన్నమయ్య స్వామికి పవళింపుసేవలు చేసినట్లుగా -

"నిద్దిరించె పాల (చేఁబాల ?) జలనిధి వలెనే
వద్దిక శ్రీరమణునికి వత్తరే పాదములు  ॥ పల్లవి ॥

వేగుదాఁకాఁ జిత్తగించె విద్యలెల్ల నాదరించె
బాగుగాఁ గృపారసము పంచె పంచె
యేగతిఁ బవ్వళించెనో యెట్లు భోగించెనో
యోగీంద్రవరదుని వూఁచరే వుయ్యాలను  ॥ నిద్ది ॥

వాలుఁగన్నుల రెప్పల వడదాఁకి తనుతావి
బాలకొన్న వుర్పులు చల్లి చల్లి
నీలవర్ణపు గుణము నెరపుచు నొకయింత
కాలము గమ్ములఁ దిప్పిక (ప్పేఁగ ?) ప్పరే దోమతెర  ॥ నిద్ది ॥

సరుగున యోగనిద్ర చాలించె లోకమెల్లఁ

గరుణించఁ దలఁచి వేంకటగిరిపై
తిరుదుగ సకలలోకారాధ్యుఁడయి మించి (చే?)
విరివి నాలవట్టాయి విసరరే సతులు ." ॥ నిద్ది ॥

(సం.12 - కీ. 343)

వంటి కీర్తనలు చెప్తున్నాయి. నిద్రించిన స్వామిని ఉయ్యాలలూపే కీర్తనలు అన్నమయ్య ఎక్కువగానే రచించాడు. ఈ ఉయ్యాలసేవ గురించి అన్నమయ్య కీర్తనల్లో ఉదాహరణకి ఒకటి చూడండి -

" ఉయ్యాలా బాలు నూఁచెదరు కడు
నొయ్య నొయ్య నొయ్యనుచు ॥ పల్లవి ॥

బాలయవ్వనలు పసిఁడి వుయ్యాల
బాలుని వద్దఁ బాడేరు
లాలి లాలి లాలి లాలెమ్మ యెల్ల
లాలి లాలి లాలి లాలనుచు " ॥ ఉయ్యా ॥

(సం.12 - కీ. 246)

అన్నమయ్య షోడశోపచారాల్ని గూర్చి చెప్పిన కీర్తనలు అతని రచనల్లో ఎక్కువగానే ఉన్నాయి. అధ్యాత్మ కీర్తనల్లోనే కాక శృంగార కీర్తనల్లో కూడా -

" ప్రతిలేని పూజ దలఁపఁగఁ గోటిమణుఁగువై
అతివ పరవశము కృష్ణానందమాయ " (సం.12 - కీ. 301)

అని నాయిక నాయకుడికి ప్రతిరోని పూజచేసిందని చెప్పిన కీర్తనలో నాయికమనసే ఆసనంగాను, ఆనందబాష్పాలు అర్ఘ్యాదులుగాను, కనుదోయి దీపాలుగాను, అననసుధారసం అభిషేకంగాను, చిరునవ్వులు పుష్పాలుగాను, మేనితావి చందనంగాను, తనువుకాంతి నీరాజనంగాను, జగడపు డుటుక ఉపచారాలుగాను, నైవేద్యంగాను, వేడుకలు తాంబూలంగాను చెప్పబడ్డాయి.

అన్నమయ్య తన తిరువారాధనని గురించి స్వామికి –

"నేనెమెరిగి సేసేనే నీకు దిరువారాధన
అనిముస్నిటి బ్రహ్మరుద్రాదులు సేయగలేరు" (సం.2 - కీ. 373)

అనే కీర్తనలో స్వామి సర్వాంతర్యామిత్వాన్ని, తన తిరువారాధన అల్పత్వాన్ని చెప్పుకున్నాడు. ఈయన సమూర్తార్చన చేశాడు.

అయితే అన్నమయ్య కీర్తనల్లో మానసపూజని తెలిపే కీర్తనలున్నాయి. ఉదాహరణకి –

"నిత్యపూజలివివో నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి ॥ పల్లవి ॥

తనువే గుడియట తలయే శిఖరమట

పెనుహృదయమే హరిపీఠమట
కనుఁగొన చూపులే ఘనదీపములట
తనలోపలి యంతర్యామికిని ॥ నిత్య ॥

పలికే మంత్రమట పాడైన నాలికే
కలకలమనుపిడి ఘంటయట
నలుపైన రుచులే నైవేద్యములట
తలఁపులోపల నున్న దైవమునకు ॥ నిత్య ॥

గమన చేష్టలే యంగరంగ గతియట
తమిగల జీవుడే దాసుఁడట
అమరిన వూర్పులే యాలవట్టములట
క్రమముతో శ్రీవేంకటరాయనికిని ॥ నిత్య ॥

(సం.2 - కీ.82)

అని దేహమే దేవళంగాను, తల శిఖరంగాను, హృదయం పీఠంగాను, తన కనుచూపులే దీపాలుగాను భావించి, స్వామికి తనపలుకులే మంత్రాలుగా విన్నవించాడు. తన నాలుకనే గంటగా భావించాడు రుచులే నైవేద్యాలుగా తన తలపులోనున్న దైవమైన వెంకటేశ్వరస్వామికి సమర్పించాడు. ఈవిధంగా అన్నమయ్య మానసిక పూజ చేశాడు.

ఈ మానసికపూజని ప్రస్తావిస్తూ అన్నమయ్య —

"ఇంతకంటె నేమి సేసేమిదె మా మానసపూజ
సంతతము నీవు తొల్లె సర్వసంపన్నుఁడవు ॥ పల్లవి ॥

అంతర్యామివైన మీకు నావాహన మదివో
అంతటా విష్ణుఁడ మీకు నాసనము వేసినది
పంతపు కోనేరే మీకుఁ బలుమారు నర్ఘ్యము
చెంతనే గంగాజలము చల్లె మీకుఁ బాద్యము ॥ ఇంత ॥

జలధులన్నియును నాచమనియ్యము మీకు
అలయావరుణజల మిదియె స్నానము
వలనుగా మా మవేమతె వస్త్రాభరణములు
అలవేదములె మీకు యజ్ఞోపవీతములు ॥ ఇంత ॥

ఇరవుగఁ గుబ్బ తొల్లిచ్చినదె మీకు గంధము
ధరమాలాకారుని పూదండతే మీకు పువ్వులు
ఉరుగతి మేనుల హోమమే మీకు ధూపము
తిరమైన మీకు రవితేజమే దీపము ॥ ఇంత ॥

నానామృతములే మీకు నైవేద్య తాంబూలములు
పూనిన భక్తి షోడశోపచారములు
ఆనుక శ్రీ వేంకటేశ అలమేల్మంగ పతివి

తానక పూజపములె తగమాకు నుతులు" ॥ ఇంత ॥

( సం.౨ - కీ. 272 )

అని చెప్పాడు. ఇందులో కూడా షోడశోపచారాలు చెప్పబడ్డాయి.

తాను ఆరాధించిన ఆస్వామికి అన్నమయ్య -

" నిండు మనసె నీపూజ
ఉండ గోరకుండుటదియు నీపూజ ॥ పల్లవి ॥

ఒందు పొరి గలఁడందు వెఁడనేటి
నిందకుఁ బాయుటో నీపూజ
కొందరు చుట్టాలు కొందరు పగనే
అందదుకు మానుటదియె నీపూజ ॥ నిండు ॥

తిట్టులు గన్నని దీవెన గంతని
నెడుకోనిదె నీపూజ
పెట్టిన బంగారుపెంకును నినుమును
ఒట్టొ సరియనుటదియు నీపూజ ॥ నిండు ॥

సర్వము నీవని స్వతంత్రముడిగి
నిర్వహించుటొ నీపూజ

పశ్చిమ శ్రీ వేంకటపతి నీదాసుల
పూర్వమనియెడి బుద్ధి నీపూజ ॥ నిండు ॥

(సం.3 - కీ. 320)

అని చెప్పుకున్నాడు. అన్నమయ్య తాను రామానుజ మతస్థుడినని చెప్పుకున్నాడు. అందుచేత ఆయన ఆచరించినది పాంచరాత్రుల పూజావిధానమే అయ్యుండుండని భావించవచ్చు. కాని తిరుపతిలో స్వామి ఆలయంలో వైఖానసాగమం ప్రకారం అర్చనాదుల్ని జరుపుతారు.

అన్నమయ్య తనకీర్తనల్లోకూడా పాంచరాత్రుడినని గాని వైఖానసుడినని గాని ఏదీ చెప్పుకోలేదు. కాని అన్నమయ్య కీర్తించిన రామానుజాచార్యుల కీర్తనల్నిబట్టి చూసినా, అన్నమయ్య కీర్తనల్లో చోటుచేసుకున్న ఆళ్వారుల పాశురభావ పరంపరని బట్టి చూసినా, అన్నమయ్య కీర్తించిన ఆళ్వారుల్ని బట్టి చూసినా అన్నమయ్య ఎక్కువగా రామానుజవిధానమైన పాంచరాత్రాగమ ప్రకార పూజావిధానాన్నే అనుసరించినట్లు తోస్తుంది. ఇందుకు చాలాకీర్తనలు ఉదాహరణలుగ చూడవచ్చు. అన్నమయ్య చెప్పిన -

" సహజవైష్ణవాచార వర్తనుల
సహవాసమె మాసంధ్య ॥ పల్లవి ॥

అతిశయమగు శ్రీహరి సంకీర్తన
సతతంబును మాసంధ్య

మతిరామానుజమతమే మాకును
చతురత మెఱసిన సంధ్య "

( సం.1 - కీ.10 )

అనే కీర్తన ఇందుకు ఉదాహరణ.

వైష్ణవులు (పాంచరాత్రులు) ధనుర్మాసంలో తెల్లవారుఝామునే లేచి నిత్యవిధుల్ని పూర్తిచేసుకుని, తిరుప్పావై మొదలైన పాశురాల్ని పెరుమాళ్ళకి విన్నవిస్తూ, ఆనెల్లాళ్ళు విశేషంగా స్వామికి సేవలు చేస్తారు. విశేషమైన నియమాలుపాటించి, స్వామికి చేసే ఈసేవల్ని (కైంకర్యాల్ని) వైష్ణవులు చాలా విశిష్టంగా భావిస్తారు. అన్నమయ్యకూడా ఈధనుర్మాసంలో ఆయావిధుల్ని పాటించినట్లు కిందికీర్తనవల్ల వ్యక్తమౌతుంది.

" ముదమలర కాలముల మీరిడు మోసపోక
హృదయమలర భజింపరే మీ
రిడు ధనుర్మాసముల విధులన్

వేగ నాలుగు ఘడియలనగా
వేద వేద్యులు లేచి సరగున
నాగమోక్త విధులను తమ దేహను గుణముగా
వేగమున సంధ్యాదులాగి గా
వించి విమలాంభోధి శయనుని

బాగుగా బూజించరో యెద
పః ధనుర్మాసముల విధులనె ఘనుబ    ॥ ముద ॥

పగగు చీనాంబరములను నతి
పరిమళమ్ముల బుష్పముల కడు
వెగవుగా వేంకటపతి (కినై) వేద్యసంగతుల
ఒరుదుగా ధూపముల బహూదీ
పాదులను తాంబూల విధులను
పరగ బూజింపుడు సమస్త
ప్రభు ధనుర్మాసమున విధులన్ ఘనుబ [1]    ॥ ముద ॥

నిష్ఠతో ధనుర్మాసము గడిపి, స్వామిసేవలనిచేసుకుని తరించమని విష్ణుభక్తులకి అన్నమయ్య సూచించాడనవచ్చు.

శ్రీరంగనాథుని వివాహమాడగోరి ఆతని అనుగ్రహం కోసం ధనుర్మాసవ్రతంచేసి, శ్రీరంగనాథుని పెండ్లాడిన గోదాదేవి ఆధనుర్మాస నియమాన్ని –

---

1. అన్నమాచార్యులవారి అధ్యాత్మ శృంగార సంకీర్తనలు (స్వరసహితం), ప్రథమసంపుటం, టి.టి.డి. ప్రచురణ, పుట - 16.

" వైయత్తు వాళ్వీర్ గాళ్ నాముం నమ్బావైక్కు ,
శెయ్యుం కిరిశైగళ్ కేళీరో , పాఱ్కడలుళ్
పైయత్తు యిన్ఱ పరమనడిపాడి
నెయ్యుణ్ణోం పాలుణ్ణోం నాట్కాలే నీరాడి
మైయిట్టెళుదోమ్ మలరిట్టు నాముడియోమ్
శెయ్యాదన శెయ్యోం తీక్కుఱళై చ్చెన్ఱోదోమ్
ఐయముం పిచ్చైయుమాందనైయుం కైకాట్టి
ఉయ్యుమాఱెణ్ణి యుగన్దేలో రెమ్బావాయ్ " [1]

నిరంతర పరమాత్మని పాదాల్ని భజించాలి. పాలు, నెయ్యివంటి వాటిని తీసుకోకూడదు. ప్రత్యూషసమయంలోనే చన్నీటిస్నానం చెయ్యాలి. కళ్ళకి కాటుక పెట్టుకోకూడదు, పువ్వులు పెట్టుకోకూడదు. శిష్టాచారాలు కానిపనులు చెయ్యకూడదు. ఇతరులపైన చాడీలు చెప్పకూడదు. పరుషంగా మాట్లాడకూడదు. శక్తిఉన్నంతలో పెద్దలకి, పిన్నలకి సంభావన, బిచ్చగాళ్ళకి బిచ్చం ఇవ్వాలి — అని చెప్పింది.

పైన పేర్కొనబడిన అన్నమయ్యకీర్తనలో ఈ నియమాల్లో వేకువజామున లేచి విధుల్ని నిర్వర్తించాలనే నియమాన్ని చెప్పాడు.

---

1. నిత్యానుసంధానం (ఆళ్వారులు ఆనతిచ్చిన) (ప్రబంధపారిజాతము), పుట - 127.

"పూజాదిష్వనురాగ ఇతి పారాశర్యః" [1] అని నారదభక్తిసూత్రం. పూజచేయడంద్వారా అనురాగాన్ని భగవంతునిపైన కలిగి ఉండడమే భక్తి అని నారదుడు చెప్పాడు. భక్తుడు తన ఇష్టదైవాన్ని అనేకవిధాలుగా పూజిస్తాడు. ఆస్తికులందరూ తమగృహాల్లోనేకాక దేవాలయాల్లోనూ పూజలుచేసి, తమపేర చేయించుకుని భగవంతుని అనుగ్రహం ఏదో ఒకవిధంగా పొందాలని తపనపడతారు. పరమాత్మ కరుణా కటాక్షవీక్షణాలకోసం ఎదురుచూస్తారు.

అన్నమయ్యకూడా తనదైవమైన శ్రీనివాసుని అనేక విధాలుగా కొలిచి తరించినట్లు ఆయనకీర్తనలు చెప్తున్నాయి.

"అంతరంగములోనున్న హరియె గతిగాక
చింతించి మొక్కితేఁ దానే చేకొని రక్షించును" (సం.2-కీ.259)

అని భావించి అపరిమితమైన భక్తివిశ్వాసాలతో ఆస్వామిని పూజించిన భక్తాగ్రేసరుడు అన్నమయ్య. తిరుపతిలో కొలువుతీరి ఉన్న సమస్తలోక సార్వభౌముడైన శ్రీనివాసుని కొలువులో అన్నమయ్య ఆస్థాన వాగ్గేయకారుడయ్యాడు. అతడు రోజుకొక్క సంకీర్తనచొప్పున సమర్పించిన పూజాప్రసూనాలవల్ల వ్యాపించిన ఆప్రభువుకీర్తికి కొలతేకుండా పోయింది.

నాలుగో ప్రకరణం

# అన్నమయ్య స్తుతించిన వైష్ణవ భక్తులు

# అన్నమయ్య స్తుతించిన వైష్ణవభక్తులు

శ్రీవేంకటేశ్వర వరప్రసాదంతో జన్మించి జీవితమంతా ఆతని సేవలతోనే గడిపి, స్వామి ప్రసాదించిన సంగీతసాహిత్యాలని కీర్తనలుగామార్చి స్వామికే అర్పించి ధన్యుడైన మహామనీషి అన్నమయ్య.

అన్నమయ్య క్రీ.శ. 1408లో జన్మించి, బాల్యంలోనే తిరుపతివెళ్ళిపోయి అక్కడే నివాసం ఏర్పరచుకొని, వైష్ణవాన్ని స్వీకరించి శ్రీనివాసుణ్ణి సంకీర్తనలతో అర్చించాడు.

అన్నమయ్య తనకీర్తనల్లో వైష్ణవలక్షణాల్ని,

వైష్ణవధర్మాల్ని వివరించాడు. వైష్ణవుడికి ఉండవలసిన లక్షణాల్ని, వైష్ణవ నియమాల్ని చెప్పాడు. తాను అనుసరించిన వైష్ణవాన్ని అంతటినీ తనకీర్తనల్లో పొందుపరిచాడు. ముఖ్యంగా అతడు వైష్ణవభక్తుల్ని తనకీర్తనల్లో పేర్కొంటూ వారిని రక్షించినట్లు తననుకూడా రక్షించమని వేడుకొన్న కీర్తనలు కోకొల్లలు. ఉదాహరణకి —

"చూపఁజెప్పఁగల భక్తసుజనుఁడవు మాకు
దాపైన హరి యిట్టె తప్పెఁదారెననక ॥ పల్లవి ॥

కోరి పాండవుల యింటఁ గూరలారగించినట్టు
సారపు శబరివిందు చవిగొన్నట్టు
వూరకొ మాయింట నీవు వొదవినపాటి నీ
వారగించవయ్య చవులెఁగాములెంచక ॥ చూప ॥

తొల్లియు రేపల్లె గొల్లలోమట దొడికినట్టు
తల్లి అనసూయపాలఁ దనిపినట్టు
చిల్లరైన మాయింటఁ జేసినపాటారగించు
చల్లతోడి బోనమైన చాటఁ జాలదనక ॥ చూప ॥

అంకెల శ్రీవేంకటాద్రి నారగించినయట్టు
కొంకుతేక సిరితోడఁ గోనేటిరాయ

వెంకనయిన నాయింటి వెళమైన నారగించు
అంకించి నీ నాలోని అంతరము వెంచకా "  ॥ చూప ॥

(సం. 2 - కీ. 60)

అనే కీర్తనలో పాండవులఇంటిలో కూరలుతిన్నట్టుగాను, శబరివిందురుచి చూసినట్టుగాను, అనసూయపాలు త్రాగినట్టుగాను, తన ఇంటకూడా వెళమంతైనా విందారగించడానికి అంతరాలెంచక రమ్మని వెంకటేశ్వరుని వేడాడు. ఇలా ఆర్ద్రతాపూర్వకమై, మనోహర భావజాలాలతో నిండిన కీర్తనలు అన్నమయ్య ఎన్నిటినో వెలువరించాడు.

అన్నమయ్య తన కీర్తనల్లో భాగవత భక్తుల్ని, రామాయణ, భారత భక్తుల్ని, చారిత్రక భక్తుల్ని, నిత్యసూరుల్ని, ఆళ్వారుల్ని, ఆచార్యుల్ని, వైరభక్తుల్ని ప్రశంసించాడు.

<u>భాగవత భక్తులు</u> :- భాగవతాది పురాణాల్లో చెప్పబడిన విష్ణుభక్తులు వీరు. ప్రహ్లాదుడు, ధ్రువుడు, అంబరీషుడు, నారదాదిమునులు, వ్యాసాదులు, సనకాదులు మొదలైనవారు ఈకోవకి చెందుతారు. అన్నమయ్య వీరందరినీ కీర్తిస్తూ చెప్పిన కీర్తనలు అనేకం ఉన్నాయి. అన్నమయ్య రచించిన -

" ఇతి సులభం బిదె శ్రీపతి శరణము అందుకు నారదాదులు సాక్షి
ప్రతి లేదిదియే నిత్యానందము బహువేదంబులె యివె సాక్షి   ॥ పల్లవి ॥

వేసరకుమీ జీవుడా వెదకి వెదకి దైవమును
ఆసపాటుగా హరియున్నాఁడిదె ఇందుకుఁ బ్రహ్లాదుడు సాక్షి
మోసపోకుమీ జన్మమా మించిన యనుమానములను
వేసిన భక్తికిఁ జెడులేదు యీసేతకెల్ల ధ్రువుడె సాక్షి ॥ ఇతి ॥

తమకించకుమీ దేహమా తగు సుఖదుఃఖంబుల నలసి
అమితము నరహరి కరుణనమ్మితే నందుకు నర్జునుడె సాక్షి
భ్రమయకుమీ వివేకమా బహుకాలంబుల యీఁదీఁది
తమితో దాస్యము తను రక్షించును దానికి బలీంద్రుడె సాక్షి ॥ ఇతి ॥

మఱిగివుండుమీ వో జిహ్వమరి శ్రీవేంకటపతి నుతుల
అరయఁగ నదియే యీడేరించును ఇందుకు వ్యాసాదులె సాక్షి
తిరుగకుమీ విజ్ఞానమా ద్రిష్టపు మాయలకును లోఁగి
సరిలేదితని పాదసేవకును సనకాదుల బ్రతుకే సాక్షి " ॥ ఇతి ॥

( సం.2 - కీ.41 )

ఈకీర్తనలో నారదాదుల్ని , ప్రహ్లాదుణ్ణి , ధ్రువుణ్ణి , అర్జునుణ్ణి , బలీంద్రుణ్ణి , వ్యాసాదుల్ని , సనకాదుల్ని పేర్కొన్నాడు.

సనకసనందాదులు మహర్షులు. ధర్మప్రజాపతి పుత్రులు. వీరితల్లిపేరు హింస. సృష్టిని పెంపొందించమని బ్రహ్మవీరినికోరాడు. కాని వీరు సృష్టిచెయ్యడానికి ఇష్టపడక తపస్సుచేసుకోవడం మొదలుపెట్టారు.

విష్ణుభక్తులుగా వీరు ప్రసిద్ధికెక్కారు.

వ్యాసుడు నారాయణుని మానసపుత్రుడు. నారాయణుడు వేదాల్ని విభజించడానికి ఇతన్ని సృష్టించాడు. ఇతడువేదాల్ని విభజించి వేదవ్యాసుడిగా పేరుపొందాడు. కృష్ణద్వైపాయనుడనేది ఇతని వేరొకపేరు.

నారదుడు త్రిలోకసంచారి. బ్రహ్మమానసపుత్రుడు.

ధ్రువుడన్నా, ప్రహ్లాదుడన్నా అన్నమయ్యకి ప్రీతి ఎక్కువ. వీరిద్దర్ని ప్రత్యేకంగా అనేకకీర్తనల్లో స్తుతించాడు. విష్ణుభక్తులుగా ఎక్కువగా వారినే మనకు పరిచయంచేశాడు.

ధ్రువుడు సూనృతా (సునీతి) ఉత్తానపాదులకొడుకు. ఇతని సవతితల్లి సురుచి. ఇతడు బాల్యంలో తండ్రితొడమీద కూర్చోబోతే సురుచివచ్చి తోసివేసి "నాగర్భంలో జన్మిస్తేగాని నీకు తండ్రితొడపై కూర్చునే అదృష్టం ఉండదు. కావాలంటే నాకడుపున పుట్టేట్టుగా తపస్సుచేసివరంపొందు అంటుంది. ధ్రువుడు అవమానపడి తల్లిదగ్గరకెళ్ళి ఆమె అనుమతితో శ్రీహరిని గురించి తపస్సుచెయ్యడానికి బయలుదేరి, దారిలో నారదమునిచేతబోధితుడై విష్ణువుని గురించి ఘోరతపస్సుచేసి, అతనివల్ల వరాలుపొంది చాలాకాలం రాజ్యంచేసి, జన్మాంతంలో నక్షత్రమై ప్రకాశించాడు.

"ధ్రువవరదా సంస్తుత వరదా" (సం.2 - కీ.74)

"ధ్రువ విభీషణాదుల సాక్షి" (సం.3 - కీ.292)

మొదలైన కీర్తనల్లో ధ్రువుణ్ణి పేర్కొన్నాడు.

ప్రహ్లాదుడు హిరణ్యకశిపుడు అనే రాక్షసరాజు కుమారుడు. తల్లిగర్భంలో ఉండగానే నారదోపదేశంవల్ల విష్ణుభక్తునిగామారి, విష్ణుద్వేషి అయిన తండ్రికి విరోధి అయి, బాధలనుభవిస్తాడు. ప్రహ్లాదుని కోసం విష్ణువు ఒక అవతారమే ఎత్తవలసివచ్చింది. విష్ణుభక్తులకి విష్ణువెప్పుడూ అధీనుడు.

"నీయంతటి వారెవ్వరు నీకు నెదురేది యెందు
బాయల నీసుద్దివిని శరణంటినేను

కావనెనంటొ దొల్లి కంభము చించుక వెళ్ళి
దైవశమై ప్రహ్లాదుగావవా నీవు" (సం.2 - కీ.47)

అని ప్రహ్లాదుని కథని స్ఫురింపజేశాడు. అంతేకాక -

"కానవచ్చె నిందులోనే కారుణ్యనరసింహో
ఆనకట్టై నీకంటొ దాస్యమె పోషణము ॥ పల్లవి ॥

యెనసి ప్రహ్లాదుడు యెక్కడఁ జూపునోయని
ననిచి లోకమెల్ల నరసింహగర్భమటై
పనిపూనివుంటి వటు భక్తపరతంత్రుఁడవై
తనిసి నీవధికమో దాసుడె యధికమో ॥ కాన ॥

మక్కువ బ్రహ్మదులు మానుపరాని కోపము
ఇక్కువై ప్రహ్లాదుడు యెదుట నిలిచితేను
తక్కక మానితివట్టె దాసుని యాధీనమై
నిక్క నీకింకరుఁడె నీకంటె బలువుడు ॥ కాన ॥

అరసి కమ్మర ప్రహ్లాద వరదుఁడని
పేరుపెట్టుకొంటి విట్టె బెరసి శ్రీ వెంకటేశ
సారె నీశరణాగత జనుని కాధీనమైతి
వీలీతి నీదాసునికే యిదివో మొక్కేము" ॥ కాన ॥

(సం.2 - కీ.449)

ఈ కీర్తనలో బ్రహ్మదులకంటెకూడా వారికి ఎక్కువైన భక్తునిగా ప్రహ్లాదుని ప్రశంసించాడు. అన్నమయ్య నరసింహస్వామిని కీర్తించిన కీర్తనలు చాలా ఉన్నాయి. ఇంచుమించు అలా కీర్తించిన వాటన్నింటిలోనూ ప్రహ్లాదుడు కూడా ప్రశంసించబడ్డాడు

అలాగే అంబరీషుణ్ణి కూడా అన్నమయ్య తనకీర్తనల్లో ప్రశంసించాడు. అంబరీషుడు మిక్కిలి విష్ణుభక్తిగలవాడు. విష్ణుప్రీతికోసం

ద్వాదశీవ్రతంచేసి , బ్రాహ్మణులకి భోజనంపెట్టి , తాను భోజనానికి ఉపక్రమించబోయే సమయంలో దుర్వాసుడు వస్తాడు. అతన్ని భోజనానికి ఆహ్వానించాడు. స్నానానికివెళ్ళిన దుర్వాసుడు ఎంతకీ రాకపోతే , పెద్దల సలహామీద ద్వాదశిఘడియలు దాటిపోకుండా , దోషంరాకుండా ఉదకపారణ చేస్తాడు. అదేసమయంలో దుర్వాసుడువచ్చి కోపంతో తనజడనుంచి మహాకృత్యని సృష్టించి అంబరీషునిపైకి విడుస్తాడు. విష్ణుభక్తుడైన అంబరీషుణ్ణి రక్షించడానికి సుదర్శనచక్రంవచ్చి మహాకృత్యని చంపి , దుర్వాసుని వెంటపడుతుంది. దుర్వాసుడు పధ్నాలుగులోకాలూతిరిగి రక్షించేవారెవరూ లేక విష్ణువు సలహామీద అంబరీషుణ్ణి శరణువేడుకొంటాడు. అతడు సుదర్శనాన్ని ప్రార్థించి నివారించగా కాపాడబడతాడు. ఇతనికథవల్ల విష్ణుభక్తులగొప్పతనం లోకానికి వెల్లడి అవుతోంది. ఇతన్ని అన్నమయ్య -

" ఇందరిబుద్ధులు యీశ్వరేచ్ఛకు సరిరావు
గొందినున్న మానుషము కొలపదెంతైనా ॥ పల్లవి ॥

వొక్కటివాడు దానైతే వున్నబోనే మేటచేరు
పెక్కుబుద్ధులఁబోతేను పిరివీకెను
పక్కన నంబరీషుడు పట్టినవ్రతానగెల్చె
దిక్కులెల్లా దూర్వాసుడు తిరిగిబడలెను " ॥ ఇందరి ॥

(సం. 2 - కీ. 94)

ఆనేకీర్తనలో అంబరీషుణ్ణి స్తుతించాడు. ఈరీతిగా భాగవతభక్తుల్ని ఎన్నోకీర్తనల్లో

ప్రస్తుతించాడు. ఇంకా –

" నీయంతటి వారెవ్వరు నీకు నెదురేది యెందు
బాయల నీసుద్ధివిని శరణంటి నేను

దేవలనంటే బ్రహ్మదేవునికి వేదములు
సోవల సముద్రమయిన బొచ్చితేవా నీవు

మట్టుపెద్దవటెనంటే మరిభూమి బాపగాగ
చుట్టుకపోతే దెచ్చి సొంపుగ నిలపవా " (సం.౨-కీ.౪౭)

అనీ బ్రహ్మదేవుణ్ణి, భూదేవుని ప్రస్తావించాడు. అన్నమయ్య దృష్టిలో వీరుకూడా విష్ణుభక్తులే. ఒకరు విష్ణుగర్భంనుండి పుట్టినవారు, ఒకరు విష్ణుని పెండ్లాడినవారు. ఈరీతిగా భాగవతభక్తుల్ని ఎన్నో కీర్తనల్లో అన్నమయ్య ప్రస్తుతించాడు.

<u>రామాయణ, భారతభక్తులు</u> :- ఇతిహాసాలైన రామాయణ, భారతాల్లో పేర్కొనబడిన విష్ణుభక్తులు వీరు. హనుమంతుడు, సుగ్రీవుడు, విభీషణుడు ద్రౌపది, పాండవులు, అక్రూరుడు మొదలైనవారు అన్నమయ్య కీర్తనల్లో విష్ణుభక్తులుగా స్తుతింపబడ్డారు.

రామాయణకాలంలో విష్ణ్వవతారుడైన రాముడికి నమ్మినబంటుగా మసలి, రామాయణాన్ని నడిపించిన ధీశాలి హనుమంతుడు. నిరంతరం రామనామాన్ని జపిస్తూ, తనహృదయంలో సీతారాముల్ని చూపగలిగిన భక్తిపరుడు. అన్నమయ్యకి హనుమంతుడంటే ఎక్కువ ఇష్టం. లెక్కకు మిక్కిలిగా ఎక్కువకీర్తనల్లో హనుమంతుణ్ణి అన్నమయ్య ప్రశంసించాడు. హనుమంతుడంటే అన్నమయ్యకుండే ఒక ఆత్మీయతాభావం ఈకీర్తనలో కనిపిస్తుంది.

"అంజనాతనయుడైన హనుమంతుడు
రంజితపు మతంగ పర్వత హనుమంతుడు ॥ పల్లవి ॥

రాకాసులెల్లాఁ గొట్టి రావణుని భంగపెట్టి
ఆకాసము మోచెనదె హనుమంతుడు
చేకొని యుంగరమిచ్చి సీతకు సేమము చెప్పె
భీకర ప్రతాపపు పెద్దహనుమంతుడు ॥ అంజ ॥

రాముని మెప్పించి మధ్యరాతిరి సంజీవిదెచ్చి
ఆముకొనియున్నాడు హనుమంతుడు
స్వామికార్యమునకే సరిఁబేరు వడ్డవాఁడు
ప్రేమముతోఁ బూజగొనీఁ బెద్ద హనుమంతుడు ॥ అంజ ॥

ఉదయాస్త శైలముల కొక్కజంగగాఁ జాచి

ఉదె సూర్యుతోఁ జదివె హనుమంతుడు

యెదుట శ్రీవేంకటేశు కిష్టుఁడై రామజపానఁ

బెదవులు గదిలించీఁ బెద్ద హనుమంతుడు ॥ అంజ ॥

(సం. 3 - కీ. 143)

అనే కీర్తనలో హనుమంతుని కీర్తించాడు. ఇందులో ఒక్కొక్క చరణంలో ఒక్కొక్క రామాయణ ఘట్టాన్ని పొందుపరిచాడు అన్నమయ్య. మొదటి చరణంలో సుందరకాండలో ఉండే ఇతివృత్తం, రెండో చరణంలో హనుమంతుడు సంజీవని తెచ్చి లక్ష్మణ ప్రాణదాత అయిన సంఘటన, మూడో చరణంలో హనుమంతుడు ఉదయాస్తమయ గిరులపైన చెరొక కాలు వేసి, విశ్వరూపం ధరించి సూర్యునివద్ద విద్యాభ్యాసం చేసిన సంఘటన చెప్పబడ్డాయి. ఒక్క పై కీర్తనలోనే కాక అన్నమయ్య హనుమంతుడికి సంబంధించిన ప్రతి సంఘటనని అనేక కీర్తనల్లో కథలు కథలుగా చెప్పి హనుమంతునిపైఉన్న తనభక్తిని చాటుకున్నాడు. అంతేకాకుండా –

"అందరిలోనా నెక్కుడు హనుమంతుడు

కందువ మతంగ గిరికాడి హనుమంతుడు" (సం. 2 - కీ. 207)

"అన్నిటా నేరుపరి హనుమంతుడు

పిన్నవాడే రవినంటే పెద్ద హనుమంతుడు"

(సం. 3 - కీ. 138)

మొదలైన కీర్తనల్లో హనుమంతుణ్ణి స్తుతించాడు. రాముడికి సీతను వెదకడంలో తన వానరసేననిపంపి , సహాయంచేసి రాముడివల్ల వానరరాజ్యానికి (కిష్కంధకి ) రాజైన సుగ్రీవుణ్ణి కూడా అన్నమయ్య -

"కలదిమీరినయట్టి కీతికొల తీర్చినాడు
సొలసి రాఘవుడడె సుగ్రీవునికిని " ( సం. 2 - కీ. 57 )

అనే కీర్తనలో స్తుతించాడు.

రామభక్తురాలైన శబరిని అన్నమయ్య- "సారపు శబరివిందు చవిగొన్నట్టు " (సం.2 - కీ.60 ) గా హరి భక్తసులభుడని చెప్పే కీర్తనలో ప్రస్తావించాడు. అలాగే అనసూయనికూడా అదేకీర్తనలో "తల్లి అనసూయ పాలదనిసినట్టు " హరినిస్తుతిస్తూ స్మరించాడు అన్నమయ్య.

రామాయణకాలంలో రాముణ్ణి పడవనెక్కించుకుని నదిదాటించిన గుహుణ్ణి అన్నమయ్య -

"ఎరుగుదురిందరు నెఱిఁగీ నెఱుగరు
వేరిదానె నిజ పరమాత్ముమని ॥ పల్లవి ॥

వరివాసముఁ దెలియఁగు నారదుఁడెఱుఁగు

కొలఁది శివుఁడెఱుఁగు గుహుఁడెఱుఁగు
యిలఁ గపిలుఁడెఱుఁగు నింతామనువెఱుఁగు
తలఁపవిష్ణుఁడె పరతత్త్వమని ॥ ఎరుగు ॥

బెరసి ప్రహ్లాదుఁడు భీష్ముఁడు జనకుఁడు
గురుతుగ బలియు శుకుఁడుఁ గాటుఁడు
వరుస నెఱుఁగుదురు వడి రహస్యముగ
హరియితఁడె పరమాత్ముఁడని " ॥ ఎరుగు ॥

(సం.1 - కీ.253)

అనే కీర్తనలో స్మరించాడు. విష్ణుడే పరతత్త్వమని తెలిసినవారిగా బ్రహ్మని, నారదుని, శివుని, గుహుని, కపిలుని, ప్రహ్లాదుని, భీష్ముని, జనకుని, బలిని, శుకుని, కాటుని పేర్కొన్నాడు.

అలాగే విభీషణుణ్ణి, గజేంద్రుణ్ణి, కాకాసురుణ్ణి -

" కరివరదా కాకాసురవరదా
శరణాగత విభీషణవరదా
సిరులవేదాల నిన్నుఁ జెప్పఁగా వినీని
మరిగి మఱుఁగుచొచ్చె మమ్ముఁ గావవె " ॥ ధ్రువ ॥

(సం.2 - కీ.73)

అని రామునిచేత అనుగ్రహింపబడినవారిగా పేర్కొన్నాడు.

ఇక భారతంలో చెప్పబడిన విష్ణుభక్తులు పాండవులు, ద్రౌపది, అక్రూరుడు, భీష్ముడు మొదలైనవారినికూడా అన్నమయ్య ఎన్నో కీర్తనల్లో ప్రస్తుతించాడు.

"పక్షపాతమయ్యేనంటొ బాండవుల గెలుపించి
యీక్షితియేలించి చనివియ్యవానీవు" (సం.2 - కీ. 47)

అని విష్ణుభక్తులైన పాండవులపట్ల కృష్ణునికి ఉన్న వాత్సల్యాన్ని వివరించాడు. పాండవులు కృష్ణుణ్ణి శరణనినమ్మి, అతనిసహాయంతో కౌరవుల్ని గెలిచి ధర్మపాలనంచేశారు. వీరిలో అర్జునుడంటే కృష్ణునికి మక్కువఎక్కువ. అలాగే ద్రౌపదికూడాను.

"అమితము నరహరికరుణ నమ్మితేనందుకు నర్జునుడేసాక్షి" (సం.2 - కీ.41)
అనే కీర్తనలో అర్జునుణ్ణి,

"ద్వారకానగరములో తగనెత్తమాడేనీకు
చీరానద్రౌపది మొరపెట్టినయట్టు" (సం.3 - కీ. 266)

అనే కీర్తనలో ద్రౌపదిని అన్నమయ్య పేర్కొన్నాడు.

అన్నమయ్య రుక్మాంగద, ధర్మాంగదుల్ని కూడా స్మరించాడు. రుక్మాంగదుడు ఒకరాజు. ఇతడు ఏకాదశీవ్రతం చేసేవాడు. తన

రాజ్యంలో ప్రజలచేతకూడా చేయిస్తుండేవాడు. ఇతని వ్రతభంగం చేయడానికి దేవతలు మోహిని ని పంపారు. రుక్మాంగదుడు ఆమెమోహంలో చిక్కుకున్నా ఏకాదశీవ్రతం చేయబూనాడు. తనను విడిచివెళ్ళకూడదని మోహినిపట్టుపట్టింది. రుక్మాంగదుని కుమారుడైన ధర్మాంగదుని చంపిఇస్తే తనని వదిలివెళ్ళవచ్చని ఒకషరతుపెట్టింది. అప్పుడు రుక్మాంగదుడు ఏకాదశీవ్రతం మానడానికిష్టపడక, ధర్మాంగదునిపై కత్తివేటువేయగా అదివిష్ణుప్రభావంతో వనమాలగామారింది. అప్పుడు దేవతలువచ్చి ఇది పరీక్షార్థం చేయబడినదనిచెప్పి కోరినవరాలిచ్చారు. ఈ ఇతివృత్తాన్ని అన్నమయ్య -

"సిరుల రుక్మాంగదుచేతి కత్తిధారఁ దొల్లి
వరుస ధర్మాంగదుపై వనమాలాయ" (సం.౨ - కీ.౮౫)

అనే కీర్తనలో వివరించాడు. పైవిధంగా రామాయణ, భారత భక్తుల్ని అన్నమయ్య తనకీర్తనల్లో స్తుతించాడు.

వైష్ణవులు భాగవత, రామాయణ, భారత విష్ణుభక్తుల్లో ప్రముఖులుగా భావించి కింది పేర్కొన్నవారిని స్మరిస్తారు.

శ్లో॥ "ప్రహ్లాద నారద పరాశర పుండరీక ।
వ్యాసాంబరీష శుకశౌనక భీష్మదాల్భ్యాన్ ।
రుక్మాంగదార్జున వసిష్ఠ బిభీషణాదీన్ ।

పుణ్యానిమాన్ పరమ భాగవతాన్ స్మరామి ॥" [1]

అన్నమయ్య –

" నెరవాది సాహసులు నిత్యశూరులు
దురిత విదూరులు ధ్రువాదులు ॥ పల్లవి ॥

తక్కక శ్రీహరి భక్తితాపులు సేసి యెక్కిరి
చక్కఁగా వైకుంఠము సనకాదులు
వొక్కడ విఘ్నకథలు వోడసేసుక దాఁటిరి
పెక్కు సంసార జలధి భీష్మాదులు ॥ నెర ॥

కడు విరక్తి యనేటి కత్తులనే నరకిరి
నడుమ భవపాశముల నారదాదులు
బడినే హరిదాసుల పొఁజులు గూడుకొనిరి
నుడివడకిహమందే శుకాదులు ॥ నెర ॥

పరమ శాంతములనే పట్టపేనుగుల మీఁద
వరుసల నేఁగెరు వ్యాసాదులు

---

1. శేషు సంజీవనారాయణదాసు , గీతాసంగీతము , పుట - 16.

సిరుల శ్రీ వేంకటేశుఁ జేరి సుఖముఁ జెందిరి
వెరసి దాస్యమున విభీషణాదులు " ॥ వెర ॥

(సం.1 - కీ. 490)

అనే కీర్తనలో సనకాదుల్ని, భీష్మాదుల్ని, నారదాదుల్ని, శుకాదుల్ని, వ్యాసాదుల్ని, విభీషణాదుల్ని స్తుతించాడు.

<u>చారిత్రక భక్తులు</u> :- చరిత్రలో చెప్పబడిన విష్ణుభక్తులు వీరు. తమభక్తితో విష్ణువు మహిమని లోకానికి చాటి చరిత్రకెక్కినవారిలో తిరుమలనంబి, కురువనంబి, తొండమాన్ చక్రవర్తి మొదలైనవారున్నారు. వీరిని అన్నమయ్య తన కీర్తనల్లో ఎన్నోరకాలుగా పేర్కొని ప్రశంసించాడు.

"కురువనంబి తిరుమల కురువనంబి నీ
చరణములే కొలిచి బ్రతికె కిరీటము గలరాజు " 1

అనే కీర్తనలో కురువనంబికథని పొందుపరచి అన్నమయ్య అతడి భక్తిని ప్రశంసించాడు. కుమ్మరి అయిన కురువనంబి ప్రతిదినమూ స్వామికి వండుకుండ చేసి అర్పిస్తూ బ్రతికేవాడు. అతడు కొయ్యతో శ్రీనివాసుని కల్పించుకుని కుండలు చెయ్యగా మిగిలినమట్టితో పువ్వులుచేసి పూజించేవాడు. ఆదేశాన్నేలే తొండమాన్ చక్రవర్తి ప్రతిరోజూ స్వామికి బంగారుపూలతో తొలిపూజ చేస్తుండేవాడు.

---

1. తాళ్ళపాక చిన్నన్న, శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము, పుట - 14.

ఒకరోజు స్వామిపాదాలకి తొండమానుడర్పించిన బంగారుపూలు ఒకప్రక్కకి జారిపోయి, మట్టిపువ్వులు స్వామిపాదాలమీద నిలిచాయి. తొండమానుడదిచూసి, విచారించి కురువనంబిదగ్గరకువెళ్ళి, అతడు ఆపూలు స్వయంగా తయారుచేసి ఉన్నచోటునుంచే అర్పించిన పూలని తెలుసుకొని పశ్చాత్తాపపడి, కురువనంబివల్ల హితోపదేశంపొంది, అహంకారాన్ని విడిచిపెట్టి నిర్మల మనస్కుడై హరినికొలవడం ప్రారంభిస్తాడు. ఇది కురువనంబి, తొండమాన్‌చక్రవర్తులకథ. అన్నమయ్య –

"ఎడువంటి వాడవో నీమహిమలెట్టు దెలియవచ్చును
నిడులలోచనుడ అజుడు తెలియలేరు నిన్నెట్లు దెలిసేరు మానవులు"[1]

అనేకీర్తనలో తిరుమలనంబిని, కురువనంబిని, అనంతాళువారిని, తొండమాన్ చక్రవర్తిని, ఎఱుకవారిని, గొల్లలని, దాసుతిమ్మన్నని ప్రస్తావించాడు. అన్నమయ్య కీర్తనల్లో ప్రసిద్ధమైన –

"కొండలలో నెలకొన్న కోనేటిరాయడువాడు" (సం. 1 – కీ. 151)

అనే కీర్తనలో కూడా కురువరత్తినంబిని, తొండమాన్ చక్రవర్తిని, తిరుమలనంబిని తిరుకచ్చినంబిని, అనంతాళువారిని ప్రశంసించాడు.

వీరిలో తొండమాన్ చక్రవర్తి శ్రీనివాసునివిగ్రహాన్ని

---

1. తాళ్ళపాక చిన్నన్న, శ్రీతాళ్ళపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము, పుట – 25.

పుష్కరిణి నుంచి ఉద్ధరింపచేసి, ఆలయాన్ని కట్టించి పూజాకార్యక్రమాల్ని ఏర్పాటుచేసినట్లు పురాణాల్లో చెప్పబడింది. "సంగమకాలపు సాహిత్యం వడగరు (ఉత్తరాదివారు) లలో కళ్వర్ తెగకు చెందినవారికి నాయకుడగు "పుల్లి" తరువాత వేంగడ ప్రాంతమును "పవిత్తిరి" రాజధానిగా పాలించిన తిరైయాన్ తొండమాను నొకని పేర్కొనుచున్నది. బహుశః ఈతడే పురాణములలో పేర్కొనబడిన తొండమానచక్రవర్తియై యుండును." 1

దైవప్రేరణచేతే వెలసిన క్షేత్రమై, మొదట్లో వరాహక్షేత్రంగా ఉండి, తర్వాత శ్రీనివాసునికి స్థానమై, క్రీ.పూ. ప్రథమ శతాబ్ది ఉంతంలో తొండమాన్ చక్రవర్తిచేత గుర్తింపబడి, గొప్పవిష్ణుక్షేత్రంగా తిరుపతి రూపొందింది. ఇందుకే అన్నమయ్య –

"దొమ్ములు చేసినయట్టి తొండమాన్ జక్కురవర్తి
రమ్మన్న చోటికి వచ్చి నమ్మినవాడు" (సం.1 - కీ. 151)

అన్నాడు. ఇక కురువనంబి, కురువరత్తినంబి ఒకరేనని ఈ కీర్తనలోనే ప్రయోగించిన "కుమ్మరదాసుడు" అనే శబ్దంవల్ల తెలుస్తోంది.

అనంతాళువారు, తిరుమలనంబి పరమవైష్ణవ

---

1. డా॥ వేటూరి ఆనందమూర్తి, తాళ్ళపాకకవుల కృతులు - వివిధసాహిత్యప్రక్రియలు, పుట-6

భక్తులు. వీరిలో అనంతాళువారు రామానుజాచార్యుల శిష్యుడు. ఇతడు తిరుమలలో తాను పెంచిన పూతోటలో పూసినపుష్పాలు స్వామికి సమర్పించేవాడు. ఒకనాటిరాత్రి లక్ష్మీదేవితో వేంకటేశ్వరస్వామివారు ఆతోటలో విహరించి కొన్నిపుష్పాలు కోసుకున్నారు. మర్నాడుకూడా అలాగేజరిగింది. పుష్పాలు పోతున్నసంగతి గ్రహించి అనంతాళ్వారు మూడోరోజుమేల్కొనిఉండి కాపలాకాసి, దొంగల్ని పట్టుకోబోతే స్వామివారు పారిపోయారు. కాని లక్ష్మీదేవి దొరికిపోయింది. ఆమెన చెట్టుకు కట్టేశాడు అనంతాళ్వారు. మర్నాడు గుడితలుపులుతీసిచూస్తే స్వామివక్షస్థలం మీద అమ్మలేదు. అర్చకులు భయభ్రాంతులయినపుడు స్వామి లక్ష్మీదేవి పూతోటలో చెట్టుకి కట్టబడిందని చెప్పాడు. జగన్మాతను కట్టివేయగలిగినధన్యుడు అనంతాళ్వారు.

అలాగే మరొకసారి అనంతాళ్వారు తిరుమలకొచ్చే యాత్రికులకి, స్థానికులకి నీటిసౌకర్యం కల్పించడంకోసం చెరువుని త్రవ్వుతుండగా నిండుగర్భిణిఅయిన ఆయనభార్య పడుతున్న అవస్థచూసి స్వామి ఆమెకి మట్టితట్టలు మోయడంలో సహాయంచెయ్యడానికివచ్చాడు. బాలునిరూపంలోఉన్న స్వామిని అనంతాళ్వారు పట్టుకోబోతాడు. కాని బాలుడు దొరక్కపోవడంతో చేతిలోఉన్న పారవిసిరితే అదితగిలి స్వామినుదుటిమీద, గడ్డంమీద గాయాలయ్యాయి. ఈ ఇతివృత్తాన్ని అన్నమయ్య —

"అచ్చపు వేడుకతోడ వనంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోచినవాడు" (సం.1 - కీ. 151)

అని చెప్పాడు. ఈ సంఘటనతో ఏర్పడిన స్వామిగాయాలమీద పచ్చకర్పూరాన్ని అద్దే పద్ధతి రామానుజులవారు ప్రవేశపెట్టారు.

తిరుమలనంబితో కూడా స్వామివారు చనువుగా ఉన్నట్టుగా - "తిరుమలనంబి కడ తాము రామాయణంబు అధ్యయనము చేసిన తావున చింతచెట్టు క్రింద నంది పూజావసరమును గుర్తించి స్వామి వారేస్వయముగా తమ శ్రీపాదముల వెలయజేసిరను పురాణకథననుసరించి కొండయెక్కుడు మొదటగల శ్రీపాదచిహ్నములకు పూజావిధినేర్పరచిరి." [1] అనే వేటూరి ఆనందమూర్తిగారి మాటలవల్లతెలుస్తోంది. తిరుమలనంబికి, వెంకటేశ్వరునికి మధ్యఉన్న చనువుని అన్నమయ్య -

"మచ్చిక దొలక తిరుమలనంబి తోడుత
నిచ్చనిచ్చ మాటలాడి నొచ్చినవాడు" (సం.1.-కీ.151)

అని వివరించాడు. అనంతాళువారు, తిరుమలనంబి వార్ధక్యం వచ్చినతర్వాత అక్కడే యాదవరాయడనే అతడు కట్టించిన వైష్ణవగృహాల్లో నివసించారు.

ఈ విధంగా అన్నమయ్య తనకీర్తనల్లో చారిత్రక విష్ణుభక్తుల్ని కీర్తించాడు.

---

1. డా॥ వేటూరి ఆనందమూర్తి, తాళ్ళపాకకవుల కృతులు - వివిధసాహితీ ప్రక్రియలు, పుట-17.

<u>ఆళ్వారులు</u> :- ద్రావిడప్రబంధకర్తలు , వైష్ణవాన్ని ప్రచారంచేసినవారు , విష్ణుభక్తులు అయిన ఆళ్వారుల్ని అన్నమయ్య ఎన్నో కీర్తనల్లో స్తుతించాడు. ఆళ్వారులు పన్నెండుమంది.

1. పొయ్‌గై యాళ్వారు (సరోయోగి)
2. భూదత్తాళ్వారు (భూతయోగి)
3. పేయాళ్వారు (మహాయోగి)
4. తిరుమళిశైయాళ్వారు (భక్తిసారులు)
5. నమ్మాళ్వారు (శఠకోపయతి)
6. కులశేఖరాళ్వారు
7. పెరియాళ్వారు (భట్టనాథులు, విష్ణుచిత్తులు)
8. తొండరడిప్పొడి యాళ్వారు (భక్తాంఘ్రిరేణువులు)
9. తిరుప్పాణాళ్వారు (యోగివాహులు)
10. తిరుమంగై యాళ్వారు (పరకాలముని)
11. ఆణ్డాళ్ (గోదాదేవి)
12. మధురకవి యాళ్వారు

వీరు పంచమాగమం , ద్రవిడవేదమనబడే దివ్యప్రబంధాన్ని 4000 కీర్తనలతో రచించారు. వీటని పాశురాలంటారు. ఇవి తమిళంలో ఉన్నాయి. అన్నమయ్య ఈ పాశురాల్ని అనుసరిస్తూ ఎన్నోకీర్తనలు చెప్పాడు.

ఈ ఆళ్వార్లు అందరూ విష్ణుభక్తులై, వైష్ణవాన్ని విశేషంగా ప్రచారంచేసినవారే. అన్నమయ్య వీరిని కిందికీర్తనలో స్మరించాడు.

" వాడె వేంకటేశుడనే వాడెవీడు
వాఁడిచుట్టుఁ గైదువ వలచేతివాఁడు ॥ పల్లవి ॥

కారిమారసుతుని చక్కని మాడలకుఁ జొక్కి
చూరగా వేదాలగుట్టు చూపినవాడు
తేరని వేడుకతో తిరుమంగయాళువారి
ఆరడి ముచ్చిమికూటి కాసపడ్డవాడు ॥ వాడె ॥

పెరియాళువారిబిడ్డ పసికిపై వేసిన
విరులదండల మెడవేసినవాడు
తరుణి చేయివేసిన దగ్గరి భుజము చాఁచి
పరవశమై చొక్కి పాయచేసివాడు ॥ వాడె ॥

పామరులఁ దనమీఁది పాటలెల్లాఁ బాడుమంటా
భూమికెల్లా నోర నూరిపోసినవాఁడు
మామకూఁతురుల మేలు మంగనాచారియుఁదాను
గీముగానే వేంకటగిరి నుండేవాడు " ॥ వాడె ॥

(సం. 1 - కీ. 121)

ఆళ్వారుల్లో ఒకత్తైన గోదాదేవిని అన్నమయ్య స్మరించాడు.

"చూడరమ్మ సతులాల సోబాన చూడరమ్మ
కూడుకున్నది పతిఁ జూడికుడనాచారి ॥ పల్లవి ॥

శ్రీ మహాలక్ష్మియట సింగారాలకేమరుదు
కాముని తల్లియట చక్కదనాలకేమరుదు
సోముని తోఁబుట్టువట సొంపు గళకేమరుదు
కోమలాంగి యీ చూడికుడుతనాచారి ॥ చూడ ॥

అమరవందితయట అట్టె మహిమేమరుదు
అమృతము చుట్టమట ఆనందాలకేమరుదు
తమితో శ్రీ వేంకటేశుఁ దానె వచ్చి పెండ్లాడె
కమెరవయసు చూడికుడుత నాచారి" ॥ చూడ ॥

(సం. 32 - కీ. 246)

అనే కీర్తనలో ఈమెని "శ్రీ వేంకటేశుడు తానెవచ్చి పెండ్లాడిన మహాలక్ష్మి" గా స్తుతించాడు. ఈమె బాల్యంనుంచి శ్రీరంగనాథుని తనపతిగా కోరి ఆయన్ని నిరంతరం ధ్యానించేది. ప్రతిరోజు తండ్రి గుచ్చికూర్చి శ్రీరంగనాథుని అలంకరణకోసం సిద్ధంచేసిన వనమాలని తానుధరించిచూసుకొని తనముడిపాలవి క్షమ్మరించి ఆవనమాలను పంపేది. తన ప్రియభక్తురాలి మధురామరాగస్పర్శని పొందిన (ఆగోదాదేవి) ఆముక్తమాల్యదల్ని

ప్రణయానందంతో రంగనాథుడు ధరించేవాడు. ఆ ప్రణయమే గోదాదేవి రంగనాథుల పరిణయానికి దారితీసింది. ఆమె రంగనాథుని అనుగ్రహంకోసం ధనుర్మాస వ్రతదీక్షని కఠినంగా ఆచరించి, ఆమాసంలో ముప్పైరోజులూ ముప్పైకీర్తనలు (పాశురాలు) పాడి తనస్వామిని మెప్పించింది.

పైవిధంగా ఆళ్వారులను అన్నమయ్య కీర్తనల్లో స్తుతించాడు.

<u>నిత్యసూరులు</u> :- వీరు నిత్యమూ విష్ణువు దగ్గరే ఉండి సేవలు చేసేవారు. అనంత, గరుడ, విష్వక్సేన, సుదర్శన, పాంచజన్యాదులు వీరు.

" దాసవర్గములకెల్లా దరిదాపు మీరెకాన  
వాసికి నెక్కించరాదా వసుధలో మమ్మును ॥ పల్లవి ॥

సేనాధిపతి నీవు చేరి విన్నవించరాదా  
శ్రీనాథునికి నేము సేసే విన్నపము  
ఆమక భాష్యకారులు అడ్డమారుఁ జేయరాదా  
మానక విన్నపము మానునవి చనువులు ॥ దాస ॥

వేయినోళ్ళభోగి నీవు విన్నపము సేయరాదా  
వేయేసి మావిన్నపాలు విష్ణునికిని

ఆయితమై గరుడుఁడ అడ్డెమోరఁ జేయరాదా
యేయెడ విన్నపము మాకేమి వలసినాను " || దాస ||

(సం. 3 - కీ. 261)

ఈ కీర్తనలో విష్ణువు సేనాధిపతి అయిన విష్వక్సేనుని, అనంతుని, గరుడుని పేర్కొన్నాడు. విష్వక్సేనుని అన్నమయ్య కింది కీర్తనలో స్మరించాడు –

" ఆర్పులు బొబ్బలు నవె వినుడు
యేర్పడ నసురల నిడువతె గెలిచె || పల్లవి ||

పగులపగుల వృషభాసురునిఁ జంపె
పగ నీఁగె అతని బలములలో
అగపడి శ్రీవేంకటాధిపు పంపున
జగిగల విష్వక్సేనుడు గెలిచె " || ఆర్పు ||

(సం. 2 - కీ. 108)

ఇలాగే అన్నమయ్య సుదర్శనచక్రాన్ని కూడా అనేక కీర్తనల్లో స్తుతించాడు. సుదర్శనచక్రం విష్ణువు చేతిలో పంచాయుధాల్లో ఒక ఆయుధంగా ఉండి దుష్టశిక్షణ చేయడానికి ఉపకరిస్తుంది. అందుకే అన్నమయ్య సుదర్శనచక్రాన్ని –

" మొక్కెద మిదివో మూఁడు మూర్తులను
వొక్కరూపమై వొనరేఁ జక్రము || పల్లవి ||

బలుమధుకైటభ ప్రాణవాయువుల
అలరిన నైవేద్యంబులను
యెలమిని శ్రీవేంకటేశు హస్తముల
వెలసి నిలిచె నిదె విజయచక్రము " ॥ మొక్కెద ॥

(సం.2 - కీ.516)

అని స్తుతించాడు. అలాగే పాంచజన్యాన్ని –

"అంబరాన నున్న ధ్రువునజ్ఞానమెల్లఁ బాపె
పంచి నీచేతనుండిన పాంచజన్యము " (సం.3 - కీ.434)

అని కీర్తించాడు. గరుడుని –

"గరుడధ్వజప్పుఁడేరు కనకమయప్పుఁడేరు
సురలు బొమ్మలైనారు చుట్లఁదేరు
మెరుఁగుల మేఘముల మించుఁగొలఁగెలతీరు
సిరుల ధ్రువలోకప్పు శిఖరప్పుఁడేరు " (సం.2 - కీ.366)

అనే కీర్తనలో విష్ణుమూర్తికి తగిన చక్కనిరథంగా స్తుతించాడు.

నిత్యసూరుల్లో ఒకరై, విష్ణుమూర్తి పడకగా, మెత్తగా అమరిఉండి, నిత్యమూ సేవచేసే అనంతుని (శేషుని) అన్నమయ్య –

"వేఁడగదె శేషుఁడు శ్రీవేంకటాద్రి శేషుఁడు
వేఁడుక గరుడునితోఁ బెన్నుద్దైన శేషుఁడు " (సం.3, కీ.365)

అనే కీర్తనలో కీర్తించాడు.

పైవిధంగా అన్నమయ్య నిత్యసూరుల్ని అనేక కీర్తనల్లో, ఎన్నోరకాలుగా కీర్తించాడు.

<u>ఆచార్యులు</u> :- వైష్ణవాన్ని అభివృద్ధి చెయ్యడానికి విశిష్టాద్వైతాన్ని సిద్ధాంతీకరించి, ప్రచారంచేసి శిష్యులకి బోధలు చేసినవారు ఆచార్యులు. పరబ్రహ్మ నిరూపణ విచక్షణులైన ఈ వైష్ణవాచార్యుల్ని అన్నమయ్య తనకీర్తనల్లో కొనియాడాడు. ముఖ్యంగా అన్నమయ్య విశిష్టాద్వైతానికి విశిష్టమైన సేవచేసి వైష్ణవానికి జాతి, కుల, మత భేదాలు లేవని, కులంకాదు గుణం ప్రధానమని, అన్నివర్గాలవారు మోక్షానికి అర్హులేనని, ప్రచారంచేసి ఎంతోమందిని వైష్ణవులుగా మార్చి, శిష్యులుగా చేసుకున్న రామానుజాచార్యుల్ని అన్నమయ్య ఎన్నోకీర్తనల్లో స్తుతించాడు.

"గతులన్ని ఖిలమైన కలియుగమందును
గతియీతడే చూపె ఘనగురుదైవము     ॥ పల్లవి ॥

యీతని కరుణనేకా యిల వైష్ణవులమైతి
మీతని వల్లనే కంటిమీతిరుమణి
యీతడె కావుపదేశమిచ్చె నష్టాక్షరిమంత్ర
మీతడె రామానుజుడు యిహపరదైవము ॥ గతి ॥

వెలయించె నీతడేకా వేదపు రహస్యములు
చలిమి నీతఁడె చూపె శరణాగతి
నిలిపె నాఁడీతఁడేకా నిజముద్రధారణము
మలసి రామానుజులె మాఁటలాడె దైవము ॥ గతి ॥

నియమము లీతఁడేకా నిలిపెఁ బ్రపన్నులకు
దయతో మోక్షము చూపెఁదగ నీతఁడె
నయమై శ్రీవేంకటేశునగ మెట్టెక్కె వాకిటను
దయఁజూచె మమ్ము నిట్టె తల్లితండ్రి దైవము" ॥ గతి ॥

(సం.2 - కీ.372)

అనే కీర్తనలో రామానుజుల్ని ఇహపరదైవంగా స్తుతించాడు. భాష్యకారుడైన రామానుజాచార్యుల్ని అన్నమయ్య -

"ఏమీ నెఱఁగని మమ్ము నెక్కువ సేసి
పామరుల దొడ్డఁజేసె భాష్యకారుడు" (సం.1 - కీ.162)

అని కలియుగంలో తిరుమంత్రద్వయంతో లోకులపంకాన్ని కడిగినఉడయవరునిగా

కీర్తించాడు. అంతేకాక –

"పుట్టుగులు గెలిచి నిన్నుఁ బొందుట కుపాయము
ఒట్టె నీరూపమైన ఆచార్యుడే
యిట్టె శ్రీవేంకటేశ యిన్నిటికి నుపాయము
మట్టులేని రామానుజమతము చేకొనుటే" (సం.2-కీ.334)

అని రామానుజమతం స్వీకరించడమే శ్రీవేంకటేశ్వరుని పొందే ఉపాయమని అన్నమయ్య సూచించాడు.

అలాగే అన్నమయ్య తనగురువైన ఆదివణ్ శఠకోపయతిని కూడా కీర్తించాడు. అహోబలస్వామికి గురువై తానే త్రిదండాన్ని, మంత్రాన్ని అనుగ్రహించగా హయగ్రీవానుగ్రహం పొంది, సన్యసించి, వేదాంత దేశికుని సంప్రదాయాన్ని అనుసరిస్తున్న శఠకోపముని దగ్గర సకల వేదాంత శాస్త్రాధ్యయనం చేశాడు అన్నమయ్య. ఈ శఠకోపముని అహోబలమఠ ప్రతిష్ఠాపనాచార్యులు. అన్నమయ్య ఈయనని –

"చూడుఁడిందరికి సులభుడు హరి
తోడునీడయగు దొరముని యితడు ॥ పల్లవి ॥

కైవల్యమునకుఁ గనకప్రతాపల
త్రోవై శ్రుతులకుఁ దుదిపదమై
పావన మేకరూపమై విరజకు
నావై యున్నాఁడిదె యితడు ॥ చూడు ॥

కాపాడఁగ లోకములకు సుజ్ఞాన
దీపమై జగతికిఁ దేజమై
పాపాలడఁపఁగ భవపయోధులకు
తెప్పై యున్నాఁడిదె యితఁడు ॥ చూడు ॥

కరుణానిధి రంగపతికిఁ గాంచీ
వరునకు వేంకటగిరిపతికి
నిరతి నహోబల నృకేసరికిఁ ద
త్పరుఁడగు శఠకోపముని యితడు ॥ చూడు ॥

(సం.1 - కీ.117)

అనే కీర్తనలో కీర్తించాడు.

వైరభక్తులు :- పైకి వైరులు (శత్రువులు) గా కనిపిస్తూ అంతరంగంలో హరిని కొలిచి, అతన్ని చేరుకోవడానికి అంతరంగంలోనే మధనపడి, చివరకు ఆహరిచేతనే జీవితం అంతమయ్యేట్లు చేసుకున్నవాళ్ళు ఈ వైరభక్తులు వైరభక్తులైన హిరణ్యకశిపుడు, రావణాసురుడు మొదలైనవారిని అన్నమయ్య

తన కీర్తనల్లో ఇలా స్తుతించాడు.

"వారిదే పో జన్మము వడి నిన్నుఁ దెచ్చిరి
భారత రామాయణాలై పరగె నీకథలు ॥ పల్లవి ॥

భువి మీఁద రావణుఁడు పుట్టగాఁగా రాముడవై
తవిలి యిందరికిఁ బ్రత్యక్షమైతివి
వివరింప నంతవాఁడు వెలసితేఁగా నీవు
అవతార మందితె నిన్నందరునుఁ జూతురు ॥ వారిదే ॥

రమణఁ గంసాదియసురలు యాటసేయఁగాఁగా
తిమిఁ గృష్ణావతార మిందరికైతివి
గమత్తై యంతటివారు గలిగితేఁగా నీవు నేఁడు
అమర జనించి మాటలాడుదు విందరితో ॥ వారిదే ॥

యెంత వుపకారియో హిరణ్యకశిపుడు
యెంత నరసింహుఁడ నీసేవ యిచ్చెను
యింతటి శ్రీవేంకటేశ యిన్నిరూపులును నీవే
పంతాన నీ శరణని ప్రతికితి మిదివో" ॥ వారిదే ॥

( సం. 2 - కీ. 160 )

అవే కీర్తనల్లో రావణుని, కంసాది అసురుల్ని, హిరణ్యకశిపుని ప్రశంసించాడు.

ఈ విధంగా అన్నమయ్య భాగవత, రామాయణ, భారత భక్తుల్ని, చారిత్రక భక్తుల్ని, నిత్యసూరుల్ని, ఆళ్వారుల్ని, ఆచార్యుల్ని, వైరభక్తుల్ని తనకీర్తనల్లో వేనోళ్ళ ప్రశంసించాడు.

ఐదో ప్రకరణం

# వైష్ణవ వాగ్గేయకారుల్లో అన్నమయ్య స్థానం

# వైష్ణవ వాగ్గేయకారుల్లో అన్నమయ్యస్థానం

ఏ భాషాసాహిత్యమైనా మొట్టమొదట మతాన్నిఅనుసరించో, మతాన్ని అభివృద్ధి చేయడానికో వెలువడిందిగానే కనిపిస్తుంది. మతంకూడా సాధారణంగా ఆయాప్రాంతాల్లోఉండే భాషాసాహిత్యాలద్వారానే వ్యాప్తిచెందుతుంది. ఈవిధంగా భాషాసాహిత్యాలవల్ల మతం, మతంవల్ల భాషాసాహిత్యాలూ అభివృద్ధి చెందుతూవస్తున్నాయి.

అలా వివిధభాషాసాహిత్యాలద్వారా వృద్ధిపొందిన వివిధమతాల్లో 'వైష్ణవం' ఒకటి. వైష్ణవం విష్ణువుకి సంబంధించింది. వైష్ణవమతంలో విష్ణువు పరమాత్మ. విష్ణువుపై భక్తితో వైష్ణవాన్ని ప్రచారంచేసిన కవులు, పండితులు, ఆచార్యులు ఇంకా ఎందరో మహానుభావులున్నారు. వారిలో వాగ్గేయకారుల్ని ప్రత్యేకించి చెప్పుకోవచ్చు.

వాగ్గేయకారలక్షణాలు :- వాక్కునూ, గేయాన్నీ తానే స్వయంగా కూర్చగలవాడు వాగ్గేయకారుడనబడతాడు. "శార్ఙ్గదేవుడు తన సంగీతరత్నాకరంలోని ప్రకీర్ణకాధ్యాయంలో వాగ్గేయకారలక్షణాల్ని పంద్రెండు శ్లోకాలలో చెప్పాడు.

> వాఙ్మాతురుచ్యతే గేయం ధాతురిత్యభిధీయతే
> వాచంగేయంచ కురుతేయః సవాగ్గేయకారకః " 1

వంటివి పన్నెండు శ్లోకాలున్నాయి. పైన ఉదహరించిన శ్లోకంలో శార్ఙ్గదేవుడు మాటలకూర్పుని వాక్కుగాను, సంగీతపుకూర్పుని గేయంగాను వ్యవహరించాడు. 'గేయం' అనేమాటకి పర్యాయపదంగా 'పదం, పాట' అనేమాటవాడుతున్నాం. పాటలో ఉండే సాహిత్యాంశాన్ని 'మాతువు' అనీ, సంగీతాంశాన్ని 'ధాతువు' అనీ అంటారు. ఈరెంటినీ కూర్చగలవాడు వాగ్గేయకారుడనబడతాడు. ఇవేకాకుండా వాగ్గేయకారుడి ఘనతకి అత్యావశ్యకాలైన ముఖ్యధర్మాల్ని శార్ఙ్గదేవుడు –

> "శబ్దానుశాసన జ్ఞానమభిధాన ప్రవీణతా
> ఛన్దః ప్రభేద వేదిత్వమలంకారేషు కౌశలమ్ " 2

వంటి ఏడుశ్లోకాల్లో చెప్పాడు. మొత్తంమీద వాగ్గేయకారుడు –

---

1. బాలాంత్రపురజనీకాంతరావు, ఆంధ్ర వాగ్గేయకారచరిత్రము, పుట - 47.

2. " " "

1. శబ్దానుశాసనజ్ఞానం కలిగిఉండాలి.

2. అభిధాన ప్రవీణత కలిగిఉండాలి.

3. ఛన్దః ప్రభేదవేదిత్వం కలిగిఉండాలి.

4. అలంకారజ్ఞుడై ఉండాలి.

5. రసభావ పరిజ్ఞానం కలిగిఉండాలి.

6. దేశకాల పరిజ్ఞానం కలిగిఉండాలి.

7. లోకజ్ఞానం కలిగిఉండాలి.

8. అశేష భాషా పరిజ్ఞానం కలిగిఉండాలి.

9. సంగీతాది కళాశాస్త్రజ్ఞుడై ఉండాలి.

10. నృత్య, గీత, వాద్యాలలో ప్రవీణత కలిగిఉండాలి.

11. చక్కని కంఠం కలిగిఉండాలి.

12. తాళ, లయజ్ఞానం కలిగిఉండాలి.

13. కాక్వాదుల్ని తెలిసిఉండాలి.

14. ప్రమేయస్ఫూర్తి (ప్రతిభ) కలిగిఉండాలి.

15. శ్రావ్యంగా గానం చేయగలిగినవాడై ఉండాలి.

16. వాక్పటుత్వం కలిగిఉండాలి.

17. సరసత్వం కలిగిఉండాలి.

18. ఔచిత్య వివేచనం కలిగిఉండాలి.

19. పరచిత్తజ్ఞానం కలిగిఉండాలి.

20. నూతనధాతునిర్మాణం చేయగలిగిఉండాలి.

21. శాస్త్రీయ సంగీతరచనారూపాలైన ప్రబంధాల పాండిత్యంకలిగి, నిర్మాణం

చెయగలిగి ఉండాలి.

22. గీతరచన శీఘ్రంగా చెయగలిగి ఉండాలి.

23. త్రిస్థాయిలలోనూ తగిన గమకజ్ఞుడై ఉండాలి.

24. అవధానం (ఏకాగ్రత) కలిగి ఉండాలి.

పైలక్షణాల్ని వాగ్గేయకారుడు కలిగి ఉండాలి. ఈ లక్షణాల్లో కొన్ని లోపించినా, వారిని వాగ్గేయకారులనవచ్చు. అన్నిలక్షణాలూ కలిగినవాడు ఉత్తమ వాగ్గేయకారుడవుతాడు.

ఇటువంటి ఎన్నోలక్షణాల్ని శార్ఙ్గదేవుడు మొదలైన శాస్త్రకారులు వాగ్గేయకారులకి నిర్దేశించారు. భరతుడు (నాట్యశాస్త్రం), నారదుడు (నారదీయశిక్ష, స్వరార్ణవం), మతంగుడు (బృహద్దేశి), మమ్మటాచార్యుడు (సంగీతరత్నమాల), పార్శ్వదేవుడు (సంగీత సమయసారం), చాళుక్యసోమేశ్వరుడు (మానసోల్లాసము, సంగీతరత్నావళి), సోమనార్యుడు (స్వరార్ణవం లేక స్వరరాగసుధారసము), జాయపసేనాని (నృత్తరత్నావళి, గీతరత్నావళి), శార్ఙ్గదేవుడు (సంగీతరత్నాకరం), సింగభూపాలుడు (సంగీతసుధ, రసార్ణవసుధాకరం), హరిపాలదేవుడు (సంగీతసుధాకరం), విద్యారణ్యుడు (సంగీతసారం), కుమారగిరి వసంతరాజు (వసంతరాజీయం), పెదకోమటివేమారెడ్డి (సాహిత్యచింతామణి, సంగీతచింతామణి, అమరుశతకం), గోపేంద్రతిప్పభూపాలుడు (తాళదీపిక), చతురకల్లినాథుడు (కళానిధి), తాళ్ళపాక అన్నమాచార్యుడు (సంకీర్తనలక్షణం), భండారు లక్ష్మీనారాయణ

(సంగీతసూర్యోదయం), రామామాత్యుడు (స్వరమేళకళానిధి), అహోబలపండితుడు (సంగీతపారిజాతం), సోమనాథుడు (రాగవిబోధ), చతురదామోదరుడు (సంగీతదర్పణం), పుండరీకవిఠలుడు (షడ్రాగచంద్రోదయం), మాధవభట్టు (సంగీతచంద్రిక), భావభట్టు (సంగీతలక్షణం), గోవిందదీక్షితుడు (సంగీతసుధ), వెంకటమఖి (చతుర్దండీ ప్రకాశిక, రాగలక్షణం), గోవిందామాత్యుడు (సంగీతశాస్త్రసంక్షేపం), తులజాజీమహారాజు (సంగీతసారామృతం) మొదలైన లక్షణకర్తలెందరో వాగ్గేయకారలక్షణాల్ని, సంగీతరీతుల్ని చెప్పారు.

సంగీతలక్షణకర్తలూ, ఆలక్షణాలకి ఉదాహరణలుగా చెప్పడానికి తగిన కేవలసంగీతాత్మక రచనలుచేసిన లక్ష్యకర్తలూ, సంగీతాత్మకమైన సాహిత్యరచనలుచేసిన లక్ష్యకర్తలూ అనిమూడురకాల వాగ్గేయకారులున్నారు. భరతుడు, మతంగుడు, రామామాత్యుడు, గోవిందదీక్షితుడు, వెంకటమఖి మొదలైన లక్షణకర్తలు మొదటకోవకు చెందుతారు. అన్నమయ్య, పురందరదాసు, క్షేత్రయ్య, త్యాగయ్య మొదలైన లక్షణకర్తలు మూడోకోవకి చెందుతారు. మిగిలినవారు రెండోకోవకి చెందుతారు.

గేయం అనేది ఛందోబద్ధమైన పద్యకవిత్వంకంటే ముందే పుట్టిందనేది అందరూ అంగీకరించినవిషయమే. ప్రాచీనమానవుడు అనేక అనుభూతుల్నిపొంది, ఆ అనుభూతుల్ని బయటకి ప్రకటించే సమయంలోనే పాటపుట్టింది. కాలక్రమంగా అదే ఛందోబద్ధమై పద్యకవితగా

రూపొంది , పండితముఖంగా వెలువడి రాజాశ్రయంపొందింది. దానికి పూర్వరూపమైన 'పదం' అనేది పండితులచేత ఆదరించబడకపోగా అవమానాలు కూడాపొందింది. కానీ కాలానికి ఎదురునిల్చి అన్నిఅవాంతరాల్ని ఎదుర్కొంటూ , సామాన్యులనోళ్ళలోనే నానుతూ , చివరికి ఒకనాడు వెక్కిరించిన పండితులె మెచ్చుకొనేవిధంగా ఉన్నతస్థానాన్నిపొంది , పద్యకవితతోపాటు పదకవిత సరిపీఠాన్ని అలంకరించింది.

అలాసరిపీఠాన్ని అలంకరించేందుకు పదకవితకి తగిన బలాన్నిచ్చినవాడు పదకవితాపితామహుడైన తాళ్ళపాక అన్నమాచార్యుడు. అన్నమయ్యరచించిన సంకీర్తనలు ఆనాటిరాజులచేత , పండితులచేతకూడా ప్రశంసించబడ్డాయి. అన్నమయ్య తెలుగులోనూ , సంస్కృతంలోనూ సంకీర్తనలు రచించాడు. ముఖ్యంగా ఈయనకీర్తనలు వైష్ణవాన్ని ప్రతిబింబిస్తూ , ప్రచారంచేసేవిగా ఉండడంవల్ల అన్నమయ్యని వైష్ణవవాగ్గేయకారుడనవచ్చు. వైష్ణవాన్ని ప్రతిబింబింపచేస్తూ , అనేకభాషల్లోరచించిన వాగ్గేయకారులు అనేకులున్నారు.

<u>సంస్కృతవైష్ణవవాగ్గేయకారులు</u> :- భారతదేశానికంతటికి ఆది ప్రబంధకర్తగా చెప్పబడె జయదేవుణ్ణి మొదటి వైష్ణవవాగ్గేయకారుడు అనవచ్చు. అంతకుముందు భరతుడు , నారదుడు మొదలైనవారు ఉన్నా , వారుకేవలం లక్షణగ్రంథకర్తలుగానే కనిపిస్తున్నారు. 11-12 శతాబ్దాల మధ్యకాలంలో వెలువడిన "గీతగోవిందం" అనె మధురమైనకావ్యాన్ని

జయదేవుడు రచించాడు. గీతగోవిందంలో 24 అష్టపదులు, 80కి మించిన శ్లోకాలున్నాయి. ఇదిమొత్తం 12 సర్గల గేయప్రబంధం. ఇందులో రాధాకృష్ణుల ప్రేమవర్ణింపబడింది. మధురభక్తిని చెప్పిన మొదటికావ్యం ఇదే. ఇందులోని గేయాలు జయదేవుని అష్టపదులుగా ప్రసిద్ధిచెందాయి.

తర్వాత పేర్కొనదగినవాడు లీలాశుకుడు. ఇతడు "కృష్ణకర్ణామృతం" రచించాడు. ఇందులోని శ్లోకాలు సంపూర్ణభక్తికి నిదర్శనాలు. లీలాశుకుడు 13వ శతాబ్దంవాడు. ఇతని "కస్తూరితిలకం లలాటఫలకే, వక్షస్థలే కౌస్తుభం" వంటివి ఈనాటికీ ప్రచారంలోవున్నాయి.

తర్వాత పేర్కొనదగినవాడు శివనారాయణతీర్థులు. ఈయనకాలం 1580 - 1680. ఇతడు సంస్కృతంలో "శ్రీకృష్ణలీలాతరంగిణి" రచించాడు.

పై వారిని సంస్కృతంలో ప్రసిద్ధవైష్ణవవాగ్గేయకారులుగా చెప్పుకోవచ్చు.

**తమిళవైష్ణవవాగ్గేయకారులు** :- తమిళంలో వైష్ణవాన్ని ప్రచారంచేసిన మహాచార్యులైన ఆళ్వారులు పన్నెండుమంది కలిసిరచించిన గీతాలకి "నాలాయిరప్రబంధం లేదా దివ్యప్రబంధం" అనే పేర్లున్నాయి. ఇందులో విష్ణుభక్తి ప్రతిపాదకాలైనగీతాలు 4000 ఉన్నాయి. వీటికే పాశురాలనిపేరు.

ఈదివ్యప్రబంధం తెలుగుపదకవితాపితామహుడు అయిన అన్నమయ్యమీద ప్రభావంచూపి, ఆభావాలతోనే అనేకకీర్తనలు రచింపేట్లు చేసింది. ఈదివ్యప్రబంధం ముకుళితపద్మమైతే, అన్నమయ్య రచించిన ఆంధ్రవేదం ప్రఫుల్లసరోజం.

<u>కన్నడ వైష్ణవ వాగ్గేయకారులు</u> :- శ్రీమధ్వాచార్యుల ప్రశిష్యుడైన శ్రీపాదరాయలు (1451) (పద్మనాభతీర్థుల శిష్యుడు) కన్నడంలో "దేవరనామములు" అనబడే కీర్తనలని రచించాడు. పూజాసమయంలో కీర్తనలు పాడించే పద్ధతిని ఇతడే ప్రారంభించాడు. ఇతని శిష్యుడైన వ్యాసరాయస్వామి మనోహరమైన కీర్తనలు నూర్లకొలది రచించాడు.

ప్రముఖవైష్ణవ వాగ్గేయకారుడు పురందరదాసు వ్యాసరాయల ప్రియశిష్యుడు, కర్ణాటక సంగీతానికి పితామహుడు. ఇతడు మహాపండితుడు. 'వాగ్గేయకారచక్రవర్తి' బిరుదాంకితుడు. సూళాదులు, ఉగాభోగము అనేపదాల్ని రచించాడు.

ఇలాగే వ్యాసరాయలశిష్యుడైన హరిదాసు, కనకదాసు, గోపాలదాసు, విజయదాసు, జగన్నాథదాసులనేవారు కూడా కన్నడంలో అనేకకీర్తనలు రచించారు.

**ఇతరభాషల్లో వైష్ణవవాగ్గేయకారులు** :- సూరదాసు హిందీలో కృష్ణునిపై భక్తితో 'భక్తిరసపదాలు' రచించాడు. మీరాబాయి 16 వశతాబ్దంలో శ్రీకృష్ణునిభక్తురాలై హిందీ, రాజస్థానీ, గుజరాతీ, వ్రజభాషల్లో 2400 పదాల్ని రచించింది. హిందీలో కబీరుదాస్‌కూడా అనేకకృతుల్ని రచించాడు.

విద్యాపతి మైథిలీభాషలో క్రీ.శ. 14 వశతాబ్దిలో రాధాకృష్ణభక్తిని ప్రతిబింబించే పదాలురచించాడు. వంగభాషలో చండీదాసు 'కృష్ణపదాలు' రచించాడు. మహారాష్ట్రలో 13-14 శతాబ్దాలమధ్య నామదేవుడు అభంగవృత్తాలనబడే 'భావగీతికలు' రచించాడు. మహారాష్ట్రకుచెందిన సమర్థరామదాసు, భక్తతుకారాంలుకూడా 'అభంగులు' రచించి తరించారు.

**తెలుగు వైష్ణవవాగ్గేయకారులు** :- "తెలుగులో సంకీర్తనవాఙ్మయం కృష్ణమాచార్యులతోనే ఆరంభమైంది. ఈయన సంకీర్తనలు "సింహగిరివచనములు" అనేపేరుతో రచించాడు. ఇవివచనగంథులు. సింహాచలదేవాలయంలో ఆయన కీర్తించినట్లు, అతడు 12వశతాబ్దమునకు చెందినట్లు పరిశోధనలవల్ల తెలియవచ్చింది." [1]

వృత్తాలు, నిబంధపదాలు, చూర్ణాఖ్యలు అని పదాలు మూడురకాలు. తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు —

---

1. విస్సా అప్పారావు, మొదటి ఆంధ్ర వాగ్గేయకారుడు - నృత్యసంగీతవ్యాసరత్నావళి, ప్రట-4.

"ధర కృష్ణాచార్యాదిక
పరికల్పితపదము తాళబంధచ్ఛందో
విరహితమై చూర్ణాఖ్యం
బరగు ననిర్యుక్త నామభాసితమగుచున్ "[1]

అని కృష్ణమాచార్యుడు రచించినపదాలు చూర్ణాఖ్యాలని చెప్పాడు.

"కృష్ణమాచార్యుడు అనియతపదాలైన చూర్ణనామక వచనాలు రచించి తరించాడు."[2] కృష్ణమాచార్యునివచనాలు వైష్ణవభక్తిని ప్రతిబింబిస్తూ తర్వాతి వాగ్గేయకారులకి మార్గదర్శకాలయ్యాయి.

కృష్ణమాచార్యునితర్వాత తెలుగువైష్ణవవాగ్గేయకారులుగా తాళ్ళపాకకవులు ప్రసిద్ధిచెందారు. వీరుజీవించిన 15-16 శతాబ్దాలకాలం తెలుగుపదసాహిత్యానికి వసంతకాలంగా చెప్పుకోవచ్చు.

తాళ్ళపాకకవుల్లో పదకవితాపితామహుడైన అన్నమయ్య తర్వాత ప్రసిద్ధులైన పదకర్తలు పెదతిరుమలాచార్యుడు, చినతిరుమలాచార్యుడు. పెదతిరుమలయ్య అన్నమయ్యలాగే అధ్యాత్మ, శృంగార సంకీర్తనలేగాక,

---

1. దిమైనర్‌వర్క్స్ ఆఫ్ తాళ్ళపాకంపొయిట్స్, సంకీర్తనలక్షణం, పుట-147.
2. డా॥ ఎస్. గంగప్ప, తెలుగులో పదకవిత, పుట - 51.

వివిధప్రక్రియల్లో అనేకరచనలుచేశాడు. పెదతిరుమలయ్యసాహిత్యం భక్తి ప్రధానమైనప్పటికీ మతప్రచారదృష్టితో రాయబడడంవల్ల విశిష్టాద్వైతసిద్ధాంత విషయాలిందులో విరివిగా చోటుచేసుకున్నాయి. పెదతిరుమలయ్య ఆత్మశుద్ధితో, భక్తిశ్రద్ధలతోవర్ధిల్లి ఆచార్యపురుషుడై శిష్యుల్ని, అనుయాయుల్నికూర్చుకొని సుప్రసిద్ధులైన సమకాలికులకెందరికో మార్గదర్శకుడయ్యాడు.

చినతిరుమలయ్యకూడా వేంకటేశ్వరునిపై అధ్యాత్మ, శృంగారసంకీర్తనలురచించి, వైష్ణవమతప్రచారానికి అనేకమండలాల్లో సంచారంచేసి, శ్రీనివాసునికృపకు పాత్రుడయ్యాడు.

పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య అన్నమయ్య ప్రభావంతోనే తమకీర్తనల్లోనూ, ఇతరరచనల్లోనూ వైష్ణవభక్తిని స్థాపించి ప్రచారంచేశారు. తాళ్ళపాకచిన్నన్ననికూడా వైష్ణవవాగ్గేయకారునిగా ఆధ్యాతనులు చెప్తుతారు కాని అతని సంకీర్తనలు ఏవీకనబడవు. చిన్నన్నకూడా తాను సంకీర్తనలు రచించినట్లు తనమిగిలినరచనల్లో ఎక్కడా చెప్పుకోలేదు.

పదకవితాచక్రవర్తిగా పేరుపొందిన క్షేత్రయ్య (1590 - 1675) సంగీతసాహిత్యాలతోపాటు పదాలకి అభినయాన్నికూడాజోడించి విశేషప్రచారం కల్పించాడు. ఇతడు మువ్వగోపాలునిమీద పదాలురచించాడు.

" తెలుగుపదకవితాకన్యకు పితామహుడు తాళ్ళపాక

అన్నమయ్యగారంటిని. కాని జనకుడె క్షేత్రయ్య. ఆతమొదలుపెట్టినపనిని చలపాలముదాకా ఈడ్చిన తండ్రియాతడు." [1] అని రాళ్ళపల్లివారన్నారు. ఇతని కాలంనుంచె 'పదం' అంటె శృంగారపదమనె నిశ్చితార్థం వాడుకలోకివచ్చింది. పదాన్ని అభినయించడం క్షేత్రయ్య కాలంనుంచె ప్రారంభమైంది.

తర్వాత సిద్ధేంద్రయోగి పారిజాతాపహరణము, గొల్లకలాపము అనె యక్షగానాలు రచించాడు.

భద్రాచలరామదాసని ప్రసిద్ధికెక్కిన వైష్ణవభక్తుడు వాగ్గేయకారుడైన కంచర్లగోపన్న (1620-1680) రఘునాథభట్టాచార్యులనె గురువుద్వారా వైష్ణవాన్ని స్వీకరించి రామునిపై ఎన్నోకీర్తనలు రచించాడు. "తారకమంత్రము కోరిన దొరికెను" వంటివీరి కీర్తనలు ప్రసిద్ధాలు.

సారంగపాణి (1680-1750) చిత్తూరుమండలం, కార్వేటినగరసంస్థానంలో ప్రసిద్ధిపొందిన పదకర్త, వైష్ణవవాగ్గేయకారుడు. ఇతడు వేణుగోపాలముద్రతో అనేకపదాలు రచించాడు.

మునిపల్లె సుబ్రమణ్యకవి (1730-80)

---

1. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పదములు-క్షేత్రయ్య, ఆంధ్రపత్రిక, చిత్రభాను సంవత్సరాదిసంచిక - 1942-43, పుట-12.

అధ్యాత్మరామాయణాన్ని 6 కాండల్లో 104 కీర్తనలుగ రచించాడు.

ఇనుపసెనగల వెంకట్రామయ్య సంగీతసాహిత్యాల్లో నిష్ణాతుడు. ఇతడు 'గోపాలకృష్ణ' అనే ముద్రతో కీర్తనలు రచించాడు.

శంభోజీకాలం ప్రారంభంలో కుప్పుస్వామయ్య అనే వాగ్గేయకారుడు భక్తిశృంగారకీర్తనలని 'వరదవెంకట' ముద్రతో రచించాడు.

1767 లో జన్మించి, 1847 వరకు జీవించిన త్యాగయ్య శ్రీరామచంద్రునిపై 2400 కీర్తనలు రచించాడు. 'త్యాగరాజనుత' వంటి స్వనామముద్ర ఈ కీర్తనల్లో ఉంటుంది. 72 మేళకర్తరాగాల్లోనూ త్యాగయ్య కీర్తనలు రచించాడు. ఇతని ఘనరాగపంచరత్నకీర్తనలు ఈనాటికీ విశిష్టస్థానంలో ఉన్నాయి.

త్యాగయ్యతర్వాత మూవనల్లూరు సభాపతయ్య చెప్పుకోదగిన పదకర్త. ఇతడు 'రాజగోపాలసామి' అనే ముద్రతో కీర్తనలురచించాడు.

త్యాగయ్యశిష్యులు, ప్రశిష్యులుగా చెప్పుకోదగిన వీణకుప్పయ్య, తిరువొత్తియూరు త్యాగయ్య, మానంబుచవడి వెంకటసుబ్బయ్య, పల్లవిశేషయ్య, వాలాజాపేట వెంకటరమణభాగవతులు, సదాశివరామ, కృష్ణస్వామిభాగవతులు, పట్నం సుబ్రహ్మణ్యయ్య మొదలైనవారు కూడా

విష్ణ్వవతార కీర్తనలు రచించి వైష్ణవ వాగ్గేయకారులయ్యారు.

స్వాతితిరునాళ్‌మహారాజు సంస్కృతాంధ్ర మళయాళ భాషల్లో ప్రసిద్ధ వైష్ణవ వాగ్గేయకారుడు. ఇతనికే 'కులశేఖరపెరుమాళ్' అనిపేరు. అనేక పదవర్ణాలు, పదాలు, తిల్లానాలు, కృతులు రచించాడు.

కంచి వేంకటాద్రిస్వామి రచించిన కీర్తనలు వేంకటాద్రిస్వామి కీర్తనలన్నపేరుతో ప్రసిద్ధమయ్యాయి. ఇతడు వైష్ణవభక్తుడు. దివ్యనామ సంకీర్తనంతోపాటు హెచ్చరికలు, లాలిపాటలు, మంగళారతులు, భగవంతునితో భక్తుని సంవాదాలు మొదలైనకీర్తనలు ఎన్నోరచించాడు.

తూము నరసింహదాసు త్యాగరాజుకు సమకాలికుడు. ఇతడు 'తూమునరసింహదాస' అనేముద్రతో రామునిపై కీర్తనలురచించి వైష్ణవ వాగ్గేయకారుడయ్యాడు. భద్రాచలరామునికి ఇతనికీర్తనలు అంకితాలు.

ఆధునికయుగంలో చెప్పుకోదగిన వైష్ణవవాగ్గేయకారులుగా తచ్చూరి పెదసింగరాచార్యులు, చినసింగరాచార్యులు, ప్రయాగరంగశర్మ, అత్యాధునికుల్లో హరినాగభూషణం, నల్లాన్‌చక్రవర్తుల వేంకటనారాయణాచార్యులు, మంగళంపల్లి బాలమురళీకృష్ణ మొదలైనవారిని చెప్పుకోవచ్చు.

తెలుగు సంకీర్తనాసాహిత్యానికి నిర్దిష్టరూపంఏర్పరచి,

ద్వారా వైష్ణవాన్ని ప్రచారం చేసి , తనతరువాతి వాగ్గేయకారులకి మార్గదర్శకుడై , సంకీర్తనాచార్యుడుగా , పదకవితాపితామహుడుగా ప్రసిద్ధి చెందాడు తాళ్ళపాక అన్నమాచార్యుడు.

అన్నమయ్య తెలుగుపదకవితకి ఆద్యుడేకాదు, అనవద్యుడు కూడా. అనిబద్ధకవిత్వాన్ని నిబద్ధకవిత్వంగా ఒకరూపంఏర్పరచి , ఏదిక్కూలేకుండా పామరజనులనోళ్ళనే ఆశ్రయించుకొనిఉన్న పదకవిత్వానికి సంప్రదాయబద్ధంగా కొన్నిలక్షణాలుఏర్పరచి , వాటిని సంకీర్తనాలక్షణాలుగా నియమించి , వాటికి లక్ష్యప్రాయాలుగ వేలకొలది సంకీర్తనలురచించాడు అన్నమయ్య. అన్నమయ్యకీర్తనలు విన్నతర్వాతే అప్పటిదాకా ఈసడించుకొని చిన్నచూపుచూసిన పండితులు పదకవిత్వాన్నివిని మైమరచి ప్రశంసించారు. రాజులుసైతం పద్యకవితతో సమానమైన పీఠంఇచ్చి పదకవితని గౌరవించడం అన్నమయ్య సంకీర్తనలతోనే ప్రారంభించారు.

తెలుగుపదకవిత్వానికి ఇంతటిగౌరవాన్నితెచ్చిపెట్టిన అన్నమయ్య తన 8వఏటనే తిరుపతివెళ్ళి , అక్కడే భక్తితో శ్రీనివాసునిపై కీర్తనలు , శతకాలు చెప్పడం మొదలుపెట్టాడు.

స్వామి ఆదేశానుసారంగా ఘనవిష్ణుడనేవైష్ణవయతి అన్నమయ్యని చేరదీసి , వైష్ణవముద్రాంకితునిగాచేసి , శరణాగతిధర్మాన్ని బోధించాడు. ఆనాటినుంచి అన్నమయ్య వైష్ణవుడై —

"విష్ణుడే యుండెనని భావించుటే బుద్ధి
వైష్ణవుడై యాచార్యసేవ సేయుటే బుద్ధి" (సం.2-కీ.195)

"వైష్ణవులుగాని వారలెవ్వరును లేరు
విష్ణు ప్రభావ మీవిశ్వమంతయుగాన" (సం.1-కీ.36)

వంటికీర్తనలు అనేకం రచించాడు. విష్ణువు అలంకారప్రియుడు, శృంగార రసాధిదేవత. కాబట్టి ఒక్క అధ్యాత్మకీర్తనలే కాకుండా శృంగారకీర్తనలు కూడా రచించాడు. "సహజవైష్ణవాచార వర్తనుల సహవాసమే మాసంధ్యని" చెప్పుకున్న అన్నమయ్య వైష్ణవమతాన్ని స్వీకరించినతర్వాత తనకీర్తనలద్వారా ఆమతాన్నే ప్రచారంచేశాడు. వైష్ణవాచార్యుడై సాళువనరసింగరాయలకొలువులో సకలమర్యాదలూపొంది, తలెత్తిన అతని అహంకారాన్ని వైష్ణవలక్షణమైన సహనంతోనూ, తనసంకీర్తనామహిమతోనూ, శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహంతోనూ అంతమొందించాడు. అతన్ని వైష్ణవభక్తునిగా మార్చాడు. శ్రీనివాసుని అనుగ్రహంతో తనకబ్బిన సంకీర్తనారచనాశక్తిని చివరికి స్వామికే అర్పించి ధన్యుడయ్యాడు. సంకీర్తనలేకాక ద్విపదలో రామాయణం (అలభ్యం), సంస్కృతంలో వేంకటాద్రిమాహాత్మ్యం (అలభ్యం), శృంగారమంజరి, 12 శతకాలు (వేంకటేశ్వరశతకమొక్కటేలభ్యం), సంస్కృతంలో సంకీర్తనాలక్షణం (అలభ్యం) మొదలైనవి రచించిన అన్నమయ్య 1503 లో ఫాల్గుణబహుళద్వాదశినాడు శ్రీనివాసునిలో ఐక్యమయ్యాడు.

అన్నమయ్య కేవలం తెలుగువాగ్గేయకారుడే కాదు. సంస్కృతంలో కూడా ఆయన నూర్లకొలది సంకీర్తనలు రచించి వెంకటేశ్వరునికి అంకితమిచ్చాడు.

తమిళంలో 4000 కీర్తనలతో నాలాయిరదివ్యప్రబంధాన్ని రచించిన ఆళ్వార్లలో నమ్మాళ్వారికీ , అన్నమయ్యకీ పోలికలున్నాయి. నమ్మాళ్వారు పుట్టిన వైశాఖమాసం , విశాఖానక్షత్రంలోనే అన్నమయ్య జన్మించాడు. నమ్మాళ్వారు స్వామి కౌమోదకాంశతో జన్మిస్తే , అన్నమయ్య నందకాంశతో జన్మించాడు.

ఆళ్వారులు పన్నెండుమందికలిసి రచించిన దివ్యప్రబంధం 4000 మాత్రమే కీర్తనలు కలదికాగా , ఆంధ్రవేదం అనిపించుకున్న అన్నమయ్య సంకీర్తనలు 32000 కిపైగా ఉన్నాయి. అందుకే అన్నమయ్య ద్రావిడాగమసార్వభౌముడిగా ప్రసిద్ధికెక్కాడు.

గంగప్పగారు "అన్నమయ్య ఆనాడు జానపదుల వాడుకలో ఉండే జానపదగేయరీతుల్ని అనేకం తనపదాల్లో ఉపయోగించుకున్నాడు. అలాంటి పాటలలో జాజరలు , చందమామపదాలు , తుమ్మెదపదాలు , లాలి, సువ్వి , గొబ్బి , ఉయ్యాల , లాల , జోల , శోభన , మంగళపదాలు , మేల్కొలుపులు , నలుగులు , దంపుళ్ళు , కోట్నాలు , కూగూగులు , అల్లోనేరేళ్ళు , భాంగుభళాలు ,

తందనాలు, వెన్నెలపదాలు మొదలైనవెన్నో వాడుకున్నాడు"[1] అన్నారు.

"అన్నమాచార్యుడు అద్వితీయ ప్రతిభాశాలి, ఋషికల్పుడు. పదంయొక్క అనంతరూపాలను తనరచనలలో ప్రదర్శించాడు. సంవాదగీతాలు అన్నమయ్యకీర్తనలలో కొల్లలు; గోపికకు కృష్ణునకు సంవాదం; చెంచెతకు వెంకటేశ్వరునకు; యశోదమ్మకు గోపికలకు; బావామరదళ్ళ పరియాచక సంవాదాలు; అత్తాకోడళ్ళ (లక్ష్మీసరస్వతుల) ఎత్తిపొడుపుల సంవాదం - ఈవిధంగా ఎన్నో అన్నమయ్య శృంగారవైరాగ్యాలను పరిపూర్ణంగా సమానస్థాయిలో ఆరాధించాడు. తనతర్వాతి పదకర్తలకు, కీర్తనకర్తలకు ఆయన మార్గదర్శి అయ్యాడు"[2] అని బాలాంత్రపు రజనీకాంతరావుగారన్నారు.

అన్నమయ్యలో శార్ఙ్గదేవుడు మొదలైనవారుచెప్పిన వాగ్గేయకారునికుండవలసిన లక్షణాలు అన్నీ ఉన్నాయి.

అన్నమయ్య బాల్యంనుంచే కీర్తనలు చెప్పడం మొదలుపెట్టాడు. ఇలా జన్మతః వాగ్గేయకారుడైన అన్నమయ్యకి వాగ్గేయకారుడి ఘనతకి అత్యావశ్యకాలైన శార్ఙ్గదేవాది శాస్త్రకారులుచెప్పిన శబ్దానుశాసనం, అభిధాన ప్రవీణత మొదలైన ముఖ్యధర్మాలు, లక్షణాలు సంపూర్ణంగా ఉన్నాయని

---

1. డా॥ ఎస్. గంగప్ప, తెలుగులో పదకవిత, పుట - 59.

ఇతని కీర్తనలవల్ల తెలుస్తోంది. అన్నమయ్య కీర్తనల్లో లోకజ్ఞానం , అశేష భాషాపరిజ్ఞానం , సంగీతశాస్త్ర ప్రావీణ్యత మొదలైన లక్షణాల్నిబట్టి అన్నమయ్యను ఉత్తమవాగ్గేయకారుడనవచ్చు.

తదేకాయత్తచిత్తంతో వేంకటేశ్వరాంకితాలుగా వైష్ణవాన్ని ప్రతిష్ఠింపచేస్తూ అన్నమయ్య దినమునకొక్క సంకీర్తనచొప్పున వెలయించినట్లు అన్నమాచార్యచరిత్రనిబట్టి తెలుస్తోంది. అసలు అన్నమయ్య 16వ ఏడునుండి స్వామిఅనతిమీద సంకీర్తనలుచెప్పడం మొదలుపెట్టినట్లు రాగిరేకులమీద కనిపిస్తుంది. కానీ అన్నమయ్య రోజుకి ఒకటికిపైనే కీర్తనలుచెప్పి ఉంటాడని పెద్దల అభిప్రాయం.

"అన్నమాచార్యుడు మాటనేర్పుగలకవి. ఆమీద భావుకుడైన భక్తుడు. ఈరెండునుగలసి ఇతని కవిత్వమునకొకవింతశోభ కూర్చినవి. ఇతడేది చెప్పినను వినవలెననిపించును. తానుచెప్పునది తానెరుగును. చెప్పవలసినతీరు తనకే తెలుసును. ఏవిషయమైననుసరే చెప్పవలసినప్పుడు తానుముందది తన హృద్వీధికి తెచ్చుకొని, దాని ఉట్టుముట్టు అనవాళ్ళన్నియు గ్రహించి , ఆకళించుకొనిగాని చెప్పడు. చెప్పునప్పుడు చెప్పినదే చెప్పినను విసుగురానిధోరణిలో మాటలుపేర్చి , మనకంటిముందు ఆ విషయమును మూర్తికట్టించి , మాటకుమాటతోడిచ్చి , భావమునకున్న బరువంతయు దానిలోనిమిడ్చి , మనహృదయమునకత్తునట్లు చెప్పును.

నిర్ణయముచేసి , నిర్ణయించిమరీచెప్పను" [1] అనిముట్నూరిసంగమేశంగారన్నారు.

ఇలాచెప్పినకీర్తనలు కీర్తనీయాలు కాకుండా ఉంటాయా! అన్నమయ్య ఒక్కొక్కకీర్తనే ఒక్కొక్క దివ్యప్రబంధంగా భాసిస్తుంది. ఒక్కొక్క కీర్తనకి సరైనవ్యాఖ్యానంరాస్తే అదొక ఉద్గ్రంథమౌతుంది. అంతటి మహోత్తరమైనకీర్తనలు అన్నమయ్యగళంనుండి వెలువడ్డాయి.

అన్నమయ్యకీర్తనల్లో ప్రబంధాల్లోలాగే పరమాత్మ అయిన వేంకటేశ్వరుడు నాయకుడిగాను , అలమేలుమంగ నాయికగాను , ఒక్కసారి తానే నాయికగాను అయి వ్యవహరించి శృంగారకీర్తనలురచించాడు. ఈరీతిగా ప్రబంధరీతుల్ని చూపించాడు. అలాగేసంవాదగీతాల్లో నాటకీయఫణితులు కనిపిస్తాయి. అసలు ఒక్కోకీర్తన లోకనీతి, ధర్మోద్బోధ , భూతదయ , వివిధ మనస్తత్త్వాలపరిశీలనవంటి ఎన్నో విశేషాంశాలతో ఒక్కోకావ్యంగా భాసిస్తూంటుంది. ఈకీర్తనల్లో పురాణయుగంలోఉండే సరళత, దేశీపలుకుబడులు , నానుడుల తియ్యదనాలు కనిపిస్తుంటాయి.

నన్నయ ఎలాగైతే ఆదికవిఅయ్యాడో , అన్నమయ్య కూడా ఆదిపదకవి అయ్యాడు. అమేయమూ , అపూర్వమూఅయిన సర్జనశక్తి , కళాశిల్పదృష్టి , రసభావస్పందన అన్నమయ్యకున్నాయి. నన్నయకిపూర్వం

---

1. డా॥ ముట్నూరి సంగమేశం , అన్నమాచార్యసాహితీకౌముది , పుట - XI

పద్యకవిత ఉన్నా దానికి ఒకసుస్థిరరూపం, ప్రామాణికత లేకపోతే నన్నయ్య వ్యాకరణగ్రంథాన్నిరచించి, దానికొక నిర్దుష్టప్రమాణాలేర్పరచి సక్రమమార్గంలో భాషాప్రయాణాన్ని సాగింపజేసినట్లు, అన్నమయ్యకూడా అనిబద్ధంగా, అస్థిరంగా ఉన్న పదకవితకి లక్షణగ్రంథంరచించి, కొన్నినిర్దుష్టప్రమాణాలేర్పరచి, పదసాహిత్యలోకంలో అగ్రగామిగా నిలిచాడు. జానపదుల వాగ్వ్యవహారంలో ఉన్న దేశీవరుసల్ని ఉద్ధరించి, శిష్టరచనచేసి సంకీర్తనాపద్ధతికి ఆద్యుడయ్యాడు. తానురచించిన సంకీర్తనలక్షణగ్రంథానికి లక్ష్యాలుగా చెప్పదగిన వేలకివేలపదాలురచించి తర్వాతివాగ్గేయకారులకిమార్గదర్శకుడయ్యాడు. వాగ్గేయకారులందరి సారస్వతానికి అన్నమయ్యసారస్వతమే బీజంగా, భిక్షగా అయి అదే తర్వాతికాలాల్లో శాఖోపశాఖలుగా విస్తరించింది.

అన్నమయ్యగురించి బాలాంత్రపురజనీకాంతరావుగారు-

"మనసాహిత్యవిమర్శకులు సామాన్యముగా గేయకవిని కవియనుటకే సంకోచింతురు. మహాకవియనుటెక్కడిది. రవీంద్రనాథ్‌ఠాకూర్ మౌలికముగా వంగభాషలో గేయకవియె. గాయకుడుకూడాను. ఆయనరచనలు కొన్నిమాత్రముఎంచి ఆంగ్లీకరించిపంపగా వాటినిబట్టి ఆయనకు "నోబెల్" బహుమతియిచ్చి విశ్వకవి పదమిచ్చినారు. ఆయననేమాత్రము తగ్గించుటకుకాదుగాని, ఆయనకంటె ఎక్కుడుగా తెలుగుదేశపు జీవితమును, తెలుగుజీవితపు ఆటపాటలను, సుఖదుఃఖాదికములను తెలుగుపడుచుల ఆశలను, స్వప్నములను, వలపుఒద్దికలను, తెలుగుప్రేమికుని శృంగారవీరత్వమును కూలంకషముగా ప్రదర్శించిన వాగ్గేయకారుడైన మహాకవి, మహాగేయకవి

అన్నమాచార్యుడు. అన్నమాచార్యుడు నారుపోయని తెలుగుసాయక్షేత్రమున క్షేత్రయ్య పదోద్యానముగాని, త్యాగరాజు కీర్తనాబృందావనముగాని ప్రభవించెడివి కావు అంటే ఎంతమాత్రము అతిశయోక్తికాదు "[1] అని అన్నారు.

"దాచుకో నీపాదాలకుఁ దగనేఁ జేసిన పూజలివి
పూఁచి నీకీరితి రూపపుష్పము లివియయ్యా
వొక్క సంకీర్తనె చాలు వొద్దికై మమ్ము రక్షించఁగ
తక్కినవి భండారాన దాఁచివుండనీ" (సం.2-కీ.338)

అని అన్నమయ్య తనవైష్ణవభక్తితత్త్వాన్ని చాటుకొని, తనవరప్రసాదంగావచ్చిన (సంకీర్తన) రచనలద్వారా పేరు ప్రఖ్యాతులు గడించి, కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీనివాసుని సంకీర్తనాసుమాలతో అర్చించి, లోకానికి భక్తి, జ్ఞాన, వైరాగ్య, నీతి బోధలనిచేసి, సంకీర్తనాజగత్తుకే ఆచార్యుడిగా, తనతర్వాతి పదకర్తలందరికీ మార్గదర్శకుడిగా వెలసొంది, పామరజనుల్లో ఉన్న మౌలిక విషయాలన్నిటినీ తనసంకీర్తనలద్వారా, రచనలద్వారా ప్రజలనాల్కలపై నడయాడేట్లుచేసి 'ప్రజాకవి' అనిపించుకున్నాడు అన్నమయ్య. అందుకే అన్నమయ్య వాగ్గేయకారులంతా చుక్కల్లా మినుకుమినుకుమంటూంటే చంద్రుడిలా ప్రకాశిస్తూ కనిపిస్తాడు సంకీర్తనాకాశంలో.

---

1. అన్నమాచార్యులవారి అధ్యాత్మశృంగార సంకీర్తనలు (స్వరసహితం), ప్రథమసంపుటం, పుట - XXX.

వైష్ణవభక్తుల్ని స్తుతించి , వైష్ణవపూజావిధానాలను సూచించి , వైష్ణవభక్తితత్త్వాన్ని తనకీర్తనల్లో నింపిన అన్నమయ్య ముక్తికి భక్తిమార్గాన్ని చూపి తాను తరించి , ఇతరులను తరింపజేసిన ధన్యమూర్తి . చిరస్మరణీయుడై , భారతీయభాషల్లోని వైష్ణవవాగ్గేయకారులందరిలో ఒక ప్రత్యేకమైన , సముచితమైనస్థానాన్ని సంపాదించుకున్నాడని చెప్పవచ్చు.

# ఉపయుక్త
# గ్రంథమాలిక

1. అన్నమాచార్యులు, తాళ్ళపాక – అధ్యాత్మసంకీర్తనలు, సం-1, టి.టి.డి. ముద్రణ.

2. అన్నమాచార్యులు, తాళ్ళపాక – అధ్యాత్మసంకీర్తనలు, సం-2, టి.టి.డి. ముద్రణ.

3. అన్నమాచార్యులు, తాళ్ళపాక – అధ్యాత్మసంకీర్తనలు, సం-3, టి.టి.డి. ముద్రణ.

4. అన్నమాచార్యులు, తాళ్ళపాక – శృంగారకీర్తనలు, సం-12, టి.టి.డి. ముద్రణ.

5. అన్నమాచార్యులు, తాళ్ళపాక – శృంగారకీర్తనలు, సం-25, టి.టి.డి. ముద్రణ.

6. అన్నమాచార్యులు, తాళ్ళపాక – శృంగారకీర్తనలు, సం-30, టి.టి.డి. ముద్రణ.

7. అన్నమాచార్యులు, తాళ్ళపాక – శృంగారకీర్తనలు, సం-32, టి.టి.డి. ముద్రణ.

8. అప్పారావు, విస్సా – మొదటి ఆంధ్ర వాగ్గేయకారులు

9. అప్పారావు, పోణంగి – వైఖానసాగమము (తెలుగు అనువాదం), టి.టి.డి. ప్రచురణ, 1993.

10. అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి – పదములు – క్షేత్రయ్య, ఆంధ్రపత్రిక, చిత్రభాను, సంవత్సరాది సంచిక, 1942-43.

11. ఆనందమూర్తి, వేటూరి, డా॥ – వైష్ణవాంధ్ర వాఙ్మయం

12. ఆనందమూర్తి, వేటూరి, డా॥ – తాళ్ళపాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు, ప్రథమముద్రణ - 1974.

13. ఆళ్వారాచార్యులు – నిత్యానుసంధానం, వావిళ్ళ రామస్వామి & సన్స్ ప్రకటితం - 1953.

14. కులశేఖరాళ్వార్ – ముకుందమాల

15. గంగప్ప, ఎస్., డా॥ – అన్నమాచార్య పురందరదాసుల సమాగమం, భారతి, జూన్ - 1982.

16. గంగప్ప, ఎస్., డా॥ – తెలుగులో పదకవిత, ప్రథమముద్రణ-1983.

17. చిన్నన్న, తాళ్ళపాక – శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము, టి.టి.డి. ముద్రణ - 1978.

18. టి.టి.డి. ముద్రణ – దిమైనర్ వర్క్స్ ఆఫ్ తాళ్ళపాకం పొయిట్స్, టి.టి.డి. ముద్రణ.

19. రామానుజస్వామి, తి.వ. – శ్రీ వైష్ణవ ఆచార నిర్ణయం, వేంకటరమణ ముద్రణాలయం - 1974.

20. టి.టి.డి. ముద్రణ – అన్నమాచార్యులవారి అధ్యాత్మ శృంగార సంకీర్తనలు (స్వరసహితం), ప్రథమసంపుటం, 1980.

21. తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ – శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు, 5వ సంపుటం.

22. దొరసామిశర్మ, రావూరి, విద్వాన్ – అప్పకవీయ భావ ప్రకాశిక, త్రివేణి పబ్లిషర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రథమముద్రణ, 1967.

23. నరసింహాచార్య, కిడాంబి, డా॥ – తిరునామములు - సమగ్రపరిశీలనము, పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్, అక్టోబర్ - 1984.

24. రజనీకాంతరావు, బాలాంత్రపు – ఆంధ్ర వాగ్గేయకారచరిత్రము.

25. రామకృష్ణారావు, అడపా – అన్నమాచార్యులు, సాహిత్య అకాడమీ, 1991.

26. రామానుజాచార్యస్వామి, మొలుగు – శ్రీవైష్ణవ ఆహ్నికం - నిత్యకర్మానుష్ఠాన విభాగం, ప్రథమభాగం.

27. వీరరాఘవులు, గరిమెళ్ళ - విష్ణుతత్త్వము - విగ్రహము.

28. శ్యామసుందరి, ముత్య - అన్నమాచార్యుని మధురకీర్తనలు (సేకరణ), గొల్లపూడి వీరాస్వామి & సన్స్ ప్రచురణ - 1993.

29. శేషాచలం నాయుడు, మన్నం - శ్రీమత్పరమ వైదిక సిద్ధాంత ప్రదీపిక.

30. శ్రవణ్ కుమార్, డి.వి., డా॥ - తాళ్ళపాక కవుల లఘుకృతులు - సవిమర్శక పరిశీలన.

31. శ్రీ ప్రసాద భూపాలుడు - ఆంధ్ర విజ్ఞానం.
( జమీందార్ ఆఫ్ దేవిడి )

32. శ్రీరఘునాథాచార్యులు, నల్లాన్ - విశిష్టాద్వైత వైభవము
చక్రవర్తుల

33. శ్రీరామకృష్ణమఠము ప్రచురణ - ముండకోపనిషత్
( మైలాపూరు )

34. శ్రీ వెంకటరామిరెడ్డి, దొడ్ల - నారదభక్తి సూత్రములు (అనువాదం) రామకృష్ణమఠం ప్రచురణ.

35. సంగమేశం, ముట్నూరి, డా॥ - అన్నమాచార్య సాహితీకౌముది.

36. సంజీవ నారాయణదాసు, శేగు - గీతాసంగీతము.

37. సూర్యనారాయణరావు, వక్కంతం - పురందరోపనిషత్ (అనువాదం) తి.తి.దే. ముద్రణ.